అభ్యుదయ

సచిత్ర సాహిత్య మాసపత్రిక

సంపుటి 2	1948 జులై	సంచిక 7

సంపాదకులు:

కొమర్రాజు వినాయకరావు

ప్రయాగ కోదండరామశాస్త్రి

★

గౌరవ సంపాదకులు

మల్లంపల్లి సోమశేఖరశర్మ
పి. వి. రాజమన్నారు
దేవులపల్లి కృష్ణశాస్త్రి
తుమ్మల వెంకటరామయ్య
కొడవటిగంటి కుటుంబరావు

వెల ఆరణాలు


అభ్యుదయ ఆంధ్ర అభ్యుదయ రచయితల మాస పత్రిక

Editor, Printer & Publisher : K. Vinayaka Rao
Secretary, Andhra Progressive Writers' Association, Governorpet.
Printed at Abhyudaya Press, Vijayawada.

పదండి ముందుకు!

శ్రీ శ్రీ

★



మరో ప్రపంచం మరో ప్రపంచం
మరో ప్రపంచం పిలిచింది—

పదండి పోదాం వినబడలేదా
మరో ప్రపంచపు జలపాతం?
కనబడలేదా మరో ప్రపంచపు
కణకణమండే త్రేతాగ్ని?

ఎగిరి ఎగిరి పడుతున్నవి
ఎనభై లక్షల మేరువులు!
తిరిగి తిరిగి తిరిగి సముద్రాల్
జలప్రళయ నాట్యం చేస్తున్నవి!

సలసల కాగే చమురా, కాదిది,
ఉష్ణ రక్త కాసారం!
శివ సముద్రమూ నయాగరా వలె
ఉరకండీ, ఉరకండీ ముందుకు!

పదండి ముందుకు, పదండిపోదాం!

విజ్ఞాన సింధువు: లక్ష్మణరావు

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ

గడచిపోయింది లక్ష్మణరాయ శకం. తమ విద్యా విజ్ఞానాలు పెంపొందించడమే పరమాశయంగా జీవితలక్ష్యంగా పెట్టుకొని తమకోసం పాటుపడి ఆంధ్రజాతీయాభ్యుదయానికి తోవలు చేసిన లక్ష్మణరాయని మరచిపోయినారు ప్రజలు. ఇక ఇప్పుడాయనను మనకు జ్ఞాపకంచేసే భౌతిక చిహ్నమల్లా అదిగో కొద్ది గొప్ప, బీద సాద అనే భేదం లేకుండా అందరిని తన విశాలమయిన సర్వ సమత్వపు ఒడిలో పెట్టుకొని ఒక్క తీరున లాలించే పవిత్రమయిన మద్రాసు ఓటేరి రుద్రభూమిలో ఆ చిన్న సమాధే.

ఆయన సేవాభాగ్యం సంతరించుకొని ఆంధ్రదేశం కొత్త జవసత్వాలు గడించి పురోగమించింది కొంత. రాగల తరాల వారు, వారేకాదు, ఈ తరంవారుకూడా తాము అభ్యున్నతిసౌధం ఎక్కడానికి ఒక గొప్ప సోపానం విరచించిపోయిన ఆ సిద్ధ శిల్పిని విస్మరింపవచ్చు కాని నేనున్నాను గనుకనే నా పైమెట్టు ఎక్కగలిగారు మీరని ఆసోపానం మూగినోటితో ప్రబోధిస్తూనే ఉంటుంది. కాలజ్ఞులకు మాత్రమే వినవచ్చే ప్రబోధం అది.

మహారాష్ట్ర ప్రముఖ సాంగత్యం, మహారాష్ట్రదేశ నివాసం, మహారాష్ట్ర భాషా వైదుష్యం చిన్నతనంలోనే దొరికి లక్ష్మణరావుగారిలో ఒక అపూర్వ సంస్కారం కలిగింది.

నాగపూరులో పట్టపరీక్షలో ఉత్తీర్ణులైనంతవరకు విద్యగరచి ఒక విధంగా మహారాష్ట్రులే అయినారు. మహారాష్ట్రవిమర్శలదృష్టి, మహారాష్ట్రుల పట్టుదల. మహారాష్ట్రుల దేశాభిమానము, మహారాష్ట్రుల సేవానురక్తి ఇవన్నీ మృదులమయిన ఆయన లేతమనస్సుకు బాల్యంనుంచి తీర్పులు దిద్ది దానిని ఉత్తేజపరిచినవి. బ్రతికి చెడ్డజాతి మనది అనే భావం అడుగడుగునా కరేలు మంటూ పొటమరిస్తూ ఉండేది ఆయన మనస్సులో. స్వాతంత్ర్యం గోల్పోయి పరాధీనమైన జాతి తనది. దాని నుద్ధరించటం ఎట్లా అనేదే ఆయన ధ్యేయం

అయినది. తమ జాతిని పైకి లేవనెత్తడానికి మహారాష్ట్రులు చేస్తున్న ప్రయత్నాలనన్నింటిని చక్కగా ఆకళించుకొన్నారు లక్ష్మణరావుగారు. వాఙ్మయాన్ని సాధనగా చేసికొని తన దేశీయుల హృదయాలలో స్వాతంత్ర్య విజ్ఞానభావాలు వెదజల్లి దేశంలో కృషి సాగించాలనే దృఢ నిశ్చయము కలిగిందాయనకు. కలకత్తా విశ్వవిద్యాలయంలో యమ్. యే. పట్టం పుచ్చుకొని ఆంధ్రదేశానికి వచ్చారు లక్ష్మణరావుగారు. ఆయన వచ్చేసరికి-

ఆంధ్రదేశం విద్యావిహీనతలో ఆధునిక విజ్ఞాన దారిద్ర్యంలో కన్నుగానక తడవులాడుతోంది. అజ్ఞానాంధకారం తొలగించి దేశీయ హృదయాలలో విజ్ఞానదీపం వెలిగించడానికి అప్పటికే అలుపెరగని దీక్షతో పాటుబడుతున్నాడు వీరేశలింగం పంతులు. ఆయన ఆదర్శం ముందుంచుకొని సేవావ్రతానికి తోరం కట్టారు లక్ష్మణరావుగారు. ఇంతలో వందేమాతరం ఉద్యమము వచ్చింది; లక్ష్మణరావుగారి ఆశయాలకు ఉత్సాహమూ, కార్యదీక్షకు పదును చేకూర్చింది. ఆరోజులలో ఆయన స్వదేశీ వ్రతం పాటించిన పుణ్యశాలి. జాతీయవాది. ఆంధ్రజాతీయతకు పాదులు చేసి దానిని ప్రోదిచేసిన విజ్ఞానచంద్రిక ఆయన సంకల్పంలో నెలకొని ఆవిష్కృతి పొందినది ఆరోజులలోనే. విజ్ఞాన చంద్రికను వెలయించి లక్ష్మణరావుగారు దేశీయ హృదయాలను దీప్తితో నింపారు.

విజ్ఞానచంద్రికా గ్రంథమాలను నడిపిన శక్తియుక్తులు ప్రధానంగా లక్ష్మణరావుగారివే. ఈ గ్రంథమాలను నిర్వహించడంలో లక్ష్మణరాయని కార్యనిర్మాణచతురత వ్యక్తమయింది- అదే ఆంధ్రదేశంలో వెలసిన మొదటి గ్రంథమాల; తరువాత అనంతంగా వెలసిన గ్రంథమాలలకన్నిటికీ దారిచూపిన వేగుచుక్క. 1906 మొదలు 1916 వరకు పదిసంవత్సరాలలో స్వాతంత్ర్యాభిలాషను పురికొల్పే దేశచరిత్రలు యువజనులకు ఆదర్శప్రాయులై ప్రపంచాభ్యున్నతికి కారణభూతులైన మహాపురుషుల జీవితచరిత్రలు - వైజ్ఞానిక గ్రంథములు ప్రకృతిశాస్త్రములు మొదలయినవి యీ గ్రంథమాలలో ఎన్నో ప్రకటితములై దేశీయుల హృదయక్షేత్రాలలో జాతీయతా, విజ్ఞానభావాలను పైరు పెట్టినవి. రసాయనశాస్త్రం ప్రకటితమయిన తరువాత తెలుగు దేశంలోని స్వర్ణకారులు కొందరు ఆ గ్రంథాన్ని దగ్గిర పెట్టుకొని కొన్ని ప్రయోగములు (Experiments) చేస్తూ వచ్చిన విషయం నాకు తెలుసునని దర్పముతో తమ మిత్రులతో చెపుతూ ఉండేవారు లక్ష్మణరావుగారు. అప్పుడు తాము చేసిన పనికి గలిగిన ఫలితం ప్రత్యక్షంగా తెలిసి ఆయన పొందిన ఆనందం విశాలములైన ఆకన్నులలో విచిత్రకాంతితో మెరుస్తూ ఉండేది. ఆయన కెంత సంతోషం కాకేమి, ఆయన నాటిన విజ్ఞానచంద్రిక క్రమక్రమంగా వర్ధిల్లి ఏడువేల మంది చందాదారుల కాశ్రయ సీమయై విజ్ఞాన వృష్టిని కురిపిస్తున్నప్పుడు!

విజ్ఞానచంద్రికా గ్రంథమాల స్థాపించి లక్ష్మణరావుగారు తాము గ్రంథములు వ్రాసినారు ఇతరులచేత వ్రాయించి ఉత్తమ రచయితలను తయారు చేసినారు. ప్రకటిత

మైన ప్రతిగ్రంథమూ ఆయన తీవ్ర పర్యవేక్షణమునకు గురియైనదే. ఎందువల్ల? విజ్ఞానచంద్రిక ఉత్తమగ్రంథ ప్రకటనసంస్థ; దానిలోని గ్రంథాలు సానబట్టిన రత్నాలు అని పేరురావాలనే ఆయన కాంక్ష. ఏదో ఒకపని చేశామనికాదుతృప్తి; చేసినపనిలో వొంపు టొంపు లుండగూడదు: ఉత్తమమయినది కావాలనే ఆయన అభిలాష. ఆయన జీవితాన్ని నడిపిన దివ్యకీలకం ఇదే. అందువల్లనే ప్రకటన అయ్యే గ్రంథంలో ఎక్కడ ఏభాగం శైలిలో కాని, విషయాలలో కాని, మరేవిషయంలోకాని సరిగా లేనట్లు తోచినా తిరిగి వ్రాయవలసినదే; సంస్కరింపవలసినదే. ఈవిధాన లక్ష్మణరావుగారి తీర్పులు తాకని, దిద్దుబాటులు లేని గ్రంథాలు విజ్ఞానచంద్రికా గ్రంథమాలలోనివి చాల కొద్ది. చేపట్టిన పనిని అంతటి మక్కువతో అంతటి ఉత్తమ లక్ష్యముతో నిర్వహించే కార్యశూరులు చాలా అరుదుగా ఉంటారు.

లక్ష్మణరావుగారి హిందూ మహమ్మదీయ మహాయుగములూ, వీరభద్రరావుగారి ఆంధ్రదేశచరిత్ర సంపుటములూ ప్రకటించి విజ్ఞానచంద్రిక ఆంధ్రజాతీయతకు పునాదిరాలు పరచిందంటే అతిశయోక్తి కాదు. ఆ గ్రంథాలు వచ్చేవరకూ భారతీయులకు గొప్ప సంస్కృతి చరిత్ర లున్నవనికాని ఆంధ్రులది ప్రాచీన యుగాలలో మహాసామ్రాజ్య నిర్మాణం కావించి అఖండ రాజ్యాధికార వైభవం అనుభవించిన జాతి అని కాని ఆంధ్ర జనసామాన్యానికే కాదు, విద్యాధికుల మనుకొనే వారికి సైతం తెలియని బహిరంగ రహస్యములు. ఆంధ్రదేశ చరిత్రవచ్చి ఆంధ్రులలో జాతీయాభిమాన దర్పాలను రేకెత్తించింది. ఎక్కడ ఏసభలు జరిగినా నాయకులు తమ ప్రాచీన వైభవ గాథలు త్రవ్వి సభలలో జాతీయ భావోద్దీపనం కలిగించేవారు. ఆంధ్రోద్యమం రాడానికి ఆంధ్రదేశచరిత్ర ప్రకటనమే అని ఆనాడు దేశాభిమాని మొదలైన పత్రికలలో వ్యాసములుకూడా పడినవి. లక్ష్మణరావుగారి హిందూమహాయుగ మహమ్మదీయ మహాయుగాలు భారతజాతీయతనుండి ఆంధ్రజాతీయత విడివడి విపరీతరూపం దాల్చకుండా తెలుగు మనస్సులను చక్కదిద్దిన కళ్ళెములు; ఆంధ్రులును భారతీయులే అని పూరించిన శంఖారావములు; ముందరాగల గాంధీ మహాయుగానికి తెలుగువారి హృదయ క్షేత్రములను పదును చేసిన గ్రంథరాజములు. అయిదుమాసాల వ్యవధిలో వేయి ప్రతులూ అమ్ముడైపోయి ద్వితీయ ముద్రణానికి ఆవశ్యకత కలిగిందంటే చాలు, రెండవ కుసుమం హిందూమహాయుగము ప్రశస్తి ఎట్టిదో తెలుపడానికి.

తాను తలపెట్టిన ఉద్యమం విజ్ఞానచంద్రిక వర్ధిల్లి వెల్లివిరుస్తున్నకొద్దీ లక్ష్మణరావుగారికి తనదేశీయులను తనంతవారిని అఖండ విజ్ఞాన సంపన్నులను చేయాలనే త్వరా, తపనా ఎక్కువయింది. ఇక తన సామర్థ్యా సామర్థ్యములను ఆలోచింపను లేదు; అంగబల అర్థబలాలను విచారించను లేదు. కార్య సాధ్యా సాధ్యములను విమర్శించనూలేదు; అవసరమగునా కాదా దేశీయులకట్టి విజ్ఞానసంపద; అవసరమే అయితే తనసర్వస్వమంతాధారపోసయినా

కార్యము నిర్వహింప వలసినదే; ఇదే ఆయన తపనా, ఇదే ఆయన వ్యసనమూ అయిపోయినది. సేవావ్రతి లక్ష్మణరావు తపనలోనుండి అవతరించినదే ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము.

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వ ప్రకటనలో లక్ష్మణరావుగారి తెలుగుశైలి అమిత తేలికయై మార్దవమూ ప్రసన్నతా గడించుకొంది. సర్వస్వం ఉద్దేశింపబడినది తెలుగు ఏమాత్రమయినా చదివి విషయం బోధపరుచుకోగల సామాన్యజనుల నిమిత్తం గనుక ఎంతటి క్లిష్టమయిన విషయమయినా అరటిపండొలిచి చేతిలో పెట్టినట్టు తేటతెల్లంగా సులభమయిన తేలిక శైలిలో తెలియచెప్పడం అలవడిందాయనకు. ఈ ప్రజ్ఞ అదివరకే వున్నది. ఈ విషయం ప్రకృతిశాస్త్ర గ్రంథాలకు ఆయన వ్రాసిన పీఠికల ననుసరించే తెలుస్తుంది. విజ్ఞాన సర్వస్వం వచ్చినతర్వాత యీ కౌశలాన్ని యింకా వృద్ధిచేశారు లక్ష్మణరావుగారు. ఆయన వచనరచన చదువుతూవుంటే విషయం - మధ్య అర్థం బోధపడడాని కడ్డంకులేమీ లేకుండా చట్టున మనస్సుకు పట్టుతుంది. ఇది ఆయన శైలిలోని గొప్ప గొప్పదనం.

విజ్ఞానసర్వస్వ ప్రకటనతో లక్ష్మణరావుగారు పరిశోధనలో అఖండులయినారు. ఆయనకుగల సంస్కృతభాషా పరిజ్ఞానం ఇంగ్లీషుభాషా పరిజ్ఞానం మహారాష్ట్రిభాషా పరిజ్ఞానం అన్నీ ఈ పరిశోధనలో తోడ్పడినవి. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వంలో ఆయన పరిశోధన చేయకుండా వ్రాసిన ఒక్క వ్యాసంకాదు, ఒక్క పంక్తిలేదు. సర్వస్వములో అయన తన పేరుతో వ్రాసిన వ్యాసాలే ఎన్నో వున్నవి. పేరుతో వ్రాయని చిన్నచిన్న వ్యాసాలకు లెక్కలేదు భారతీయ సంస్కృతికి విజ్ఞానానికి సంబంధించిన వ్యాసాలు భాషాంతర విజ్ఞానకోశాలలోనో విశ్వకోశాలలోనో ఉన్నప్పటికి వాటిని అనువదించి విజ్ఞానసర్వస్వంలో ప్రకటించటం ఆయన కభిమతంగా ఉండేదికాదు. విషయం ముఖ్యమయినదయితే దానిని స్వయంగా మూలముట్టుగా పరిశోధించి స్వతంత్రవ్యాసం వ్రాసినదాకా ఆయనకు నిద్రపట్టేదికాదు. తన విజ్ఞానసర్వస్వం ఎన్సైక్లోపీడియాలకు కాని, ఇతర భారతదేశ భాషలలోని విశ్వకోశ ప్రాచీన కోశాలకు కాని వట్టి సంగ్రహాపు తర్జుమా అనిపించుకోవడం ఆయనకు సుతరామూ యిష్టంలేకపోయింది.

విజ్ఞానసర్వస్వములో "అ"కార పరిసమాప్తితో లక్ష్మణరావుగారు "ఆంధ్ర" సంపుట ప్రకటన ప్రయత్నానికి పూనుకొన్నారు. ఆంధ్రులకు సంబంధించిన ఏవిషయాన్ని గురించి వ్రాయవలెనన్నా అన్నిటికీ సాధనసామగ్రి సేకరించుకోవలసినదే. పరిశోధన ఓనమాల దగ్గర నుంచి మొదలు పెట్టవలసినదే.

తామ్రశాసన, శిలాశాసనముల దగ్గర నుంచీ పరిశోధన. తాళపత్రగ్రంథాలదగ్గర నుంచీ పరిశోధన. లోతైన ఉత్తమశ్రేణికి చెందిన పరిశోధన. ఇప్పుడప్పుడనక ఏవేళప్పుడాయనను చూచినా ఆంధ్రభాషకో చరిత్రకో సంబంధించిన విషయాలను గురించిన ఆలోచనలోనే నిమగ్నులై

వుండేవారు. ఎవరెవరు తనకద్దకే పనిమీద వచ్చినా లక్ష్మణరావుగారు వారితో చర్చించి వారినుంచి కులాలకు జాతులకు సంబంధించిన విషయాలలో ప్రాచీనకవి పండిత వంశాలకు చెందిన గాథలలో భాషా చరిత్ర విషయాలకు సంబంధించిన అంశాలలో సేకరిస్తూ వచ్చారు. వారిది అంతటి ఏకాగ్రత. అంతటి మేధావిశిష్టత. అంతటి నిశితతర్క విమర్శ. లక్ష్మణరావు గారు మహాపురుషులు. వారికి వారేసాటి. ఈ బహుముఖ ఆంధ్రచరిత్ర మథనంలో మరి హాలాహలమే పుట్టిందో ఏమో, దుర్బల శరీరులు లక్ష్మణరావుగారు ఆంధ్ర సంపుటము దరిదాపులకైనా పోకముందే పరిశోధనా ప్రారంభములలోనే ఆంధ్ర సంతతి దౌర్భాగ్యంవల్ల 1923 లో కాలధర్మం పొందినారు.

లక్ష్మణరావుగారి వంటి మేధా సంపన్నులు ఆయనతోనే సరియా, తెలుసీమ నిక పుట్టరా ? అనిపిస్తుంది. ఎందుచేత నంటే అంతటి విజ్ఞానవేత్తను అంతటి సర్వజ్ఞ మూర్తిని మనం చూడడం అరుదు. ఆయకు రానిదీ, తెలియనిదీ అంశమే లేదేమో అనిపించేది గౌతమ న్యాయదర్శనం ఆంధ్ర భాషలోకి అనువదిస్తూ వచ్చారు. పాశ్చాత్య ప్రాచ్యతత్వశాస్త్రాలు మథించి గొప్ప వ్యాసాలు వ్రాశారు! వైశేషిక దర్శనానికి సంబంధించిన అభావంమీద పెద్ద వ్యాసం రచించారు. అథర్వవేదాన్ని కూలంకషంగా చర్చించారు. అంగ్రేధుల దగ్గరనుంచి అనేక వర్ణసమీకరణందాకా అయనం మొదలుకొని అధికమాసందాకా గణిత జ్యోతిషశాస్త్రాంశాలు అవబోధం చేసుకొన్నారు లక్ష్మణరావుగారికి తెలియనిదీ తెలిసి తన దేశీయులకు తేటతెలుగులో తెలియజెప్పనిదీ ఏమున్నది? లక్ష్మణరావుగారే ఇంకా జీవించివుండి, ఆంధ్ర సంపుటం పూర్తి అయే ఉంటేనా - ఆంధ్రులింకా ఎంతటి విద్యామహితులూ దేశాభిమాన ధనులూ అయ్యేవారో ఆ భాగ్యం మనకిక లేదు. ఆయన సేవను సంస్మరించీ, ఆయన చేసిన పనిని తలచుకొనీ ఆయనకు ఒక్క అశ్రుతర్పణం విడుద్దాము - అంజలి బద్ధులమై. ఆయన అంత ఆవేదనపడి సృష్టించిన సర్వస్వం పూర్తికాదా ఇక ?

విజ్ఞప్తి

ఆంధ్ర వాఙ్మయానికీ చారిత్రక పరిశోధనకూ అపార సేవ చేసిన శ్రీ లక్ష్మణరావుగారి వర్ధంత్యుత్సవం జులై 13 వ ఆంధ్రదేశమంతటా అన్ని కేంద్రాల్లోనూ జరపాలని అభ్యుదయ రచయితలనూ తదితర సాహితీపరులనూ కోరుతున్నాం.

కార్యదర్శులు

ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం

ఛలో హైద్రాబాద్

శ్రీ "విపంచి"

రావు తెల్లారకుండానే వచ్చాడు. అసలు ఎనిమిదయినా లేచే ఘటం కాదు వాడిది. ఇవాళ ఏదో పుట్టిమునిగిందిరా బాబూ అనుకున్నా. వస్తూనే పత్రిక నామీద విసిరికొట్టి "నే చెప్తే విన్నావా? దేశద్రోహులు!" అన్నాడు. "ఎవరు ద్రోహులు ఏం దేశం, అసలు సంగతేమిటి". ఏమీ చెప్పేట్టులేడు. అతని ముఖం చూస్తే చెప్తే వినేటట్టుకూడా కనిపించలా. నే పత్రిక చేత్తో పట్టుకుని "కాఫీ తాగుదాం రారా" అంటూనే హోటలుకు దారి తీశా. ఏకళనున్నాడో వాడూ బయల్దేరాడు. వాడసలు వాగుడుపిట్ట - మరేమో ఈరోజు అసలు మాట్లాడడమే లేదు. వస్తూనే పేపరు హెడ్ లైన్సు చూస్తున్నా. "ఓస్. ఇదా సంగతి" అనుకుని నాలో నేనే నవ్వుకుంటున్నా. నా ముఖం చూస్తూ చురచురమంటున్నాడు రావు.

మేం లోపలికి పోయేసరికి మూర్తి అప్పుడే రెండో పడిలో ఉన్నాడు. రావు ఇంత త్వరగా లేచేడే అన్నట్లు తలకాయూపుతూ ఆహ్వానించాడు. మేం ఇడ్లీ తీసుకుంటూండగానే లాయరుగారు వచ్చారు. ఇంకా ఆయన కూచోకముందే "పేపరు చూశారా?" అన్నారు రావు. "చూస్తాంలెండి ... రండి కూర్చోండి ... ఏమోయ్ పంతులూ ... ఇంకో ప్లేటు ఇడ్లీ" నేను ఇంకా పూర్తిగా అనకముందే చూశారా! మన వాళ్ళెప్పుడూ ఇంతేనండి. రంగాగారు చెపితే ఆయనంతా న్యూఢిల్లీ వాతావరణంఅంటారు. కళ్ళున్నా చూడరు..." అంటూ దండయాత్ర ప్రారంభించారు.

రావు, మూర్తి, నేను కలిసి చదువుకున్నాం. లాయరుగారు మాకు చాలా సీనియరు. ఆయనకు—మాకు చిన్నతనం నుంచీ జోస్తీ. మూర్తి యింటరు పూర్తి కాకుండానే నేవీలో చేరాడు. నేను తాలూకాఫీసులో చేరాను. రావుకు ఉద్యోగం చెయ్యాల్సిన ఖర్మ లేదు. మాలో రావే చదువుకునే రోజులనుంచి రాజకీయాలని సాంఘికాలని వెంపరలాడేవాడు.

క్రితం సంవత్సరం శెలవలకు మూర్తి వచ్చేదాక మా నలుగురిలో భేదాభిప్రాయాలు లేవు. వాడొచ్చి తెచ్చాడీ ముప్పంతా "నావికుల తిరుగుబాటుకు కాంగ్రెసువారు సహాయం చేయకపోతే మానే; కనీసం అధికారంలోకి వచ్చిన

కాంగ్రెసునాయకులు తిరుగుబాటు చేశారని శిక్షలు అమలుచేస్తు"న్నా రన్నాడు మూర్తి. అంతవరకు రావుకూడా ఏకీభవించాడు. కాని మూర్తి "కమ్యూనిస్టులు రక్తధార పోశారు. ఎప్పుడైనా మోక్షం వస్తే వారివల్లే" అన్నాడు. దాంతో చాలా రభస జరిగింది. "చస్తే ఒప్పుకోన"న్నాడు రావు. "ఇంపాసిబుల్ – ఇంప్రాబబుల్" అన్నారు లాయరుగారు. "అటే చూస్తే కమ్యూనిస్టులు నావికుల తరఫున కొంతవరకు నిలబడ్డట్టే వుంది. అయినా నిజం నిలకడమీద తెలుస్తుంద"న్నాను నేను. మూర్తి ఎంతచెప్పినా రావు వినిపించుకోలేదు "కమ్యూనిస్టులా! ద్రోహం!! 42 విషయం ఏమంటావు" అంటాడు రావు. "తరచి చూస్తే 42 లో కూడా వారే రైటేమో? ఆ విషయం పూర్తిగా తేల్చాలి" అన్నాడు మూర్తి. దాంతో లాయరుగారు అడ్డొచ్చి "మనకెందుకు రాజకీయాలు" అని వాతావరణం చల్లబర్చేవాడు ఇది సంవత్సరంనాటి విషయం.

మూర్తి శెలవలయిపోగానే బొంబాయి వెళ్ళిపోయాడు లాయరుగారు ప్రాక్టీసు ఎలా అభివృద్ధిచేయాలా అని ఆలోచిస్తున్నారు. రావు ఏదో స్వాతంత్ర్యాన్ని రక్షించాలని - ఏమేమో చెప్తూనే ఉన్నాడు. "గడ్డురోజులు. రెండువేళ్లూ నోట్లోకి వెళ్లడమే కష్టంగావుంది. ఈ బ్లాక్ మార్కెట్లుతో కుచేల సంతానానికి తిండీ బట్టకీ - చాలని మా గుమాస్తాలంతా అన్నారు. "ఇదంతా కమ్యూనిస్టుల తంతు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని ఎత్తేశార"న్నాడు రావుకూడా.

నిజానికి నాకు భలే కోపం వచ్చింది. నాకు ప్రత్యేకించి కమ్యూనిస్టు మిత్రులెవరూలేరు. నాకు తెలిసినంతల్లా రావు మిత్రుడు శ్రీహరి ఒక్కడే. మాకు జీతాలు చాలక ఇంకో రెండు రాళ్ళిమ్మంటే అది కమ్యూనిస్టుల దేశద్రోహంగా ప్రచారం చేశారు దేశభక్తులు. నన్ను బాగా ఎరిగిన రావుకైనా జ్ఞానం లేకపోయినందుకు ఏడవాలో నవ్వాలో తెలియలేదు. మా కష్టాలకు వాళ్ళు సానుభూతితో మా ఆశలకి వారు పరితపిస్తున్నారట. కాని మమ్మల్ని అన్నివిధాలా - చివరకు అబద్ధ ప్రకటనలుకూడా చేసి - అణచిపెట్టారు. కమ్యూనిస్టులు ఏదో ఒరగబెట్టకపోయినా వారుకూడా మాకు వ్యతిరేక ప్రచారం చేస్తే పురిట్లోనే సంధికొట్టేది ఆమాటంటే "కమ్యూనిస్టులు మీపక్షం రాబట్టే ప్రభుత్వానికి మీ రంటే సానుభూతిలేదు" అంటాడు రావు. ఏది ఏదయినా అందరి తత్వాలు మాత్రం తెలిశాయి. ఇది జరిగి మూడు నాలుగుమాసాలయింది అప్పటి నుంచి నాతోఅంతగా రాజకీయాలు మాట్లాడడు రావు.

మూర్తి మళ్ళీ ఈనాటికి శెలవలకొచ్చాడు. వచ్చి రెండురోజులయినా కాలేదు. "కమ్యూనిస్టుల హింసా కార్యక్రమం గురించి" సన్నగా ఊదుడు ప్రారంభించాడు రావు. అభాండం ఇవ్వాళ హోటల్లో పగిలింది.

"అలాగా" అని మూర్తి సాగతీస్తున్నాడు. కాఫీ తాగటం మేం పూర్తిచేసినా రావు ఉపన్యాసం దంచుతూనే

ఉన్నాడు. చుట్టుపక్కల కూర్చున్న వాళ్లు ఏదో భాగోతం చూస్తున్నట్లు నిర్వేరపాటుగా చూస్తున్నారు. నాకంతా అయోమయంగావుంది. "కాఫీ త్రాగరా చల్లారిపోతోంది" అన్నాడు మూర్తి. "కాఫీ కేమ్లే నీవొప్పుకుంటావా ఇప్పటికైనా" అని ఆ కాఫీఅంతా ఒక గుక్కలో మింగి, ఏమంటావు అన్నట్లు చూశాడు నాకేసి. రావు ఎంతో విజయం సాధించాడు అన్నట్లు కనుబొమలు ఊపేస్తున్నాడు లాయరు. మూర్తి తాపీగా "అల్లాగేరా, లే, ఇంటిదగ్గర మాట్లాడుకొందాం. ఎనిమిదికూడా దాటుతోంది" అని లేచాడు. రావు గబగబా బిల్లు చెల్లించి "లాయరుగారి ఆఫీసురూముకి పోదాం" అన్నాడు.

అక్కడికి చేరామో లేదో రావు మళ్ళీ మొదలెట్టాడు. మూర్తి ఈమాటుకొంచెం ఘాటుగా "అయితే ఈ పత్రికలు రాసింది అక్షరాల నిజంట్రా" అని ఎగతాళిగా బుజాలెగరేశాడు "కాకేం నైజాంతో కమ్యూనిస్టుల కలయిక అని తాటికాయంత అక్షరాలలో ఉన్నా కనిపించటంలా" అన్నాడు. అయితే నిన్నటిదాక ఆంధ్ర మహాసభ విజయాలు: ప్రజా సైన్య పరాక్రమం, గూండాల ఆహుతి అని పడ్డాయే అవికూడా నిజమేనని ఒప్పుకుంటావా?" అని మూర్తి అడిగేసరికి "కావచ్చు" అన్నాడు రావు. లాయరుగారు "అది కాదు—" అని అందుకోబోతే మూర్తి వారించి "అయితే బ్రదర్ ... కాకేం దగ్గరనుంచి కావచ్చు దాక వచ్చావు. ఇదిగో మూడో పేజీ చివర ఆ మూల చూడు. 'కమ్యూనిస్టులకి నైజాం సైనికులకీ ఘర్షణ' అని పడింది. మరి దీనికేమంటావు." అనేసరికి రావు తోకతెగిన నక్కలా "నీకేం తెలుసు. ఎక్కడో వున్నావు ఈ కమ్యూనిస్టులు చేసే రాక్షస కృత్యాలు తెలియక కాని తెలిస్తే ఇన్ని యక్ష ప్రశ్న లడగవు. కళ్ళ ముందరవాళ్ళ చర్యలు....." ఇంకా రావు అంటూనే ఉన్నాడు. మూర్తి అందుకొని "ఏమిటిరా ఇందాకటి నుంచి చూస్తున్నాను. ఊకదంచితే బియ్యం వస్తాయిరా? ఉన్న రేషను కాస్తా ఊడింది. సైనుపంచ, వెధవ పంచ పది రూపాయలు. చస్తున్నాం అన్నారు. వచ్చారు: అందాకా నేగాని ప్రజల క్షోభమీ కేంపుకురా. ఎందుకీ బీరాలు. ఎవరి కొంప ముంచను. ప్రజల మాట వినేవాడే వరురా. నైజాంతో ఒడంబడిక యెందుకు చేసుకున్నట్లురా. ఎవరిని అడిగి అంటాం? నైజాం సరసుడా? మున్షీమంత్రసానియా? భలేబాగు. తెలుగు పడతుల మాన భంగం జరుగుతూంటే అహింసఅంటూ ఏడుస్తున్న వాజెమ్మ లెవరురా? నీవు చెప్పు? నైజాం కమ్యూనిస్టులు నిన్నటిదాక నుంచి వారన్నావు నువ్వే. ఇక్కడికమ్యూనిస్టుల లాంటి వారు కారన్నావు. నైజాం తాళం పడ్తున్నారన్నావు. ఇవాళ ప్లేటు మార్చావు. పైగా ఏదైనా అంటే వాళ్ళే స్త్రీలను చెరుస్తున్నారనే లాగున్నావు." అని మూర్తి లంకించుకోనేసరికి లాయరుగారు పాయింటు మాట్లాడుదామని

ప్రయత్నించాడుగాని, మూర్తి ఆగితేనా. లేస్తే మనిషికాదు అన్నట్టుగా వున్నాడు. ఇదేదో అయేలాగుందని, "ఒరేవ్ మీ కేంరా పనీపాటాలేదు. నే ఆఫీసుకు పోవాల"ని చెప్పి మెల్లగా బయటికిజారా.

ఇంటికొచ్చి రెండు మెతుకులు తిని ఆఫీసుకుపోయానేకాని నాకుమాత్రం మహా చెడ్డ అనుమానంగా ఉంది - 'వీళ్ళు కొట్టుకు చావలేదు గదా' అని. ప్రాణం బిగబట్టి అలాగా పనిలో తలదూర్చా. టంగ్...టంగ్...మని అయిదు కొట్టటంతో బ్రదుకు జీవుడా అని సరాసరి లాయరుగారి రూముకెళ్ళా.

వీళ్ళు తన్నానొయ్యా. పకలబడి నవ్వుతున్నారు. గుమ్మంలో కాలుపెడుతూనే "ఏమ్‌రోయ్. రాజీకుదిరిందా"అని రావు కేసి చూశా. "రాజీకేముంది. స్వయంగా చూసొస్తే ఏగొడవా ఉండదని లాయరు గారు సలహా ఇచ్చారు"అన్నాడు రావు. నాకు అనుమానమే. ఈ లాయరేదో పితలాటం పెడతాడని మూర్తికేసి చూశా. వాడూ అవునన్నట్లు తల ఊపాడు. లాయరుగారు సలహా ఎందుకిచ్చామా అన్నట్లుగా తల పంకిస్తున్నారు. అయితే వెళ్తున్నారన్నమాట" అన్నాను. "అబ్బే నువ్వుకూడా రావాలి. లాయరుగారికేదో కేసులున్నాయట. మూర్తీ నేనూ నువ్వూ వెళ్దాం. నువ్వు మాకు తీసరివిరా" అని మూర్తికేసి చూసి ఆదొరకంగా నవ్వాడు. నా కర్మమయింది. వాళ్ళిద్దరూ అక్కడ కూడా కరుచుకోకుండా నేనుండాలన్న మాట. ఎందుకైనా మంచిదనుకొని "అబ్బే నేను రాలేనురా. అదీ కాకుండా ఎంతో అనుభవమున్న లాయరుగారే రాలేకపోతే నేనెందుకురా? అసలు నేను రాను. లాయరుగారు లేఃపోతే అసలా విషయమే నాదగ్గరెత్తకద్దు"అన్నాను.

చివరికి అందరం పునః పునః ఆలోచించి, లాయరుగారు విషయాలన్నీ జాగ్రత్తగా కూపీతీస్తేటట్లు నేను సాయపడేటట్లు ఒప్పందంతో నలుగురం మరునాడే మనగాలదగ్గర సరిహద్దునాటి తెలంగాణా గ్రామానికి వెళ్దామనుకున్నాం.

* * *

సరిహద్దు దాటగానే దేవరుప్పల శివారు కనిపించింది. అదో చిన్న పల్లెలా వుంది. మమ్మల్ని చూడగానే అందరూ మా చుట్టూ మర్రిచెట్టు క్రింద గుమిగూడారు. మాటామంతీ లేకుండానే రావు ప్రశ్నల వర్షం కురిపించాడు "పగలు రజాకార్లు, రాత్రిళ్ళు కమ్యూనిస్టులు మిమ్మల్ని దోచుకుంటున్నారటగా?" "మిమ్మల్ని హింసపెట్టేది కమ్యూనిస్టులే గదూ?" అని లాయరు ప్రక్కప్రక్కన అందిస్తున్నాడు. ఈ వరసని ప్రశ్నలు వేస్తోంటే "కమ్యూనిస్టులా? దోచుకోవటమా? మిమ్మల్ని మీరే దోచుకుంటారా?" అంటూ గుక్కతిరగకుండా సమాధానం చెప్పారు. మూర్తి రావుకేసి నిలకడగా చూస్తున్నాడు. ఉన్నట్టేఉండి లాయరుగారు "ఈమధ్య కమ్యూనిస్టులు నైజాంతో కలిసిపోయారటగా?" అని అడిగారు. అందరూ ఆ ప్రశ్న ఎగాదిగా చూట్టం మొదలెట్టేసరికి ఆయన మా వెనక్కి జేరి గొణుగుతున్నాడు. రోగం

కుదిరింది. అనేలా మూర్తి సిగరెట్టుతీసి ముట్టించాడు ఇంతలోనే 12 ఏళ్ళ కుర్రాడొకడు పొట్ట చెక్కలయేలా నవ్వుతూ" "నిజమే...నిజమే.. కమ్యూనిస్టులు హైద్రాబాద్ వెళ్తున్నారు... హైద్రాబాద్ ఛలో" అంటూ సైగ చేసేసరికి అందరూ "ఛలో హైద్రాబాద్" అని ఒకసారిగా నినాదాలు ఇవ్వటం ప్రారంభించారు. ఇంతలో ఆ ముసలాయన సర్దుబట్టి కాని లేకపోతే కుర్రకుంకలు ఏమైనా చేసుందురు. నేను ఆ ముసలాయనతో "మేం యేదో చూసి పోదామని వచ్చామని సంగతి సందర్భాలేమిటని" అడిగాను. ఆయన గ్రామంలోకి పోదాం రండని బయల్దేర తీశాను. మాతోపాటు శివార్లో ఉన్న వారందరూ వచ్చారు.

గ్రామం పెద్దదనే చెప్పొచ్చు. ఊరి మధ్యగా చెరువుంది దాని కట్టమీదే మండపం, మండపాన్ని ఆనుకొని చెరువులోకి వంగి ఒక పెద్ద రావి చెట్టుంది. రావిచెట్టుమీద ఉన్న కొమ్ము బూర తీసి ఊదాడాయన. దాదాపు గ్రామంలో ఉన్న వారంతా అక్కడికి వచ్చారు. రావు చాలా కొత్తగా అంతా పరిశీలనగా చూస్తున్నాడు. లాయరుగారు కటకట పడుతున్నాడు. నేను మెల్లిగా సంభాషణలోకి దిగా.

ఆ ముసలాయన పేరు పుల్లారెడ్డిట. ఆ గ్రామం మీద రెండుసార్లు రజాకార్లు, గుండాలు వచ్చి పడ్డారట మొదటిసారి భయపడ్డా నెమ్మదిగా తెప్పరిల్లి వాళ్ళను తరిమి గొట్టారట ముందర వాళ్ళదగ్గరున్నదల్లా నాటు తుపాకి ఒకటే. తర్వాత తర్వాత మెల్లగా ఆయుధాలుకూడా సంపాదించారట. నలుగురు రజాకార్లు దాడుల్లో చచ్చిపోయారట. పంచాయితీ ఎన్నికలు జరిగితే పుల్లారెడ్డిని పెద్దగా ఎన్నుకున్నారట.

ఆయన్ని ఎన్ని ప్రశ్నలడిగినా విసుగు లేకుండా చెప్తున్నాడు చిరునవ్వు నవ్వి "జేగురు దిబ్బలుదాటి నక్కపల్లిదాక ఇప్పుడు మేమే" అన్నాడు. మాకుచాలా ఆశ్చర్యం వేసింది. హైద్రాబాదుకు 10 మైళ్ళదాక మూడు జిల్లాలమధ్య ఉన్నదంతా విముక్త తెలంగాణా యేనా అని.

"నైజాం ప్రభుత్వం లేదా" అడిగాను. "ప్రభుత్వంఎక్కడిది. గూండావాళ్లు వస్తూయుంటారు దెబ్బ తిరిగేస్తే పారిపోతా రెధవలు" అని రెడ్డిగారనేసరికి అందరూ పకాలున నవ్వారు వాళ్ళతో పాటు మూర్తి బిగ్గరగా నవ్వుతుంటే రావు, లాయర్ ఏమనుకున్నా లోనకి నాకు మాత్రం కష్టం వేసింది.

"మీ ప్రభుత్వం ఎక్కడనుంచి పని చేస్తుందన్నాడు" రావు.

అందరూ అతనేమీ తెలియని మూర్ఖుడయినట్లు ఒకసారి చూచారు. రెడ్డిగారు "పంచాయితీ ప్రభుత్వం గాదటండీ. మా సైన్యానికి నాయకులున్నారు ఆరే దాడులు జరిగితే కాపాడుతారు." అన్నారు. లాయరుగారు ఉండబట్టలేనట్టు "విముక్త ప్రాంతం అంటే ఏమిటి" అన్నారు.

"పటేలులేని రాజ్యం, మొఖాసా లేని రాజ్యం, వెట్టిలేని రాజ్యం మేందున్నే గడ్డ

మా సొంతం. ఇంకా ఎందుకు మాకు మీ మే! ఇదే మా రాజ్యం. మేం విముక్తి పొందాము" అని చాలా హుషారుగా చెప్పారు.

"సరి సరి చాలా లేట్ అయింది. తిండి తిప్పలు చూసుకుందాం పోదాం పదండి" అని తిరుగుదారి తీయబోయారు రెడ్డిగారు. నే కనిపిస్తూనే ఉన్నా లాయరు మాట్లాడినా కదిలినా ఏదో అనుమానంగా చూస్తున్నారు ప్రజలంతా మూర్తిమాత్రం ఏమీ తనకు పట్టనట్టు వింటూ కూర్చొని సిగరెట్టుపైన సిగరెట్టు కాలుస్తున్నాడు. లాయరు కదల బోయేసరికి రెడ్డిగారు. "ఆగండి నర్సిమయ్యరావాలి. వస్తూనే ఉంటాడు ఈ పాటికి" అన్నారు.

చూశావా వీళ్ళంతా కమ్యూనిష్టులే అనేలా చూశాడు రావు. తప్పకు ఏదో రాక్షసం చేస్తారు అనేలా లాయరు చూపులు వణుకుతున్నాయి.

ఇంతలోనే పది పందిదాకా వుంటారు వచ్చారు. రైతులు లాగానే ఉన్నారు. భుజాన మందుగుండు పోసిన సంచులు వ్రేలాడుతున్నాయి. అందరి చేతుల్లోనూ బాణాకర్రల్లాంటి దిట్టమైన నల్లకర్రలు మెరుస్తున్నాయి. నలుగురి చేతుల్లో మాత్రం తుపాకులున్నాయి. అందులో ఒకటే చాలా కొత్తగా కనిపిస్తోంది. వాళ్ళొచ్చేసరికి అందరు "నర్సిమయ్యజిందాబాద్" అని జయ్ జయ్లు కొట్టారు. రెడ్డిగారు నర్సిమయ్యకు మమ్మల్ని చూపించారు.

నర్సింహయ్య నడికారి. బలమైన వాడనే చెప్పొచ్చు. చూపులోనే ఆకర్షణ ఉంది కాని కోరమీసం మాత్రం కొంచెం అరుటు పుట్టిస్తుంది.

"మిమ్మల్ని కష్టపెట్టినందుకు క్షమించండి" అంటూ నే గ్రామస్థులందరికీని సాయంకాలం, కలుసుకుంటానని చెప్పి పంపాడు. మమ్మల్ని గ్రంథాలయానికి పోదాం రమ్మని తీసుకెళ్ళాడు.

అదొక చావిడి ఒకటే చెక్కలు కొట్టిన బీరువా ఉంది దాంలో చాలా మటుకు రాజకీయాలకు సంబంధించిన పుస్తకాలు, నవలలు ఉన్నాయి. ఎప్పటిదో నాలుగురోజుల క్రితం దినపత్రిక చాపమీద పడేసి ఉంది. చావిడిచుట్టూ కంచికంపతో దిట్టంగా దడికట్టి ఉంది. మాతో పాటు నలుగురు యువకులుకూడా వచ్చారు. తీరా చాపట్లో పెట్టి...ఏదో తలోచనతో లాయరు కంగారు పడుతున్నాడు. మూర్తి బెల్లం కొట్టిన రాయిలా ఉన్నవాడల్లా నర్సింహయ్యతో హుషారుగా మాట్లాడుతున్నాడు. రావుమాత్రం అంతా ఏమిటో జీర్ణించుకుంటున్నట్లుగా ఎడంచేయి చిటికిన వేలు ఆడిస్తున్నాడు.

కొంచెం సేపట్లో మాకు భోజనం వచ్చింది లాయరుగారి బలవంతంమీద నర్సింహయ్యకూడా మాతో పాటే భోం చేశాడు. లాయరుకు భోజనం సరిగా లేదు. రావు, మూర్తి మాటలు వింటూ ఏదోలా తిన్నాడు. మూర్తి నర్సింహయ్యగూర్చి అంతా అడిగి తెలుసుకుంటున్నాడు.

నర్సింహయ్య వరంగల్లో చదువుకున్నాడు. చదువుతుండగానే 1930 స్వ సత్యాగ్రహంలో పాల్గొని రెండేళ్ళ

జైలుకు పోయాడు. తిరిగివచ్చింతర్వాత చదువు చాలించి యింటిదగ్గరే ఉంటూ ఆంధ్రమహాసభలో పనిచేసేవాడు 1940లో మితవాదులు చీలికలు పెట్టాలని ప్రయత్నించినా, అతనుమాత్రం అందరిలో కలిసి పనిచేస్తూనే వున్నాడు 1941లో దేశ ముఖు ప్రతాపరెడ్డికి వ్యతిరేకంగా రైతుల్ని నడిపితే దొంగకేసు బనాయించి 4 సం॥ జైలుకు పంపాడు అమీన్. తిరిగివచ్చే సరికి ఆంధ్రమహాసభ పోరాటానికి పిలుపిచ్చింది స్టేటుకాంగ్రెసుకలిసిరాకపోయినా పోరాటం సాగుతూనే వచ్చింది అతను అందరిమధ్య ఐక్యత కావాలని తహతహ పడ్డాడు వృధాశ్రమయింది. చివరికి రెండు సం॥ల పోరాటం తర్వాత స్టేటుకాంగ్రెసు వారు కూడా పోరాటం అన్నారు. బహిరంగంగా కాకపోయినా చాటుగా అయినా నువ్వు చెప్పిందే నిజంరా నర్సింహం అనేవారట కాంగ్రెసు మిత్రులు. యూనియన్ ప్రభుత్వంమీద పెట్టుకున్న ఆశలు యథాతథపు ఒడంబడికతో అడియాసలయాయి. 'అడలేక మద్దెల ఓటి' అన్నట్టు, యిప్పుడు కమ్యూనిస్టులు నైజాంతో కలిసిపోయారంటున్నారు ఎన్ని అన్నా ఎక్కడో వాగితే పేపర్లకెక్కిరించాల్సిందే కాని ప్రజలమధ్యకొస్తే వారి బండారంకాస్తా బయటపడుతుంది.

ఇంకా యేవేవో చెప్తూనేవున్నాడు నర్సింహయ్య. మూర్తి రావుని హెచ్చరిస్తున్నట్లుగా మధ్యమధ్య వ్యాఖ్యానాలు చేస్తున్నాడు. లాయరుగారు ఈ సోదంతా ఏమిటి పాయింటులేకుండా అనుకున్నట్లున్నారు. "అయితే మీరు కమ్యూనిస్టులయారా?" అన్నారు "అబ్బే నేనలా. కాంగ్రెసే నన్ను కమ్యూనిస్టుని చేసింది." అని నవ్వుతూ సమాధానంచెప్పి యిప్పుడే వస్తానని వెళ్లాడు.

రావు యేమీ పలకటంలేదు. ఆలోచనలో పడ్డట్టున్నాడు. ఇంతలోనే అంకర్ని వెంటపెట్టుకుని నర్సింహయ్య వచ్చాడు. ఆ తాలూకాలో యెన్ని గ్రామాలమీద పోలీసులూ గూండాలు దండయాత్రలు చేశారో యెంత విలువగల సొమ్ములు దోచుకున్నారో మొదలగు నవన్నీ వున్న కొన్ని కరపత్రాలిచ్చాడు నర్సింహయ్యగారు. రావు అతి జాగ్రత్తగా చదువుతున్నాడు. "80 మంది స్త్రీల మానభంగం" అని అతని పెదవులు వణికాయి.

ఇంతలోనే లాయరుగారు పుల్లారెడ్డి గారి కేసి చూసి "యూనియన్ సైన్యాలొస్తే నైజాం లొంగిపోతాడు తెలుసా" అన్నారు. "వారితో దేశముఖు ప్రతాపరెడ్డి కూడా వస్తారను తాతా" అని ఒక అమ్మాయి పక్కన నవ్వింది.

ఆ అమ్మాయిపేరు సీతట. నర్సింహయ్య కూతురట. ఇదివరదాక హైద్రాబాద్‌లో మేనమామల ఇంట్లోవుండి చదువుకునేదట. అక్కడా ఒకటే గోలగా ఉందని వాళ్లమ్మ పోరుపెట్టి ఇంటికి తీసుకొచ్చిందట. చూస్తే కొంచెం కారంపాలు ఎక్కువగా ఉన్న పిల్లాలావుంది. అన్నది అన్నట్లు ఊరుకోక "భలే సైన్యాలులే పోటుగత్యాన్ని నిజాం కప్పగించినవేనా...తాతోయి పొలాలకి ఎరువెయ్యకండేం. ఎల్లాగో వాళ్ళు ఆ సచ్చినోళ్ళ కిచ్చేస్తారట..."అని వ స

బోసిన పిట్టలా మొదలెట్టింది. రావుకు కొంచెం కష్టం కలిగినట్లుంది. "ఎవరో చెప్పారు. పొలాలు తిరిగిచ్చమని" అన్నారు. "వో! చెప్పారేంటి. మొన్నేగా దేశ ముఖ్య మంత్రి పుచ్చుకున్నాడు" అంటి చటుక్కున. లాయరుగారు "నైజా రాజీ పడ్డా మీరు లొంగరా" అన్నారు. "లొంగేందుకేముందండీ. మేం బ్రతకాలను కున్నాం. బ్రతకటం నేర్చుకున్నాం. బ్రతుకుతాం కూడానూ" అన్నాడు సర్వం హుమ్య. ఇంకో యువకుడికేసి చూస్తూ "యూనియన్ ప్రభుత్వానికి ఆయుధా లెన్నున్నాయో మీకు తెలుసా" అన్నారు లాయరుగారు. "ఇప్పుడెందుకు తెలుస్తుంది. అవి మా చేతులోకొస్తాయిగా. అప్పుడు జాగ్రత్తగా లెక్కపెడతాము లెండి" అన్నాడా యువకుడు.

దాంతో మరీ కడుపుడికి "ప్రభుత్వాన్ని హింసతో కూలద్రోయాలనటం ఇక్కడణచకపోతే మా ప్రాంతాలకుకూడ ప్రాకదూ?" అని మూతి సాగదీసాడు లాయరు. "ఇక్కడిలా అక్కడ దున్నేవానికి పొలం, పనిచేసేవానికి ఫలితం లేక పోతే, ఇక్కడిలాగే అక్కడా జరుగుతుంది. తొర్గిమేం బజారునవెడ్తావుంటే .."

"అహింసా బాద్ అని కేక పెట్టాడు మూర్తి అతని గొంతులో రావు కంఠం కూడా వినిపించింది నాకు. వెళ్ళొస్తామని శెలవు తీసుకుని బయలుదేరాం ఇంకా శివార్లు దాట్లే-అప్పుడే బుర్రున రిజర్వ్ వాన్ మాదగ్గర దిగింది. లాయరు గారు ఎంతో సంతోషించారు. మన యూనియన్ వానే అది అయినందుకు ఆయన సంతోషం పెదవులు దాటకుండానే" ఏం...ల్లారా సరిహద్దుదాటి పారి వస్తున్నారా?" అంటూనే మమ్మల్ని వాన్‌కి రిజర్వ్ మధ్యకు కెక్కారు. మేమగ్రా నిఎంత మొత్తుకున్నా లాభం లేకపోయింది. వారికి తెలుసట మేమెవర్ని చంపిది. రామారావు తను కాంగ్రెసని చెప్తున్నా వినకపోగా 'మాకు తెలుసులే' అంటూ నోరు మూశాడు. లాయరుగారు వారికి సాయింటుతర్వాత పాయింటుగా చెప్పాలనుకున్నారు. కాని గొంతుతడి ఆరిపోయింది. నిలువెల్ల చెమటలు గ్రక్కుతున్నారేమో ఏమో కదలకుండా పడున్నారు. మూర్తి నిశ్చలంగా పొలాల్లోకి చూస్తూన్నాడు. పొలాల్లోంచి 'ఛలో హైదరాబాద్' అని పుడమి అంతా గర్జించే సరికీ చేలికి పడి చూశాం. దేవురుప్పల సివార్ల మీదగా నల్లగొండ రోడ్డున రిజర్వ్‌వాన్ దూసుకు పోతోంది. 'ఛలో హైదరాబాద్' మా చెవుల్లో రివ్వ్వ మంటోంది.

నాటిక

మన స్వతంత్రం

శ్రీ రామమోహన్

ప్రదేశం :
తెలుగుదేశంలో ఒకపల్లె

కాలం :
1948 మే నెలాఖరు ప్రాంతం

రంగం :
గ్రామకంఠంలోని పుంత

సమయం :
ఉదయం 7 గంటలవేళ

పాత్రలు :

సుందరరామయ్య } కాంగ్రెస్
సుబ్రహ్మణ్యం } వాదులు
ఒక రైతుపడుచు
హెడ్ కానిస్టేబులు
సబినస్పెక్టరు
ఒక పోలీసు

[సుందరరామయ్య, హెడ్ కానిస్టేబులు నెమ్మదిగా నడిచివస్తూ బాటప్రక్క నున్న ఒకతాటిచెట్టునీడలో నిలబడతారు]

హె : ఇదేనా మీరు చెప్పిన భూమి ?

సుం : ఔను. చూడండి, ఎలా గట్లు పెట్టేశారో.

హె : ఇందులో వచ్చే దేముం టుంది. శోషతప్ప. ఇంతకంటె మంచి భూమే దొరకలేదూ ?

సుం : ఈ పొరుభూమి రత్నాలు పండుతుంది. భూమి మంచిదే.

హె : ప్రస్తుతం జిల్లేళ్ళుదండిగా వున్నాయి.

సుం : చూడండి మహావృక్షాలల్లే ఎలా వున్నాయో. వాటిని చూస్తేనే తెలుస్తుందిభూసారం.

హె : ఏమో ఏం సారమో ! ఇది ఏనుగుని దానంచేసినట్లుంది గాని ......

సుం : మనం చేసి చచ్చేదుందా, కౌలుకివ్వడమేగా! వాడే తంటాలు పడతాడు.

హే : అయితే మీరు చేయరన్న మాట.

సుం : మనం చేయడం మొదలెడితే పండిందే.

హే : శిస్తులు సరిగ్గా ఇస్తారా? యేవో చట్టాలుకూడా అంటున్నారు.

సుం : ముండ యేలుతూందనుకున్నారేం? చట్టాలు జమీందారీలకేగాని కౌలు భూములకి కాదని కాంగ్రెసు చెప్పింది.

హే : అబ్బే అడుగుతున్నానండోయ్!

సుం : మొదట ఒకటి రెండేళ్ళు శిస్తు మనది కాదనుకొంటే...

హే : రెండేళ్ళు బ్రతకడం ఎలాగ?

సుం : ఏదో పెద్దలు సంపాదించింది వుంది.

హే : అయితేమాత్రం, పూరికే యిచ్చేటప్పుడు మంచిదే కోరుకోరాదు?

సుం : నాలుగెకరాలు జమీందారీ బంజరువుంది. అది మనకిస్తే సంచిదే. కాని, ఇవ్వరు

హే : ఇంతకీమీరుచేసేదిఏలాగూ లేదుగదా? ఊరికే వచ్చేది ఏ భూమైతేనేం లెండి.

సుం : మనం నాగలి మేడి పట్టుకూర్చుంటేమిగిలినదేశ వ్యవహారాలు చూసేదెవరు?

[ఒక రైతుపడుచు తట్టనెత్తిన పెట్టుకొని వస్తుంది]

హే : ఏయ్ పిల్లా! ఏమిటది?

పడుచు : (నిలబడి) పొలానికెరువు మోసుకొంటున్నామండి.

సుం : తట్టతో యెన్ని మాట్లని తిరుగుతావు. బండిలేదూ?

పడుచు : లేదండి. ఏకష్టమూ పడకుంటే తిండి ఎలాగండి?

[వెళుతుంది]

సుం : కష్టపడనివాడు తిండి తినరాదన్నారు గాంధీ జీ. మంచి మాటలు చెప్పింది కూలిదైతేనేం? నిజంగా గాంధిగారి మాటల్ని అక్షరాలా ఆచరణలో పెట్టేది పల్లెటూళ్ళలోనే...

హే : అయితే మీరు గాంధీగారి భక్తులుకదా, మీరు పొలం కౌలుకిస్తానంటారేం పని చేసు కోక ?.

సుం : నేనుమాత్రం పని ఎందుకు చేయను ?

హే : మీరు కౌలుకిచ్చేస్తానంటే అంటున్నానంతే...

సుం : అందరూ ఒకటే పనిచేస్తే ప్రపంచం నడిచేదెల్లా ? ప్రతి వారూ తనమట్టుకి తాను తన పొట్ట విషయమే చూసుకొంటే దేశం మొత్త సంగతి చూసేవా రెవరు ?

హే : స్వరాజ్యం వచ్చేసిందిగా ?

సుం : అంతతో పని అయిపో యిందీ ? అసలు పనిఅంతా ముందేవుంది.

హే : ఉహూ...

సుం : మనప్రభుత్వానికిశత్రువులు తెగబడిపోతున్నారు.

హే : నిజమే.

సుం : స్వరాజ్యం వచ్చేక మాకు మేకుల్లాగ వుండేటందుకోసం ప్రత్యేకంగా వాళ్ళని మీరు వదలివేశారు.

హే : మేం చేయగలిగేది ఏముందిలెండి.

సుం : వేదాంతాలకేం, అప్పుడు మనుష్యుల్ని ఏం బాదేవారు !

హే : ఒకరికింద తాబేదార్లము కాదండీ!

సుం : అంతేలే. మీరు మాత్రం స్వతంత్రులా ?

హే : (మాట మారుస్తూ) మీరులాఠీ దెబ్బలుతిన్నారా ?

సుం : (అనుమానంతో తేరిచూసి)చచ్చే టట్లా. (మరల సర్దుకొని) నేనంటే నేను కాదు. మావాళ్ళంతా ఎన్నేసి దెబ్బలు తిన్నారు ? నేను జైలుకెళ్ళాను, ఒక రెండు నెలలపాటు.

హే : (తెరలోకి చూస్తూ) ఆ పిల్ల మీ చేనిలో తట్ట దిమ్మరించి వస్తూంది.

సుం : బహుశా మా రైతు పెళ్ళామో, కూతురో, కోడలో ఎవరో అయివుంటుంది.

హే : అయితే మీదీవూరుకాదా ఏమిటి ?

సుం : కాదు. మా మేనమామ గారిదీ వూరు.

హే : మీ వూళ్ళోనే దరఖాస్తు పెట్టకపోయారు?

సుం : అక్కడా, ఇక్కడాకూడా పెట్టాను. ఈ వూళ్ళోవాళ్ళు కాంగ్రెసుకు పరమ శత్రువులు. వాళ్ళభూమి కాజేస్తారేమోననీ, తనకి సాయంగా వుంటాననీ నన్ను రమ్మని మా మామ పిలిచాడు. భూమి యిప్పించాడు.

[రైతుపడుచు వస్తుంది]

సుం : నువ్వు శ్రీరాములు తాలూకా?

పడుచు : కాదండి. మేను మాల వాళ్ళం.

సుం : కూలికి పనిచేస్తూన్నావా?

పడుచు : (చేయిచాపి) ఆ పొలం మాదేనండి.

సుం : (ఆశ్చర్యంతో) ఎవరిచ్చారు?

పడుచు : మాకు ఎవరిస్తారండి. మా రెక్కలు.

[వెళ్ళిపోతుంది.]

సుం : చూశారా, కాంగ్రెసు వాళ్ళభూములు ఆక్రమించడం!

హే : చూడండి. ఎంత గ్ఘూంకారంగా మాట్లాడిందో.

సుం : కాంగ్రెసుకి అడుగడుగునా అడ్డం తగలడానికి బ్రిటిషు వాళ్లు పరమ శత్రువుల్ని మిగిల్చిపోయారు.

హే : ఆ రోజుల్లో మీ కూ, వాళ్ళకీ తేడా తెలిసేది కాదు లెండి.

సుం : వాళ్లు దేవాంతకులు. ఇంగ్లీషులో More loyal than the king అని సామెత వుంది.

హే : ఔనండి.

సుం : వాళ్ళు కాంగ్రెసంటే ఎంతో భక్తివున్నట్లు మా అందరికంటే ఎక్కువ దెబ్బలు తినేవారు. ఎక్కువమంది జైళ్ళకెళ్ళేవారు.

[రైతుపడుచు మరల తట్టతో వస్తుంది]

సుం : ఏయ్ పిల్లా!

పడుచు : చిత్తమండి.

సుం : ఆ భూమి నాది. అందులో నువ్వు ఎరువు పోయడానికి వీల్లేదు.

పడుచు : (ఆశ్చర్యంతో) మీ దేంటి? మేం గట్లు పెట్టుకొన్నాం.

హే : మీ యబ్బసొమ్ము.

పడుచు: అది ఎవరి అబ్బసొమ్మూ కాదు.

[వెళ్ళిపోతుంది]

హె: వూరికే తెలియక అడుగుతున్నానుగాని, ఈ పేచీల భూమి ఎందుకు? ఏదన్నా వుద్యోగం ఇవ్వమనరాదూ?

సుం: (నిరాశతో) కాని, ఇవ్వరు కదా?

హె: ప్రభుత్వంమీదే కాదాఅని.

సుం: అయితేనేం? వాషింగ్టన్ అని అమెరికా ప్రభుత్వానికి ఒకప్పుడు ఒక అధ్యక్షుడుండే వాడు?

హె: ఔను. అమెరికా అంటే మన బర్మా పక్కనేకాదండి వుంది?

సుం: కాదులే. బర్మాకది చాలా దూరం. ఆయన దగ్గిర వుద్యోగానికని ఒక మిత్రుడూ, ఒక విరోధీ దరఖాస్తులు పెట్టుకొన్నారు.

హె: శత్రుడుకూడా ఎందుకు?-తనకిస్తాడనేనా?

సుం: (చిరునవ్వు నవ్వి) అయితే మనం చెప్పుకొనేది ఏముంది? మిత్రుడికన్న విరోధిగావున్న వాడే ఆపనిలో శ్రద్ధచూపుతాడని ఆయన విరోధికే ఇచ్చాడు

హె: ఓహో హో! మహాత్ముడు!

సుం: కాదూమరి. అల్లాగే ప్రభుత్వాన్ని ఎదిరించి దెబ్బలాడేం గనక మేము...

హె: అది బ్రిటిష్ ప్రభుత్వం కాదా?

సుం: ఏదైతేనేం, ప్రభుత్వమే కదా?

హె: అయితేవాళ్ళు మీకేమీ యివ్వలేదే.

సుం: వాషింగ్టన్ కున్న తెలివిఆదర్శం బ్రిటిష్ వాళ్ళకి లేవు. మా ప్రభుత్వం చూడు. తనవాళ్ళకంటె, తనని అంతవరకూ శత్రువులుగా చూసిన వాళ్ళని ముందు గౌరవిస్తూంది.

హె: అయితే భూము లెందుకివ్వడం?

సుం: మేము పడ్డ కష్టాలకి...

హె: వాటికి ఉద్యోగాలే ఇవ్వవచ్చు కాదూ!

సుం: ఉద్యోగాలిస్తే రెండు నష్టాలు. మీలాంటి ప్రభుత్వ

భక్తులకి వుద్యోగాలుండకుండా చేయవలసి వస్తుంది రెండోది మేమంతా వుద్యోగాలలో దూరి అందులోనే రాత్రీ పగలూ కొట్టుకొంటూంటే ప్రభుత్వ శత్రువుల్ని నాశనం చేయడంలో మీకు సాయం యెవరు చేస్తారు?

హె: ఔనౌను. నిజమే.

[రైతుపడుచు తిరిగి వస్తుంది]

సుం: మంచిగా చెప్తున్నా విను పిల్లా. నా భూమిమీద మీరు గట్లుపెట్టుకోవడంఅంటేఏమిటి?

పడుచు: మీ భూమి ఏమిటండి?

సుం: కాంగ్రెసు గవర్నమెంటు నాకిచ్చింది.

పడుచు: అలాగాండి. ఎందుకేంటండి?

సుం: మేం పోలీసులచే దెబ్బలు తిన్నాం. జైళ్ళకెళ్ళేం. కష్టాలు పడ్డాం.

పడుచు: (అమాయికంగా) పోలీసులచే దెబ్బలుతిని, జైళ్ళకెడితే భూములిస్తున్నారాండి.

సుం: అందరికీ కాదు.

పడుచు: దొంగకేసు పెట్టి మా వోడిని కొట్టి, రెండేళ్లు జైల్లో వేశారండి.

హె: దొంగల కివ్వరు.

పడుచు: మావాడూ దొంగ కాదండి. కేసు దొంగదండి.

సుం: (ఉపన్యాస ధోరణిలో) అన్యాయం జరుగుతూంటే సహించలేక ప్రజలకోసం, దేశంకోసం జైలుకెళ్ళికష్టాలుపడ్డవాళ్ళకి—

పడుచు: మావాడు మంచివోడేనండి. జమీందారే మా బూవులు లాక్కోని, దొంగ కేసు పెట్టాడ.

సుం: కాంగ్రెసువారికే ఇస్తున్నారు.

పడుచు: మావోటు పచ్చపెట్టెకే ఇచ్చాం.

సుం: ఒకళ్ళ సొమ్ము మాకు కావాలని కాంగ్రెసువాళ్ళు పేచీలు పడలేదు. అల్లా పేచీ పడేవాళ్ళు కాంగ్రెసువాళ్ళు కారు.

పడుచు: ఒకరిదానికోసంకాదండి, మాదే ఆభూవండి. దాన్ని జమీందారు అన్నాయంగా

కాజేశాడు. పోలీసోళ్లు అన్యాయం చేశారు.

[విసువు, హేళనతో]

సుం: ఒక్క మీరుతప్ప అంతా అన్యాయం చేసేవాళ్ళే, పాపం...

హే: (కోపంతో)తప్పుడుముండ! పోలీసోళ్ళు అన్యాయం చేశారట

పడుచు: ఏంటయ్యో! తిడుతుండావు.

హే: మీరు ఏమీ చేయకపోతే పోలీసులు మీ జోలికి వచ్చారటే, తప్పుడులంజ–

పడుచు: (కోపంతో) ఏందయ్యో మాలోళ్లంగదాఅని మాటలు మహా మిగులున్నావు. నీయమ్మ, నీ పెళ్ళాం, నీవోళ్ళంతా...

హే: మాటకి మాట అంటావటే నీయమ్మ...... (లాఠీ విసురుతాడు)

[చేతిమీద దెబ్బతగిలి ఆ పడుచుతట్ట క్రింద పారవేస్తుంది. ఏడుస్తూ పరుగెత్తిపోతుంది.]

సుం: అలా కొట్టడం మంచిది కాదు.

హే: తిడుతుందేం?

సుం: వలుగుగూ ఆడదంటూరు.

హే: అని నా వెంట్రుకలు పీకుతారు.

[సబిన స్పెక్టరు, మరొక కాంగ్రెసు వాది సుబ్రహ్మణ్యం, ఒక పోలీసువాడు వస్తారు]

సుబ్ర: ఇదిగో మావాడిక్కడే వున్నాడు.

సుం: మామా! చూశావా మీ పూరివాళ్ళ పని నా పొలానికి తమరు గట్లుపెట్టేసుకొన్నారు.

సబిన: పెడతారు. పెడతారు.

సుబ్ర: (తల వూపుతూ) వాళ్ళకి అడ్డం వుందా?

హే: పోలీసుల్నీ, వీళ్ళనీ కలిపి ఒక ఆడుది తిట్టిపోయిందండి. మహాప్రభో, అమ్మవారు తల్లి నయం. విన లేకపోయామండి.

సబిన: తిడుతూ, ఏడుస్తూ ఊళ్లోకి పరుగెత్తుతూన్నది అదే కాదు గద?

హే: తిట్లు తిట్టి తిట్టి ఈ తట్ట పుచ్చుకొని కొట్టిందండి. నేను కర్రతో బెదిరించబోయేట...

సబిన: బెదిరించబోయావూ!గట్టి మగాడివే. రెండుతగలనీయవద్దూ?

హె : ఏమీ లేకుండానే అంత రంతు చేస్తూంది. నిజంగా దెబ్బపడితే...

సుబ : మీరు అల్లా అలుసు ఇవ్వడంచేతనే వాళ్ళకి ఆ కొమ్ములు వచ్చాయి.

సుం : ఇప్పుడది చేసే రంతుకి వూళ్ళో ఏం రగడ వస్తుందో...

సబిన : రగడలేదు. రాపాషాణం లేదు. రానీండి చెప్తా.

సుబ : ఇల్లాగ నెంతకాలమేం ? ఆ రేళ్ళనుంచి ఒక్కలా వ్రేలేగి పోతూన్నారు.

[తెరలో కల కలం]

సుం : జనం పరుగెత్తి వస్తూన్నారు.

సబిన : (రివాల్వరు తీసుకొని) రానీయండి. భయంలేదు. నా చేతిలో ఒక్క గుండువుండగా వాళ్ళని దగ్గిరికి రానివ్వను.

సుం : మీకు కాల్చడానికి ఆజ్ఞ వుందా ?

సబిన : (వెక్కిరింతగా నవ్వి) ఏమనుకున్నారేం ? యిప్పుడీ జిల్లాఅంతాడిస్ట్రిక్ట్ ఏరియా ; అంటే మాదీ రాజ్యం. నలుగురు కనిపిస్తే సరి, అనుమానం వుంటే కాల్చిపారెయ్యవచ్చు.

సు : తెగులు వదలిపోతుంది.

సుబ : (చిరునవ్వుతో) వైధవ్యముండ పాలన అనుకున్నావా యేంరా. ఆగస్టు 15 తో మనం స్వతంత్రులమయ్యామని మరిచిపోయావేమిటి ?

హె : గాంధీకీ జయ్ !

[తెరలో కలకలం పెరుగుతుంది.]

సుబ : (భయంతో) గవర్నమెంటు ఈ జిల్లాని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించారని... వీళ్లు ఎరుగుదురా ?

సబిన : (ఆలోచనతో) వూరంతా వస్తూన్నారే.

హె : నడవండి పోదాం. సర్ ! వెళ్ళి రిజర్వును సంపుదాం. వాళ్ళేసరి...

సుబ : మా మాటేమిటి ?

సబిన : రిజర్వ్ వచ్చేదాకా ఏదో చూసుకోండి. వూళ్ళో ప్రజలంతా వర్తి అమాయకులులా తోస్తున్నారు. ముందు ప్రభుత్వ ప్రకటన నలుగురికీ తెలిసేలా టముకు వేయిం

చారో లేదో ఆ తరవాత చర్య తీసుకోవాలి గాని, లేకపోతే ప్రభుత్వానికి అప్రతిష్ట వస్తుంది.

[సబిన్స్పెక్టరు పోలీసు వాడావిడిగా పరుగెత్తుతాడు. తెరలో కలకలం పెరుగుతూంది]

సుబ్ర: ఆంధ్రపత్రిక పట్టుకొచ్చి గవర్నమెంటు ప్రకటన వాళ్లకి చూపిస్తే...

సు: ఇంకానయం. ప్రభుత్వం ఏదో ప్రకటించినంతమాత్రాన పోలీసువాళ్ళకి అదివరకు లేని ధైర్యం వస్తుందా? వీళ్ళకి అదివరకు లేని భయం కొత్తగా వస్తుందా?

సుబ్ర: అంతేనంటావా?

సు: లేకపోతే - అసలు ప్రకటన ఎందుకు చేయవలసివస్తుంది? నడు. బాబూ. నీకూ నీభూమికీ ఒక్క దండం.

[పరుగెత్తుతాడు]

సుబ్ర: వీళ్ళని నేలబెట్టి రాసేస్తా! కానీ, రిజర్వు వచ్చాక వుంది తడాఖా.

[పరుగెత్తుతాడు. తెరలో కలకలం పెరుగుతూనే వుంది. తెర పడుతుంది.]

జోహార్లు

శ్రీ అలువాలసోమయ్య

రణరంగంబున రయమున దూకిన
రామారెడ్డికి జోహార్లు
రేణిగుంట ఆ రణమున దూకిన
రైతుబిడ్డలకు జోహార్లు
సిరిగలవారికి సింహస్వప్నమై
ఆర్తనాదులకు అమరజ్యోతియై
రణరంగంబున కణములు లేపుచు
వీరతజూపిన శూరవర్యులకు
విప్లవపూర్వక జోహార్లు -
ఆధునికాయుధ అగ్ని నెదుర్కొని
ప్రజాపీడకుల పలవరితనము
రజాకార్ల ఆ రాక్షసచర్యల
మిడిసిపడెడి ఆ మిలిటరి శక్తిని
అణచుచు రణమున అసువులు బాసిన
అమరజీవులగు ఆంధ్రులకివియే
జోహార్లు -
మీరు జూపిన మేటిమార్గమున
తొంభైలక్షల తోడిసోదరులు
నడుములు గట్టుక వడివడిదూకుచు
మీ మా మన పవిత్ర ధర్మం
పూర్తిచేయుటకు పూనిరి శపథము
గైకొనుడివె మా జోహార్లు

నైజాం నరహంతకుడా!

శ్రీ 'రావణ'

నైజాంనాజీ
నరహంతకుడా!
నీ రోజులు
దగ్గర పడ్డవిరా!
రైతుబాబు గుండెల్లో
మండిన నీ తుపాకిరవలు
ఆంధ్రసతుల
హృదయాల్లో
రగిలే అవమాన జ్వాలలు
నీపీఠం అడుగున
నిప్పుకొండలై
పగిలెనురా—
మానవతుల
దారుణ శాపాల్
విసపునాల్క—
విదిలించుచు
బడబాగ్నుల
గురిపించుచు
పడగలెత్తి
నీతలపై తాండవించె -
నీ గోరీపై నిల్చొని
మా వీరసమాధులకు
హారతులెత్తే రోజదిగో
కాలపు తెరలో కన్నువిచ్చినది

స్వరాజ్య ఫలితాలు!

శ్రీ కలిగొండ కేశవరావు

నౌఖాలీ నెత్తుటి రాజ్యం
కాశ్మీర్‌లో కత్తులయుద్ధం
నైజాంనాజీ నిరంకుశత్వం
స్వరాజ్య ఫలితాలేనా ?
ఐక్యభారత సముద్విఖండన
దేశంలో దారుణహత్యలు
మనుష్యుల్లో మతాలద్వేషం
స్వతంత్ర ఫలితాలేనా ?
శ్రామికజాతికి చాలనిఅన్నం
దేశంలో ధనికపిశాచం
దరిద్రదేవత విలయతాండవం
స్వరాజ్య ఫలితాలేనా ?
హిందూముస్లిం హింసాకాండ
రజాకార్ల రౌడీతనాలు
ప్రపంచనేత గాంధీమరణం
స్వతంత్ర ఫలితాలేనా ?
రైతులకేమో రక్తపుటన్నం
ధనికులకేమో పరమాన్నం
కాదాయిది ఒకఅన్యాయం ?
స్వరాజ్యస్వతంత్ర ఫలితం ?

కొత్తవార్త

శ్రీ "శారద"

గొత్తగూడా గ్రామంలో కోటయ్య గారికి ప్రజల్లో మంచి పలుకుబడి వుంది. ఆయన సత్ప్రవర్తనుడు. తెలంగాణా పోరాటం ప్రారంభమైన తరవాత, ఆయన ఇల్లూ, గ్రామంలో చాలామంది ఇళ్ళూ నిజాం సైన్యంచేత, ఇత్తేహాదుల్ గూండాల చేత దోచుకోబడ్డాయి. కోటయ్యగారు, శిస్తులు చెల్లించేసి, శాంతంగా వుండిపోదామని ప్రజలకి చెప్పాడు. చెల్లించకపోతే గ్రామాన్ని మొత్తం నాశనం చేస్తారేమో వాళ్లు! అని భావించాడాయన. గ్రామ పటేల్ జబర్దస్తీగా వసూళ్లు ప్రారంభించాడు. గూడాను కోటయ్య కొడుకు నాగప్ప శిస్తు చెల్లించటానికి ఒప్పుకోలేదు. చెల్లించిన శిస్తు ఎన్నిసార్లు చెల్లించాలి?... అన్నాడతను. అతని అభిప్రాయం గ్రామంలో చాలామందికి వుంది. వాళ్ళంతా కలిసి ఒకనాడు మాట్లాడుకున్నారు. రశీదు లివ్వకుండా ముసిలాళ్ళని బెదిరించి మళ్ళీ శిస్తు వసూలు చేస్తాడా ఈ పటేల్? ఎబ్బే... నైజాం కావలికుక్క... అని గట్టిగా వాదించాడు నాగప్ప అవును... నిజాం రాక్షసుడి పొట్టా...ఆ మిలిటరీ రాక్షసుల పొట్టలూ, సారాకోటీ, కోడి గుడ్లకోటీ నింపటానికేగా ఈ వసూళ్లు?.. నాగప్పవాదనని యువకులంతా అంగీకరించారు. అందరూ ఆంధ్రమహాసభ మెంబర్లైనారు...

గ్రామ పటేల్... శిస్తు వసూలు చేయలేక పోయినాడు. ఎవరిస్తారు? అతనికి కళ్ళుమండింది. మండి ఎవర్నెంచేస్తావు పో!... అన్నారు ప్రజలు. వసూలైన శిస్తులు మళ్లీ వసూలు చేయడానికి యెన్ని గుండెల్తో వొచ్చావు? ఎక్కువగా మాట్లాడితే తంతామన్నారు యువకులు.

రెండో రోజుకి గ్రామం మంచి నిద్రలో వుంది. రాత్రి 11 గంటలవుతోంది. అష్టమి చంద్రుని గుడ్డివెన్నెట్లో, నడిచప్పుడు లేకుండా, నిజాం దొంగసైన్యం గ్రామంలో ప్రవేశించింది. గ్రామ పొలిమేరల్లోనే సైన్యాన్ని ఒక పన్నెండేళ్ల కుర్రాడు హఠాత్తుగా చూశాడు. ఆ కుర్రాడు, సైన్యానికి అగపడకుండా మెల్లిగా చీకట్లో మాయమైనాడు గ్రామంలోకి. సైన్యం, బాంయ్... బాంయ్మని మొరిగే కుక్కల్ని తుపాకీ మడమలతో చంపి గ్రామంలోకి జొరబడ్డారు.

2

నైజాం దొంగ సైన్యానికి దాదాపు కష్టకాలం ప్రాప్తించింది. 1930 కి

1948కి వున్న తేడా వాళ్ళకేమీ గోచరించక పొరపడ్డారు. దోపిడీదార్లకి కాలంలోని మార్పుగోచరించదేమో బహుశా. గ్రామ పటేల్ సైన్యానికి ప్రతిఇల్లూ ప్రత్యేకంగా వర్ణించి చెబుతో చేతిలాంతర్‌తో ముందుకి స్తున్నాడు.

సైన్యం గ్రామంలో ప్రవేశించిన 10 నిమిషాలకే ప్రజల్లో అపూర్వమైన చైతన్యం సంచలనం తుపానులా వ్యాపించింది. ఈ సంగతి గ్రామస్థులకి తప్ప సైన్యానికేమీ తెలియక పోవడం, వాళ్ళ మౌఢ్యమని అంటానికేమీ ఆస్కారంలేదు. గెరిల్లా దళంయొక్క నైపుణ్యమే కారణం.

గ్రామపటేల్, సైన్యంలో పెద్దవాడూ ఇత్తేహాదుల్ గూండా, ఏ ఘోరాలకీ వెనుదీయని పిచ్చికుక్క మొహియిద్దీన్ని సాభిప్రాయంగా పలకరించి,

“మొహియిద్దీన్, మన ఘనత వహించిన ప్రభుత్వానికి శిస్తులు ఎగ్గొట్టే అంత ధైర్యానికి కారణం ఎవరో నేను చూపుతాను, వాణ్ణి...” అని ఇంకేదో అనబోతున్నాడు.

మొహియిద్దీన్ ఆరాత్రి గుడ్డి వెలుగులో, నిశబ్దమైన బజారు ఎదిరేట్టు పెద్దగా నవ్వి “వాడ్కి...నడి బజారులోనే హిజ్ ఎక్సలెన్సీ కేలియే .. ముక్కలు చేస్తాం”అన్నాడు బొంగురు గొంతుతో.

గ్రామపటేల్ ముసి ముసి నవ్వులు నవ్వాడు, “మంచిమాట అన్నావు. కాని వాడితో చాలామంది వున్నారు సుమా!” అని హృదాంతరాళంలోని భయాన్ని గంభీరమైన మాటల్లో వెలిబుచ్చాడు.

మొహియిద్దీన్ క్రూరమైన కళ్లు అష్టమి చంద్రకాంతిలో ఎర్రగా మెరిసాయి. భయంకరంగా. తుపాకీ మడిమ నేలకేసి బాది, “ఖుద్ ఫర్వా నహీ! హుం, భీ వంద మందే వున్నాం!” అన్నాడు తన వెనకాల నడుస్తూ, లోగడ గ్రామాల్లో ఇలాంటి పన్లు చేసి, గెరిల్లాల చేత నానా తిప్పలూపడి, చచ్చిన సైన్యం దుర్గతి జ్ఞాపకం వొచ్చి, భయంతో వొణుకుతూ హంసనడకలు నడుస్తున్న సైనికుణ్ని గంభీరంగా చూపుతో.

పటేల్ నడక మందగించింది సైన్యం ఆగింది. లాంతర్ పైకెత్తి “ఈ ఇల్లే వాడిది...” అన్నాడు గ్రామపటేల్ ఒక పెద్దయింటిని చూపి. మాట పైకిరాక ముందే తెరిచిన ఇంట్లోదూరే పురుగుల్లాగు, సైన్యం కోటవంటి ఇంట్లో జొరబడ్డారు.

ఇంట్లో ఎవరూ లేనట్లు బావురుమంటోంది. ఇంటిమధ్య లాంతరు మాత్రం సన్నగా వెలుగుతోంది. నైజాం గుండెల్లో కుంపటిలా మొహియిద్దీన్ హుంకరించాడు పెద్దలొట్టి పిట్టలాగు.

సైన్యం కదలిక మామూలుగా లేదు... వాళ్ళ బూట్లు దేశేటప్పుడు వున్న టక్ టక్ నడక మాని. దానిస్థానే కిచకిచ శబ్దం. గుసగుస మాటలూ వినిపిస్తున్నై.

మొహియిద్దీన్ ఇంకా పెద్దగా అరిచాడు. లాంతర్ అదిరి టపటపమని ఎగిరింది. సైన్యంలో మొత్తం ఏనభైమంది వున్నారు. ఆ పెద్ద ఇంట్లో ఏభైమందీ ఇరుకుగా, ఒకర్నొకరు తోసుకుంటూ, సోదా ప్రారంభించారు. పెద్ద భోషాణపెట్టిని ఒకడు

తెరచి చెయ్యిపెట్టి దాన్లోంచి పాతగుడ్డలూ పత్రికల కాయితాలూ, విరజిమ్ముతున్నాడు. ఇంకోడు గాదెలు పడగొట్టాడు. అన్నీ దాదాపు ఖాళీగా వున్నాయి. మనిషి అన్న స్పర్శే వాళ్ళకెక్కడా తగల్లేదు.

మొహిద్దీన్ మరీ వుగ్రుడై ఎగురుతున్నాడు ఆ పోతున్న లాంతర్‌లా. తుపాకీలున్నాయి కాని ఎవర్ని కాల్చేట్టు?...దోపిడి చేయటానికి ఏమున్నాయి?...కోపం హెచ్చి, సైనికుల్ని తంతున్నాడు, మనుషుల్ని వెతకమని.

3

అర్ధరాత్రి సమీపిస్తోంది. కోటయ్యగారింటికి పదిగజాల దూరంలో వున్న నారయ్యగారి చావిడిలో గ్రామ యువకుల సమావేశం అతి నిశ్శబ్దంగా కటికి చీకట్లో సాగుతోంది అక్కడేం నిర్ణయం జరిగిందో, అక్కడ సన్నగా వీస్తున్న గాలికే తెలియడంలేదు. పదినిమిషాలు గడిచాయి...చావిడినించి ఒక్కొక్క బలిష్టమైన నీడ మృత్యువులా కదిలి కోటయ్యగారింటి వేపుకి చీకట్లో మాయమౌతోంది. ప్రజాసేవకుల నిశ్వాసాలు వినిపించకుండా గాలి 'రివ్'మని వీస్తూ సాయం చేస్తోంది

దోపిడి దొంగల సోదా ఇంకా సాగుతునేవుంది. ఇంటిలోపల మొహిద్దీన్ అరుపులూ, అట్టహాసాలూ, సైనికుల భయపూరితమైన అస్పష్ట కోలాహలం...తుపాకీలు, ఒకదానొకటి రాసుకుంటున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది.

ఇంటిబైట కొండొంగల నీడలు చేతుల్లో తుపాకీలూ, పెద్ద బడితెలూ, పట్టుకుని కదులుతున్నాయి. ఒక బలిష్టమైన నీడ మెల్లెగా, ఇంటి పెద్దవాకిలి తలుపు గొళ్ళెం బిగించింది దొడ్డి తలుపుల గొళ్ళేలుకూడా బిగించిన శబ్దం లోపల సోదా జరుపుతున్న హంతకులకి వినిపించింది. సైనికుల్లో అది వరకల్లా అజ్ఞాతంగావున్న భయోత్పాతం గప్పున అంటుకున్నది ఆ క్షణాన. వాళ్ళకేం తోచటంలేదు...గ్రామ పటేల్ భయకంపితుడై "మొహిద్దీన్...మొహిద్దీన్...తలుపు...తలుపు..." అంటున్నాడు నత్తిగా. అతని చేతిలో ఆరిపోయిన లాంతర్ గడగడ వొణికి ప్రాణభీతితో... కిందపడి ముక్కలయింది.

సైనికుల గుండెల్లో నైజాం స్వప్నాలు పగిలిపోతున్నాయ్. తాము అనుకున్నదేమిటి? జరిగిందేమిటి?...తమకి సంఘమరణం తప్పదల్లేవుంది....

బైటనీడలు ఒక్కసారి కంగడాలకేలుగులో గప్పుకన్పించారు గ్రామందాదాపు అక్కడేవుంది! నిశ్శబ్దం బద్దలై ఒక్కసారి నినాదాలుగామారింది ఆనినాదాలు ఇంట్లో నిజాంనీచులకి అనేక పూర్వసంఘటనల్ని జ్ఞప్తికి తెచ్చిపెట్టి వాళ్ళజీవితాశని వమ్ము చేస్తోంది. వాళ్ళు దిగ్భ్రమ చెందారు...

"కిటికీల్లోంచి కాల్చండి ఆపురుగుల్ని" అన్నారు ప్రజల్లోఒకరు.

"వద్దు — ఈదుష్టమృగాలకోసం, నీచకీటకాలకోసం విలువైన తుపాకిమందును ఖర్చు పెట్టడం అనవసరం...ఇల్లునాల్గుపక్కలా అంటించండి. లోపలే కుమిలినశిస్తాయి...

ఇంకెవ్వరికీ అపకారం చేయకండా" అన్నాడు నాగప్ప.

ఇంట్లో సైనికపిశాచాలు తలుపు పగలకొట్టే ప్రయత్నానికి పూనుకున్నారు బల కంఠంగా, మొహిద్దీన్ చివాట్లతో. ఆ తలుపు సామాన్యమైంది కాదు. అది తెలంగాణా ప్రజల వీరోచితపోరాటానికి కోటతలుపు. తెలుగుప్రజల సర్వశత్రువులకి అంతతొందరగా, తేలికగా అలవయ్యేట్టు కన్పించలేదు.. దాని వెనక తెలంగాణా విముక్తి ప్రజాసైన్యం జయజయధ్వానాలతో నుంచునివుంటే అది ఒరిగిపోకపోవటమేమిటి?

"కిరసనాయిలుపొయ్యండి ... అంటించండి. విషసర్పాల్ని వొదలకూడదు" అర్ధరాత్రి వణికింది. దిక్కులు ప్రతిధ్వనించాయి. నైజాం సింహాసనం అంగుళం మేర కదిలి గజగజలాడింది.

"నిజాం... కసిండి.. .ఆంధ్రమహాసభ జిందాబాద్... తెలంగాణా జిందాబాద్" వందలగొంతుకల్లోంచి మారుమోగింది ఒక్కమాట.

ఆ ఒక్కమాట, ఇంట్లోదొంగగుంపు అంతాన్ని.. ఆసన్నసంగ్రామాన్ని... సూచిస్తో నైజాంక్రూర పరిపాలనాయంత్రాన్ని ఒక్కసారి తుపానులో అరటిచెట్టులా గజగజలాడించింది...హడలెత్తించింది.

మొహిద్దీన్ రంకెలేస్తున్నాడు.. ఎగురుతున్నాడు...సైనికుల్ని తంతున్నాడు .. గ్రామపటేల్ని తిడ్తున్నాడు. దొడ్డితలుపు ఒక్కరవ్వ కదుల్తోంది సైనికుల ప్రయత్నంతో.

4

ఇల్లునాల్గువైపులా అంటుకున్నది. క్షణంలో అగ్ని నాలుకసాచి, ఆకాశాన్ని అంటుతోంది. బయట నినాదాలు లోపల హాహాకారాలు

1940 కి, 1948 కి ఆ కాలవ్యత్యాసం, నైజాం నరహంతకులకి అరచేతిలో అరటిపండులా తేటతెల్లమౌతోంది ... వాళ్ళు వాకిలితలుపు ఆశవదులుకొని, దొడ్డితలుపు తీసేప్రయత్నంలో సతమతమౌతున్నారు.. గ్రామపటేల్ సైనికుల వత్తిడికీ, మొహిద్దీన్ సన్నాహానికీ క్రోధాగ్నికీ మాడి మసైనాడు.

గంట గడిచింది. దొడ్డితలుపు వూడివచ్చింది. 80 మంది నరహంతకుల్లో 20 మంది సంగ వచ్చిన మొహిద్దీన్ని, దొడ్లోకి ఈడ్చిపారేసి, గోడమీదికి వచ్చి ఒకటికి బుద్ధిచెప్పారు. పొలిమేరలు దాటి చాలాదూరం పొయ్యేవరకూ, ప్రజాసైన్య ఘోషనినాదం వాళ్ళని తరుముతూనేవుంది. కిందా, మీదా పడుతూ నైజాం దొంగ సైన్యం అదేపోత పోయింది చీకట్లో కలిసి; రాత్రిపోయిన వాళ్ళు తెలవనైనా తెలవకుండా.

తెలతెలవారింది. గ్రామప్రజ శాంతముగా, సమ నిశ్శబ్ద్యంలా, కోటయ్యగారి తగలబడ్డ ఇల్లు శుభ్రంగా ఆర్పి, విషసర్పాల స్వాగతానికి అస్తిసంచయనం చేసారు.

5

మరుసటిరోజు సైనికశిబిరంలో..చావు కప్పి కన్నులొట్టిపోయి, కాలిన శరీరాలకి కట్టు కట్టుకుని పడుకునివున్న సైనిక పిశా

చాలు మాలుకుతూ మాట్లాడుకుంటున్నారు.

"ఒరే భాయ్! మళ్ళీ ఇవ్వాళ రాత్రికి కొత్తగూడా పోవాలంట! హుకుం జారీ ఐంది!" అన్నాడొకడు జీవితం మీద ఆశ తొణికిసలాడే స్వరంలో.

ఇంకోడు చార్మినార్ సిగరెట్ పీక వెలిగించి, "ఎందుకో తెలుసా? పోయిన వాళ్ళకి తోడులేదని మన్ని పంపటానికి" అన్నాడు విసుగ్గా.

అందరిలో తెలివిగల మూడోవాడు నెమ్మదిగా మాట్లాడాడు. "భాయి! భయందేనికి? పోదాం. అక్కడ తప్పించుకునే మార్గం వుంది!" అన్నాడు.

సైనిక పిశాచాలు ఆశగా చూశాయి అతన్ని. "అదేమిటో చెప్పు ... తొందరగా!" అన్నారందరు.

"ఇక్కడ చెబితే మనని ఈ యెలుగుబంటి సర్దార్ కాల్చి చంపుతాడు దారిలో చెబుతా!"

పది నిమిషాలకి ఎవడో సర్దార్, వెధవ పోజు వేది రంకెలు వేస్తూ శిబిరంలోకి వచ్చాడు. వాడిదేం పోయింది? ప్రజల దెబ్బ చవిచూడలేదింకా..

"నాన్సెన్స్! వెధవది, ఒక్క రైతు వెధవల్ని..ఐదువందలమంది న్నా వుండరు.. 80 మంది సాయుధ సైనికులు వుండి ఏం చెయ్యలేకపోయినారా? హిజ్ ఎక్సలెన్సీకి ఎంత నామర్దా?...ఛీ...పోండి. తగలెట్టండి...దోచుకురండి.

మిగతా పిశాచాలకి వళ్ళు జలదరించింది అమ్మబోయ్!... మళ్లీ అక్కడికే?.

"మీరు పికెటింగులు నేనొస్తాను పంపించి ఈతడవ రెండొందల మందిని తీసుకెళ్దాం..."

ఎంతమంది వొస్తేనేం? ఆ గెరిల్లాలు వాళ్ళు మామూలు మనుషులని నమ్మకం కుదరలేదు సైనికులకి. సైన్యంలో మామూలు కదలికే రాలేదు. టిక్ ... టాక్ నడిచి మూలుగు బయల్దేరింది, తళ తళలాడే బాయ్‌నెట్‌లు వెలవెలబోతున్నై.

"వుం...ఇవ్వాళే...అదిగో మిలటరీ లారీలు...పదండి"

వీడి కేంపోయింది సైనికుల్లో గుసగుస బయల్దేరింది పదండంటూను...తనెక్కడో మూలగా కూర్చుని...ఆ గెరిల్లాల పాలిట తమని పడేసి...రంకెలువేస్తాడు...అయినా రోకట్లో తల దూర్చాక.

సైన్యం మళ్ళీ హంసనడక నడుస్తో బయల్దేరింది కొత్త ఎలుగుబంటు ఆధ్వర్యాన గ్రామం దగ్గర పడుతున్న కొద్దీ మిలిటరీ కార్ల మోతతో పాటు సైనికుల గుండె దడ కూడా కలిసి మంద్ర స్థాయికి వెడుతోంది.

ఎలుగుబంటు గ్రామానికి మైలు దూరంలో సురక్షిత స్థానంలో డేరా వేసి సైనికుల్ని కార్లలోంచి దింపి "పోండి" గ్రామాన్ని దోచుకోండి...తగలెయ్యండి అడ్డొచ్చిన వాళ్ళనల్లా నరకండి"...అని హుకుం జారీ చేశాడు,

సైన్యం తాబేలులా మందగమనంతో గ్రామంకేసి నడుస్తోంది. తెలివిగల మూడోవాడు, ఎలుగుబంటును దాటి అర మైలు పోయింతర్వాత "నేను ఒక ఆలోచన చెబుతాను" అన్నాడు. ఇంకోడు

దిగులుగా, "పోదూ... ఏ ఆలోచన చెప్పినా మనం అల్లానిచేరే ఆలోచనేగా?" అన్నాడు.

మిగతా వాళ్ళు "ఆ!" అన్నారు నిస్పృహతో సమాధానంగా.

ఇంకోడు తుపాకి జారుతో వుంటే పైకి సద్దుకుంటూ, "ఛీ వెధవది నాకన్న యీ తుపాకికి ఎక్కువ భయంగావుంది" అని విసుక్కున్నాడు.

మరొకడు నవ్వి "మనం ఈ గ్రామం యెందుకూ తగలెయ్యటం? అన్నాడు అనుమానంగా. ఈ అనుమానం సైనికుడికి రావటం ఆశ్చర్యమే. కాని అది గెరిల్లాలంటే వుండే భయంకొద్దీ వచ్చివుంటుంది.

మొదటివాడు "హిజ్ ఎక్సలెన్సీ హుకుంప్రకారం!" అన్నాడు

రెండోవాడు "ముస్లిం నాగరికత నిలపటానికట, యీ జనాన్ని చంపటం!" అన్నాడు అసహ్యంగా. అతను ముస్లిమే అయినా, పైవాళ్ల చీవాట్లతో ముస్లిం అభిమానం నశించింది అతనికి.

తెలివిగల మూడోవాడు "యిదిగో నేను చెప్పినట్టుచేయండి. అందరం ఆ గెరిల్లాలకి, ఈ పాడుతుపాకులూ, ఈ కాకీ డ్రెస్సులూ యిచ్చి వాళ్ళతో కలుద్దాం. మనకి తర్వాత ఏభయమూ వుండదు"

మొదటివాడు తుపాకీ నిక్కచ్చిగా కిందికి జారవిడిచి "అమ్మరొయ్యో! ఆ ఎలుగుబంటి సర్దారు మన్ని చంపితే?" అన్నాడు గడగడ వొణికి.

సైన్యం అంతా ఒక క్షణం ఆలోచించారు

"మనం అంతాకలసి వాణ్ణి చంపుదాం. వాడొక్కడేగా!" అన్నాడు మూడోవాడు.

సైన్యం గ్రామంచేరువకి చేరుకుని, తుపాకులు కిందబెట్టి, డ్రెస్సువూడదీయడం చెట్టుసందునుంచి చూస్తున్న ప్రజాసైన్యం కనిపెట్టింది. సైన్యం తరహా బోధపడక, తమలో ఒక్కణ్ణిపంపింది, అతనుబతికినా చచ్చినాసరే అని తీర్మానించుకుని

సైన్యం గెరిల్లావీరుడికి స్వాగతం ఇచ్చింది. తెలివిగల మూడోవాడే పలకరించాడు ఆతన్ని. "భాయీ! మాకిచ్చే 30 హాలీలకోసం మేం చావదల్చుకోలేదు. ఎవర్నీ చంపదల్చుకోలేదు. ఈతుపాకులన్నీ తీసుకోండి. ఆ డ్రెస్సులు కూడాను మేమంతా మీతో కలుస్తాం

గెరిల్లావీరుడు సంతోషంగా, ఈల వేసి, "జిందాబాద్ ఆంధ్రమహాసభా" అని నినాదం ఇచ్చాడు. ప్రజాసైన్యం అంతా వచ్చి నినాదాన్ని అందుకున్నది... దోపిడి సైన్యంకూడా...

"జిందాబాద్... తెలంగాణా!"

"నైజాం నిరంకుశత్వం... నశించాలి!"

కొత్తగూడా గ్రామ పంచాయితీ ప్రభుత్వానికి అదనంగా రెండొందల తుపాకీలు, రెండొందలమంది శిక్షితులైన సైనికులూ లభించారు. నైజాంగారి సైన్యంలోకూడా ప్రజాచైతన్యం పాకుతోంది!

ఆక్షేపణ లేదు!

శ్రీ 'ధర్మరాజు'

"అయ్యా! తిండిగింజలు అయిపోయినయి. కుండెడు గింజలు యిప్పించండి. పది రోజులాగె ఉడుగబట్టి." కొండల్ రెడ్డిని శాయన్న అడిగాడు.

అరుగుమీద కూర్చుని పొగచుట్ట పీలుస్తూ అప్పుడే త్రాగిన కల్లు నుంచి చెడ్డల గురించి పక్కయింటి రైతు లింగయ్యతో మాట్లాడుతున్న కొండల్ రెడ్డి శాయన్నవైపు చూస్తూ "ఏమిరా! పెండ్లాంపక్కలోకి రాగానే అప్పసంగతి మరచావు ఏ నెలజీతం ఆ నెల తీసుకుంటున్నావు. ముప్పైరూపాయిల అప్పు అట్లాగే వుంది. వడ్డీకూడా చెల్లుబోవటం లేదు. పైగా ఇంకా గింజలు కావాలంటున్నావు." అన్నాడు

"నిజమే పటేలా! కాని నీ బాంచను ఏం జెయ్యాలె. పొట్టకెళ్ళటంలేదు. మీరు దయదలచకపోతే యెట్లా బతుకుతాం గులాపోణ్ణి" శాయన్న తల నేలకువేసి, వున్నసంగతి బయట పెట్టాడు.

"నీకేమైన పిల్లలారా?"

"పిల్లలెక్కడినుంచి పటేలా, ఎండా కాలంలో మొదటి కాన్పుంది." కొండల్ రెడ్డిమాట మార్చి పక్కనున్న లింగయ్యను చూస్తూ "ఈ అలగా జనానికి సంతానం బాగా వుంటుందోయ్. మా పెద్దోడి భార్య కాపరానికొచ్చి అయిదేళ్ళయింది. పిల్లలు లేరు. మా మేనమామ సంగతి తెలుసుగా. ఎంత ఆస్తి, ఎంత తెలివి, ఎంత పేరు ప్రతిష్టలు; కాని సంతానం లేదు. ఏం చిత్రమోగాని ఆస్తివుంటే పిల్లలుండరు. పిల్లలుంటే ఆస్తి వుండదు."

"నీ పెద్దకొడుకు రెండో పెండ్లిగురించి అనుకుంటూ వుంటివి ఏమయింది?" లింగయ్య అడిగాడు.

"అనుకున్నా. కాని మనసుమీదికి తీసుకోలేదు. చూద్దాం. భగవంతుడేం చేస్తాడో" కొండల్ రెడ్డి నిరుత్సాహంతో అన్నాడు.

"మా వాడు అంతయ్యా కొత్తవేషం వేస్తున్నాడయ్యా! పెండ్లి చేసుకోడట; అప్పు తేవద్దట. తన ఇష్టం వచ్చిన పిల్లను ఇష్టం వచ్చినపుడు చేసుకుంటాడట. ఏం చదువో. ఏం సావాసమో" లింగయ్య తన పంచాంగం విప్పాడు.

"ఏం సావాసమేంటి. పాడుసావాసం. నీ విట్లాగే వూరుకుంటే చేతికిరాడు. పాడై

పోతాడు.లింగయ్యా" కొండల్ రెడ్డి హెచ్చరించాడు.

"ఏం జెయ్యాలె. ఇంటికి వచ్చినప్పుడల్లా పోరుతూనే వుంటాను. అందుకోసమే గ్రామాలు తాతీళ్ళు (సెలవుల్లో) ఈసారి యింటికికూడా రాలేను. ఎక్కడో సభలంట, సంఘాలంట, పాటలంట, ఎవరికెరుక యేంగోలో" లింగయ్య అన్నాడు.

"ఈ సంఘాలు గింగాలు మస్తుగ చూచాను. గ్రాంధీ అని ఒకడున్నాడట. ఆయన చెప్పినదే శాస్త్రమంట, పాడిందే పురాణమంట, ఆ గ్రాంధీని ఎన్నిసార్లు జైల్లో పెట్టినా కొట్టినా బుద్ధిరాలేదట. ఒకటే మొండిపట్టు ఒకసారి ఉరిదీస్తె మనిగూడా కుంపినీ సర్కారు అంటే మన ఆలాహజ్రత్ (నిజాం)వద్దన్నాడట. అందుకోసం బ్రతికిపోయిండు"కొండల్ రెడ్డి తన రాజకీయాలను లింగయ్యకు తెలిపాడు.

"మన ఆలాహజ్రత్ కు గ్రాంధీమీద అంత ప్రేమెందుకో?" లింగయ్య ఆశ్చర్యంగా అడిగాడు.

"గ్రాంధీ అంటే ప్రేమగాదోయ్. మన రాజ్యంలో ఉరిదీయవద్దని ఖానూను (లా) వుంది. అట్లాగే కుంపిణీ సర్కారును గూడా వురిదీయవద్దంటే సరే అని వూరుకున్నది. మన ఆలాహజ్రత్ అంటే యేమనుకున్నావు. బాబన్ బరాడ్, ఛెప్పన్ రాజ్యాలు చెప్పికట్టింటాయి"కొండల్ రెడ్డి కోసేశాడు.

"అయ్యా!"అని తిరిగి జీతగాడు శాయన్న కొండల్ రెడ్డిని చూస్తూఅన్నాడు

"చూదాం పో" కొండల్ రెడ్డి నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు. శాయన్న ఆశ వదులుకొని గొణుగుకుంటూ యింటిముఖం పట్టాడు.

2.

రెండోరోజు శాయన్న కొలువుకు రాలేదు. ఊరు విడిచి వెళ్ళిపోయాడు. ఎక్కడ పొయ్యాడో యేంచేస్తున్నాడో ఊరివాళ్ళకు తెలియదు. శాయన్న ఊరు విడిచి అక్కడక్కడ కూలి చేసుకుంటూ కొన్నాళ్ళకు హైదరాబాదు చేరుకున్నాడు బట్టలగిర్నీలో కూలీగా తయారయ్యాడు. ఊళ్ళల్లో మాదిగ వాండ్లను దూరం చేసినట్లు పట్నంలో దూరంచేయక పోవడం శాయన్నకు చిత్ర మనిపించింది. బాపని, మాదిగ మొదలగు భేదంలేకుండా బజార్లో తిరుగ వచ్చు. సినిమాల్లో బస్సుల్లో కలసి కూర్చోవచ్చు అంటరాయించినవారెవరూ కనబడలేదు.బట్టలగిర్నీ కూలీసంఘం వ్యవహారం కూడా బాగానే వుంది.

కొండల్ రెడ్డి గుడ్లెర్రజేసి మాట్లాడితే వణికి పొయ్యే శాయన్న బట్టలగిర్నీ కూలీ సంఘపు వూరేగింపుల్లో సభల్లో-

"మూడు నెల్ల మంగాయి భత్తా(D. A.) కావాలె.

"మిల్లు జాబర్ల మేస్త్రీల జులుం ముర్దాబాద్.

"జీతాలెక్కించాలె:

"లేకుంటే హర్తాల్ చేస్తాం.

"ప్రజల సర్కారు కావాలె.

"పోలీసు జులుం ముర్దాబాద్.

"లాల్ బావుటా జిందాబాద్"

అనిగొంతు చించుకొని కేకలేసేవాడు. ఉత్సాహంగాతలెత్తి,తాను ఒక మనిషిగా దర్జాగా నడవడం నేర్చుకున్నాడు.

మళ్ళీ సంవత్సరం తరువాత చుట్టాలను చూచి పెండ్లాన్ని తీసుకొని పోవాలని దేశం చేరుకొన్నాడు. శాయన్న ఊరు విడిచిన తరువాత పెండ్లాం పుట్టింటికి చేరుకుంది. కాబట్టి బండకింది గూడెంలో కుటుంబమంటూ లేదు. వచ్చినప్పటినుంచి మాదిగగూడెంలో వాళ్ళను వీళ్ళను కలసి మాట్లాడుతూ కాలం వెళ్ళబుచ్చాడు. కొండల్ రెడ్డి జీతగాడు నర్సయ్య పెండ్లాం పోయి శాయన్నను తన యింటికి పిలుచుకొని పోయింది. శాయన్నను నర్సయ్య మొదట గుర్తుపట్టలేదు. కట్టుకున్న బట్టలు తనకంటె మంచిగావున్నాయి. సిగరెట్టు డబ్బి, అగ్గిపెట్టె జేబులోనుంచి కనబడుతున్నాయి. ఇవన్నీ నర్సయ్యకు నోట్లో నీళ్ళూరించాయి కాని రెండోవైపు నర్సయ్య దిగులులో పడ్డాడు. శాయన్నకు రాత్రికి అన్నంపెట్టాలె ఎట్లా? పెండ్లాం వైపు చూచాడు నర్సయ్య. పెండ్లాంకూడా ఎటు తోచక తల నేలకు వేసింది.

'ఏమిటే? ఆలోచిస్తున్నావు.' అని శాయన్న నర్సయ్యను అడిగాడు.

'బువ్వకు కష్టంగావుందే. ఆలుమగలం రెక్కలు విరుచుకున్నా గడువడంలేదు. మా అయ్య జీతమున్నప్పుడు ఒక ముసలి యెద్దు తప్పిపోతే దానికింద నలుబై రూపాయలు బాకీ తేల్చిండు పటేలు. నెలకు కుంచెడు కోసుకుంటున్నాడు" అని తల నేలకువేసి ఆలోచిస్తూ అన్నాడు నర్సయ్య.

"నేనుకూడా ముప్పయి రూపాయిలివ్వాలిసుంది గదోయ్. అన్నీ దొంగ లెక్కలు కడుతాడోయ్ వీళ్ళంతా" అంటూ శాయన్న జేబులోనుండి 8 అణాలు తీసి నర్సయ్యకిచ్చాడు.

నర్సయ్య ఆ అణాలు పెండ్లానికిస్తూ "ఉల్లిగడ్డలు చింతపండుకూడా తీసుకొని రావే 'పచ్చడి నూరుదువు' గాని అన్నాడు.

ఆరోజు రాత్రంతా శాయన్న పట్నం సంగతి కూలీలసంఘం సంగతి నర్సయ్యకు చెప్పాడు. పొద్దున మొదలు సాయంత్రం వరకూ మాదిగగూడెంలో అందరితో కలిసి తన అనుభవాలు తెలుసుకున్న రాజకీయాలు పూసగుచ్చినట్లు చెప్పాడు. కూలోళ్ళ సభలు, సంఘాలు, ఊరేగింపులు, ఉపన్యాసాలు వివరంగా చెప్పాడు. మొత్తం మాదిగగూడెంలో క్రొత్త ఆశ్చర్యాలు, ఆశ మేలుకున్నాయి

3

ఉదయం పక్క గ్రామం వెళ్ళిన కొండల్ రెడ్డి సాయంత్రం ఇల్లు చేరుకొని, ఇంటి ముందర వేపచెట్టు అరుగుమీద తన తొత్తులతో మాట్లాడుతూ కూర్చున్నాడు. బడేసాహెబు జవాన్ వచ్చి శాయన్న వచ్చాడని మాదిగగూడెంలో అందరికీ యెక్కిస్తున్నాడనీ బతేగప్పాలు కొడుతున్నాడనీ కొండల్ రెడ్డికి చెప్పాడు.

"వచ్చినాడని చెబుతున్నావు బద్మాష్ రెక్కలువిరిచి పట్టుకురా లంజాకొడుకును"

వెంటనే బడేసాహెబు మాదిగగూడెం పోయి శాయన్నను పట్టుకొని కొండల్ రెడ్డి వద్దికి తెచ్చి నిలబెట్టాడు. శాయన్నను కొండల్ రెడ్డి పిలిపించాడని తెలువగానే

మాదిగగూడెంలో భయం మొదలయింది. బండలెత్తి రూపాయిలు వసూలుచేస్తాడని అంతా జ్యోతిషం చెప్పారు. శాయన్నను చూడగానే కొండల్ రెడ్డి "ఓహో! మొగోడి రంగే మారిందోయ్. ఏమిరా నీ అప్పు యెవడు చెల్లిస్తాడు? అప్పడిగితే చెప్పకుండా పారిపోతావురా? లంజా కొడుకును రూపాయిలు యిచ్చేదాకా కదల నీయకు." అని బడేసాహెబును చూస్తూ వురిమాడు.

"ముప్పయి రూపాయిలు అయిదేండ్లు జీతం చేసినా తీరలేదా పటేలా?" అని ఇదేమన్యాయమన్నట్లు కొండల్ రెడ్డివైపు చూచాడు శాయన్న.

"దొంగముండాకొడుక మాటలుకూడా నేర్చుకున్నావ్. నీకు లెక్క కావలె చూపిస్తా లెక్క. ఆగుంజకు కట్టివేయరా" అని తన తల్లిపేర కోడెను కదిలినప్పుడు పాతినగుంజను బడేసాహెబుకు చూపాడు.

"నేనైతేఒక దమ్మిడికూడాయియ్యను. చంపితే చంపు" శాయన్న అన్నాడు. శాయన్న మాటలు బడేసాహెబుకే కోపం తెప్పించాయి. బడేసాహెబు తన చేతి కట్టెతో శాయన్నను ఒక దెబ్బవేశాడు. శాయన్న పులివలె బడేసాహెబుమీద పడి కర్రతీసుకొని బడేసాహెబును బాదటం మొదలెట్టాడు.

కొండల్ రెడ్డి అసలే అసాధ్యుడు. పైగా బాగా తాగివున్నాడు. శాయన్న మాటలు, బడేసాహెబు పైనబడి కొట్టడం తనకు భరింపరాని సిగ్గుగా తలచాడు. కొండల్ రెడ్డి కళ్ళు తెరచి నప్పటినుంచి శాయన్నవలె ఎదురుతిరిగి మాట్లాడి తిరిగిన వాడెవడు లేడు. కొండల్ రెడ్డి కోపంతో వణికిపోయ్యాడు. వళ్ళు మరచి పిచ్చివాడి లాగా ఇంట్లోకి ఉరికి గడకొయ్య తెచ్చి బలంగా శాయన్న నెత్తిపై ఒకటే కొట్టడం మొదలు పెట్టాడు. శాయన్న తలపగిలి నెత్తురు కక్కుతూ క్రింద పడ్డాడు. కొద్ది సేపట్లోనే ప్రాణాలుపోయినవి. అందరూ కలసి పీనుగను బజారునుంచి లోపలికి తెచ్చి పశువులదొడ్లో పడవేశారు.

నెత్తురు కండ్ల చూడగానే కొండల్ రెడ్డి మత్తు దిగింది. ఏటు తోచక పిచ్చి వానిలాగా ఇల్లంతా తిరగడం మొదలెట్టాడు. ఇంటి తలుపులు బిగించి కూర్చొని ఆలోచించ సాగాడు. పోలీసుల కాళ్ళు పట్టుకోవడం కంటే వేరే దోవలేదని రెండు వేల రూపాయలు తీసుకొని దొడ్డిగుండా పోలీసు స్టేషనుకు చేరుకున్నాడు శాయన్న చచ్చిన సంగతి వూళ్ళో అందరికీ తెలిసే పోయింది మాదిగ గూడెంలో కోపం భయమూ ఒయలు దేరాయి కాని ఏమి చెయ్యాలో తోచడంలేదు. శాయన్న చావుకు వణికి పోయ్యారు

'దెబ్బలతో పోలేదు చావులకుకూడా దిగుతున్నది' అని కొందరనుకున్నారు.

'ఏమిపుటకలు పాపపు పుటకలు' అని కొందరు నిరుత్సాహ పడ్డారు. 'ముప్పై రూపాయలకు ప్రాణాలే తీశారే! యేమి అన్యాయం!" అని కొందరు దుఃఖపడ్డారు

'ఎంతైనా తొందరపనే చేశాడని' కొందరు తలచారు.

'ఈ ఉసురు పోతుందీ ఏదో పాడుకే వచ్చిందని కొండల్ రెడ్డి భార్య దిగులు పడ్డది.

'ఎట్లా ఈ తప్పునుండి తప్పించుకుంటాడో" మాదా - మని కొండల్ రెడ్డి తొత్తులు కొండల్ రెడ్డి తెలివిపై చర్చించారు.

తెల్లవారేవరకు కొండల్ రెడ్డి దిడ్డి గుంటా ఇంటికిచేరుకున్నారు. జాముపొద్దు యెక్కేవరకు పోలీసు సిబ్బందితో అమీన్ వచ్చేసాడు పంచనామా కూడా మాములు పోయింది.

తర్వాత కొన్నాళ్లకు శాయన్న చావును గురించి ఊరి చావిడిగోడమీద ప్రభుత్వ ప్రకటన ఇలా : వెలువడింది.

'శాయన్న పాముకరచి చచ్చాడని పోలీస్ అమీన్ రిపోర్టు పంపాడు కాబట్టి శాయన్నచావుపై ఎవరికైనా ఆక్షేపణ వుంటే 16 షహరేవరు 1355 ఫసలీనాడు మున్సఫీ ఆదాలతు (కోర్టు)లో హాజరుకావలెను" ఈ విపరీతంచూసి లింగయ్యకొడుకు [illegible]ంతయ్య, ముగ్గురుపూరివాళ్ళను వెంటబెట్టుకొనిసాగా అదేరోజు అదాలతుకు వెళ్ళాడు కొండల్ రెడ్డి శాయన్నను చంపాడని తానూ తనవెంటవచ్చిన ముగ్గురుగ్రామస్థుల సంతకాలతో ఆక్షేపణ వ్రాసి తెలిపాడు.

"శాయన్నకూ దరఖాస్తు ఇచ్చినవాడికీ రేమీ సంబంధంలేదు. కాబట్టి ఆక్షేపణ అంగీకరింపబడజాలదని" మున్సఫీ నాజం (మాజిస్ట్రేటు) ఆక్షేపణను కొట్టివేశాడు; కనుక ఆక్షేపణ లేదు. న్యాయంగా శాయన్నను పామే కరిచింది.

లేవరా! లేవరా!

శ్రీ 'శశాంక'

లేవరా! లేవరా!
లేచి నడుంబిగించాలిరా!
అరుణారుణ క్రాంతి జ్యోతి
జాగృతిలో నవతరించి
సర్వ సుషుప్త వ్యవస్థకు
స్వస్తిచెప్ప సమయమిదే,
లేవరా! లేవరా!...
ఘనతిమిరావృత మయ్యెను
తుది సమరారంభమయ్యె
వృద్ధజగతి నిశీథాంత
మహాస్సులో–ఉషస్సులా!...
లేవరా! లేవరా!...

నీ కడుపుకే తిండినిడని
నిఖిలలోక సిరిసంపద
సృష్టిస్తా వెందుకురా!
కష్టిస్తా వెందుకురా!
లేవరా! లేవరా!...
శ్రమ ఫలితం నాదేనని
బూర్జువాల ప్రతిఘటించి
వర్గరహిత స్వర్గానికి
అనాదిలో — పునాదివై
లేవరా! లేవరా!
లేచి నడుం బిగించాలిరా!

లే లే లే

శ్రీ 'మునీంద్ర'

ఓహోఓహో
ఓ వ్యధితజగతి !
లేలేలే
ఓ జీవనస్రవంతీ !
ఓజగతీ !
నెత్తురునీడ క్రింద నిద్రాణపుశిశువులతో
నీవిశాలవలయంపై విషచ్ఛత్రంతో
పాడెదవో సంధ్యాగీతం ?
ఓజగతీ -
ఓమాతా !
ఓశక్తీ !
లేలేలే !
ఈ ఆకస మొక అరుణపతాకంగా
దశదిశనినదములే మేల్కొలుపులుగా
నీశిరసున క్రాంతికిరీటంతో
లేలేలే - నాపృధ్వీ !
నీ గోళపుగర్భంలో
నాఆకలి నాలాపింపుము
ఆలాపింపుము నా అశాంతిగేయం
నీహృదయపు లోతుల్లో
జ్వాలలు రేపుము
పాడుము పాడుము నాందీగానం
నవవిశ్వపు నాందీగానం
భవదాస్యపు భరతవాక్యము !

చిన్న కథ

పెళ్లి చేశారు!

శ్రీ 'తుమ్మల'

ఒక్కొక్కరే స్నానాలు ముగిస్తున్నారు. రంగమ్మ సంతోషంగా మాట్లాడుతూ అప్యాయతగా అందరికీ అవీ ఇవీ అందిస్తూవుంది. చీకటి మసక మసకగా వుంది. దీపంబుడ్డి వెలిగించుకొని నడిమింటిలోకి రంగమ్మ ప్రవేశించింది. వృద్ధాప్యం పైబడ్డా దానిని లెక్క చేయకుండా ధిక్కరించి తిరుగుతున్నట్లు కనబడుతుంది రంగమ్మ కనుబొమ్మలు చిట్లించి కళ్ళపై చెయిబెట్టి. "ఎవరబ్బాయి అక్కడ? తానానికి లేచవేం." అంటూ తేరిపారజూచింది.

"నే చేయనులే అమ్మమ్మా!" అని అక్కడ కూర్చున్న కుర్రాడు జవాబు చెప్పాడు.

"ఏంది నాయనా? ఎంతదూరం నుండి వస్తుర్నో. కాళ్లు పీక్కపోయి వుంటవి. కాసిని వేన్నీళ్లు పోసుకుంటే ప్రాణం హాయిగుంటుంది. తిన్నచోట పండరు. పండినచోట తిన్రు. ఏం కష్టాలొచ్చినయిరా నాయనా." అని దళానికి సానుభూతిగా పల్కింది రంగమ్మ.

"నరసన్న దిగులుపడ్డట్టుందే" అంటూ దళంలో ఒకరు వ్యాఖ్యానం ప్రారంభించారు.

"కొత్తపిట్టగదూ, తాకిడికి తట్టుకోలేకపోయి వుంటుంది."

"ఎందుకు పనికొస్తరు ఈ అబ్బరాకాంగవోళ్లు."

"ఎంతలావుంటే సరిపోతదా? అసలు సులుసూత్రం తెలియాలిగాని,"

"తెలుస్తుందిగా రేపు మనం చేసే దాడిలో"

మధ్య మధ్య నవ్వులు వేళాకోళాల్తో ఇలాగే సంభాషణ సాగుతోంది.

"నువ్వేరా బాబూ! ఎవరో అనుకున్నా. ఎంత మారిపోయినవ్. మావూరినుండి దళంలో ఒక్కరైనా చేరారని అంతా సంతోషించుతున్రు."— అంటూ రంగమ్మ మధ్యలో అందుకొంది.

"అయితే నరసన్నకియాళ మొలలోతు పప్పన్నం"—రంగమ్మ అదోవిధంగా నవ్వింది

"ఏంటి అమ్మమ్మా అది" — అందరూ ఒక్కసారిగా ప్రశ్నించారు. జవాబు కెదురుచూస్తున్న దళానికి బాకాలూదిన శబ్దం వినిపించింది.

"ఎటెన్షన్" అంటూ దళాధిపతి ఆజ్ఞాపించాడు. గబగబా ఆయుధాలు చేతబట్టి నిలబడుతున్నారు దళసభ్యులు.

"అవి పెళ్ళిబాకాలు నాయనా! మీరు గాభరాపడనక్కర్లేదు. మీరు ఊరిచుట్టు కాపలా పెట్టేరుగా" - రంగమ్మ దళానికి విశదపరచింది.

"ఆనా సంగతి పెళ్ళెవరింట్లో" ఆయుధాలు క్రిందపారేసి నవ్వుకుంటూ రంగమ్మని ప్రశ్నించారు దళసభ్యులు.

"ఎవరింట్లోనో కాదు. మన నరసన్న ఇంట్లోనే" అంటూ రంగమ్మ జవాబిచ్చింది.

"అయితే యింకేం, మనందరికీ పెళ్ళి భోజనాలు చేయించవోయి నరసన్నా. ముసలమ్మను బాధపెడతం దేనికి పెళ్ళికి వెళ్ళేసమయం చిక్కడినా ఏమిటిదిగులు!" దళాధిపతి వేళాకోళంగా నరసన్నను ప్రశ్నించాడు

రంగమ్మ మధ్య అడ్డొచ్చి మళ్ళా అందుకొంది

"నరసన్నా! మీ బాబు కబురు చేసింటురా? అయినా ఎక్కడో నన్నుగని చేస్తడులే. అబ్బాయి నీకోసం గాని వత్తే నేచెప్పలేను కాని ఏం పెళ్ళోరా నాయనా! అబంలేదు. శుబం లేదు. అచ్చాటాలేదు. ముచ్చాటాలేదు. నీ బాబు ఎంతనుకుంటే అంత. తన మతికి ఎంత దోస్తే అంత. ఒకరు చెప్పితే వింటడా. ముసలిదాన్ని మొగలనీయలేదు. మీ అమ్మ నోరు నొక్కిండు గదా! పిల్లది గడగడ వడికి పోతుండదిగదా."

"అందుకనేనమ్మా నాకు దిగులు. నేను వెళ్ళే ముందు బాబు ఈ విషయం తెస్తే, ఆయనతో పోట్లాడి మరీ వెళ్ళాను." — నరసన్న మౌనవ్రతం మాని రంగమ్మకి జవాబిచ్చాడు.

మళ్ళా బాకా లూదినశబ్దం వినబడింది. అందరూ డ్రెస్ వేసికొని బారులు తీర్చండని దళాధిపతి ఆజ్ఞాపించాడు.

"భోజనంచేసి వెళ్ళరు నాయనా"

"మళ్లా వస్తాం"

లెఫ్ట్, రైట్! లెఫ్ట్, రైట్!

దళాధిపతి వెంట మార్చి చేసికొంటూ పోతున్నారు గెరిల్లాలు.

వాకిటుదాకా వచ్చి వారివంక అదే పనిగా చూస్తోంది రంగమ్మ.

కామరెడ్డి గూడెంలో రంగమ్మ ఇల్లు ఊరిబయట వుంది. గెరిల్లాదళం ఎప్పుడు వచ్చినా అక్కడ మకాం వేస్తావుంటుంది. నైజాం మిలిటరీ రాక్షస మూకలతో పోరాడుతూ ఉన్న ఒక్క కూతురు మరణించిన తర్వాత రంగమ్మకు మరో చింత లేదు. నైజాం రాక్షసుల్ని హతమార్చాలని తప్ప. దళం యింటికి వచ్చిందంటే వారిని ప్రాణప్రదంగా చూసుకుంటూ వేయి కళ్లతో కాపాడుతూ వుంటుంది. చీమ చిటుక్కుమన్నా రంగమ్మకు మనస్సులో అదే యావ. తీరా భోజనమన్నా చేయకుండా బయలుదేరారే అని రంగమ్మ కొంత నొచ్చుకుంటూంది. దళాధిపతి బుచ్చన్న ఒకసారి చెప్పాడు. "అమ్మమ్మా! నీ వేది చెప్పినా వింటాం. కాని మమ్మల్ని ఎక్కడికి? ఎందుకు? అని ప్రశ్నించకు. మాపనికి అడ్డంచెప్పకు." అందుకనే హఠాత్తుగా బుచ్చన్న (దళాధిపతి) బయలుదేరిపోతే ఏమీ అనలేక పోయింది. బుచ్చన్న పోయిన దారివంకే చూపు ఆనినంతవరకు చూస్తూ నిలబడిపోయింది.

* * *

రఘయ్యవంటి మొండిఘటం ఆవూళ్లో మరెవ్వరూ లేరు. ఎవరు చెప్పినా వినిపించుకొనేరకం కాదది. తనమతికెంత తోస్తే అంతే. తండ్రికి తగ్గకొడుకవుతాడని నరసన్నని అనుకొనేవాళ్ళు. కాని రఘయ్య ధాటికాగలేకపోయాడు. ఒకనాడు చెప్పకుండా ఎటో లేచిపోయాడు. నరసన్న గెరిల్లాదళంలో చేరాడనీ, ఆదళం అప్పుడే రెండు మూడు విజయాలు సాధించినదనీ విన్న గ్రామప్రజలు, అతన్ని గురించి గర్వపడుతున్నారు. "నరసన్న వుంటే ఇలా అయ్యేదికాదేమో, యెంత మొండిఘటమైనా" అని అనుకొంటున్నారు "ఎవరిరాత ఎవరు తప్పిస్తారులే. దానిరాత అలావుంది" అని ఓదార్చుకున్నారుకొందరు. "కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగుతుందామరి? తలొక చెయ్యివేసి శుభకార్యం నెరవేర్చుదాం" అనుకొన్నారు కొందరు.

పెండ్లి పందిరిలో చాలా సందడిగా వుంది. ఊడిపోతున్న గోచీ సర్దుకుంటూ కేకలు వేస్తూ రఘయ్య ఇతరులకుపనులు పురమాయిస్తున్నాడు. ఊరు బయిట బాకాలూదిన శబ్దమయింది. "కావిళ్లెత్తుకోండ్రా! ఏందిరా అట్టానిలబడతారు? పొద్దు పోవడంలే?" రఘయ్య ఆజ్ఞాపిస్తున్నాడెవరికో. అప్పచ్చులు తింటూ కొట్లాడుకుంటూ కాళ్లకడ్డం బడిన పిల్లల్ని అవతలికి తోసివేస్తూ "మాదిగ ముండల్లారా! చంపేస్తాను పొండవతలికి" అంటూ కొట్టడానికి ఎత్తిన చెయ్యిని దాచేశాడు రఘయ్య.

"ఏమండీ"

"ఇట్టా రండి"

లోపలినుంచి రఘయ్య భార్య రెండుసార్లు కేకలు వేసింది

"దేనికి? ఎప్పటికీ తెమిలి యేడవదు. యేం వచ్చింది"-రఘయ్య ఉరిమాడు.

"అమ్మాయి..." అని ఏదో చెప్పబోతుంది రఘయ్య భార్య శాయమ్మ.

"అమ్మాయి?" గర్జించాడు రఘయ్య

"అక్కడవుండే ఏమిట్రా కేకలు? మంచీ చెడ్డా లేదు. అవతలవాళ్లూ వీళ్లూ ఉన్నారన్న ఇంగితం లేకపోయె"

"ఏమిట్రా ఆడముండ సాధింపులు! అవతలొకపక్క వాళ్లొచ్చి కూర్చుంటేను. ఇంకా యింటిపనులే తెమలడం లేదాయె." అన్నాడు రఘయ్య కొంత తగ్గి.

"అమ్మాయికి అక్కర్లేదంట"

"ఏమిటి? పెండ్లా? తిత్తి వలుస్తాను. ఏదీ?"

రఘయ్య ఒక్క దూకులో గదిలోకి వచ్చిపడ్డాడు, చుట్టూవున్న ముసలమ్మలు గడ్డంక్రింద చెయిపెట్టుకొని విస్తుపోతూ చూస్తున్నారు. తమపైకి ఏంవస్తుందో అని మెల్లమెల్లగా పక్కకి తప్పుకొన్నారు.

"రఘయ్య మంచి సబావం పోనీయడు" అంటూ నవ్వుతున్నాడు కావిడిపట్టులు సర్దుతున్న కుర్రాడొకడు.

"కానీయండ్రా ఈ సోదికేంగాని అవతల పొద్దుపోతోంది" అన్నాడొక నెరిసిన తల కాపు.

ఈ రణగుణధ్వని మధ్య, గదిలోంచి సన్నని గొంతుకతో ఏడుపు వినపడుతూంది.

"ఎందుకండీ అంత తొందర ? సాంతం వినకుండానే ఏమిటా అఘాయిత్యం ? పెడ వంచి ఎలాగో పెళ్లికి రప్పించారుగా ! అది కాదు. దానికా చీర వద్దంటుంది." అన్నది శాయమ్మ కూతురికీ భర్తకూ మధ్య నిలబడి.

"అసలు నీదగ్గర వుంది. ఈ మాత్రం దానికి నన్ను పిలవాలా యేంటి ? దానికి చీర కట్టించడానికి ఇంత రాద్ధాంతమా ! అవతల పొద్దుపోతూంది పానకాల కాడికి పోతున్నా. సముదాయించి ఏదో అఘోరించు." అంటూ రఘునయ్య బయటు కడుగు పెడుతున్నాడు.

"శాయమ్మా! ఏందే, ఒకటి అగుపిస్తే ఇంకోటి అగుపించదు. తిరుగమోతనూనె ఎక్కడ పెట్టిందే?" అంటూ రాగాలుతీస్తూ రఘునయ్య తల్లి ప్రవేశించింది. కోడలిపైన ధామ్ధూమ్లు చేయడం విన్నది.

"ఏమిట్రా, ఎంత సేపూ గదిలో కూచ్చుని కేకలెడతారు, అంతా నాకోసం ఎదురుచూస్తూంటే ? ఏమిటాపిల్లదానిమీద కేకలు. తెచ్చావు మాలావు సమ్మంధం. ఈపూటన్నా దాన్ని వదలి పెట్టకూడదూ ? చిన్నది తెలిసో తెలీకో ఏదన్నా అంటే సమదాయించాలిగాని అట్టా వంటికాలి మీదలేస్తే ఎట్టా ?" అంటూ కొడుకును మందలించింది రఘునయ్యతల్లి. "ఈమాత్రం దానికి మొగుడుతో మొర్ర పెట్టుకోవాలేం ?" అంటూ కోడలివంక చుర చురా చూస్తూంది.

పెళ్లికూతురు శాంతమ్మ గడగడ వణుకుతూ ఒక మూలన బడింది. దెబ్బ తిన్న లేడిలా అమ్మవంకా బాబువంకా నాయనమ్మవంకా చూస్తోంది.

"రఘునయ్య మాఁవా ఇంట్లోనే పాతుకు పొయ్యావేమిటే"

"మాపిల్లకి ఆఁ లేస్తుందని ఏదో సెలు బొక్కుతున్నావురేరా"

హిహిహీ - గొల్లున నవ్వుతున్నారు పెళ్లి పందిట్లో

"ఏదో మారేయేసవండి ఈ బాగ్గానికి పని చెడగొట్టి నన్ను పిలవాలేం ! యీ మాత్రం నిర్వాకం చేయకొని బతుకెందుకూ ?" అంటూ ఒళ్ళు నూరాడు భార్య మీద రఘునయ్య, కూతురువంక జూసి, "శాంతా ! కిక్కురు మన్నావంటే తెలుసా ? నాకు కోపం వచ్చిందా మరి షిరి కాను." అంటూ బెదరించాడు. పందిట్లో కేకలకి జవాబుగా.

"దబ్బున తెమల్చండి. వస్తున్నానుండండ్రా, ఏవి యేళాకూళాలురా ?" బయటికి అడుగు పెట్టాడు రఘునయ్య. మళ్లీ వెనక్కి తిరిగి,

"అదిగో! ఆచీరే కట్టండి దొరగారు మరీదగ్గరుండి కొనిపించాడంట. అమ్మాయి కది కట్టకపోతే వాళ్ల ముచ్చట ఎట్టా తీరుద్ది ? కోపం వస్తది. పైగా పెద్ద వాళ్లతో సంమ్మంధం" అంటూ పెళ్లి పందిరి లోకి వచ్చి పడ్డాడు రఘునయ్య.

రఘునయ్య తల్లి సాధింపులుసాగించింది

"ముచ్చటంట ! ఆ అచ్చటా ముచ్చటా వుంటే ఇలాగెందుకు ఏడుస్తుంది ? ఇంట్లో అబ్బాయైనా లేకుండ మావోళ్లన్ని నొక్కి చేస్తుండేది చాలదు ? చీరెల దగ్గిర్నించీ మీయిష్టమేనా? దానికిష్టంవచ్చింది కట్టుకొనరాదు ?"

"ఏమిటమ్మా ఈ సాధింపులు? నేనేమన్నానా నీ కొడుకును బలవంతం చేశానా? అప్పుడేమైపోయి ఈనోళ్లు? ఎదటుఅంటానికి ఒకరికీ నోరురాదు. చాటున బడి ఏడుస్తారు! ఇంతకూ నారాత మంచిదైతే..." రఘుయ్య భార్య కన్నీళ్లు తుడుచుకుంటూంది.

"అమ్మ నా కొద్దే" మూల మూలకు ఒదుగుతూ పోతూంది శాంతమ్మ. రఘుయ్య తల్లి, కోడలు వంకా, ముత్తవరాలి వంకా, కావడి పెట్టిపై చీదరంగా చూస్తూ నిలబడిపోయింది. రఘుయ్య భార్య కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ అలాగే కూర్చొబడింది. ఓ మూల దీపారాధన ప్రమిద మినుకు మినుకు మంటూ జాలిగా చూస్తూంది. దూరంగా తాసామురపాలధ్వని, బాకాలూ ది చప్పుడు, ఇంటిముందు పిల్లల పెద్దల కోలాహలం. కాని గదిలో భరింపరాని నిశ్శబ్దం

దొర (దేశముఖ్) గారి సలహాతో పెళ్ళి కొడుకు ప్రధానంకంటూ పంపిన ఎర్రపట్టు చీర పెద్ద దెయ్యం నోరులా తెరచుకొని శాంతమ్మ వంక చూస్తోంది. శాంతమ్మ చెక్కిళ్ళ వెంట జలజలా కన్నీళ్లు రాలుతున్నాయి. వణుకుతున్న పెదవుల మధ్యనుంచి "వద్దు! వద్దు!!" అన్న శబ్దం బయటకు వెగిరి రాలేక రాలేక వస్తోంది.

* * *

ఊరిబయట పెళ్ళివారు దిగారు. పానకాల కావిళ్ళు దిగాయి. కాళ్ళూ చేతులూ కడుక్కొని బంధువులంతా పానకం స్వీకరిస్తున్నారు.

పెళ్ళికొడుకు సోమయ్యకీ దేశముఖ్ కూ ఏదో సంబంధం వుందట. దేశముఖ్ అక్కడినుండి పారిపోయి పట్టణంలో మకాంబెట్టి ఆంధ్ర మహాసభ వారితో రాజీలకు కబురుపెడుతున్నాడు. ఆ గ్రామస్తుల మెప్పు పొందుదామనో ఏమో, పెళ్ళికొడుకుకు తమ తాలూకు కచ్చడంబండీ, యితరసామాగ్రీ వగైరా పంపి, పెళ్ళికొడుకు వారి దర్జా కొంత హెచ్చించారు. పెళ్ళికొచ్చిన పెద్దలలో కుర్రకారు తక్కువ. ఎక్కువమంది ముసలాళ్ళే.

"దళం వారు వచ్చారు. కూర్చోబెట్టండి"

"ఏయ్! పిల్లలూ మీరట్టా సద్దుకోండిరా!"

"మనూళ్లో మీటింగ్ ఉందేమండి? రెండూ కలిసొచ్చినాయి. పెళ్ళయాక మీటింగు పెట్టుకుందాం. అందరికీ తీరుబడిగా వుంటుంది."

"పానకం ఈయండిరా వారికి"

"మాకు సత్కారాలకేంవచ్చిందిగాని పెళ్ళికొడుకు ఏడండి?

"అడుగో! మీ ప్రక్కనే."

"వీరేనా అండి!"

"అవును. ఇప్పటి పెళ్ళిళ్లలాగ అట్టేఅట్టహాసం చేయలేదు లెండి. ఇదివరలో చేస్తే సరిగా ఫలించలేదని ఇపుడా ఆనవాయితీలన్నీ మార్చివేశాం లెండి."

"అంటే ఇది..."

"ఎబ్బే! మూండో పెండ్లి లెండి!"

"మూండో పెళ్ళని చెప్తేగాని, ఎంతో

వయస్సు లేదండి. మన నరసన్న పుటకలకి ఆయన మొదటి..."

"అపవయ్యా! ఎవ్వడడిగాడీ సోదంతా నిన్ను" అని గద్దరించాడు రఘువయ్య. దళాధిపతి బుచ్చన్న ప్రశ్నలకు జవాబు చెబుతున్న ముసలాడు మెదలకండా కూర్చున్నాడు. బుచ్చన్న సంచిలోంచి నల్లని వస్తువు పెళ్ళికొడుకు ముఖానికి సమీపంగా ఆనిచ్చాడు

పెళ్ళికొడుకు అదిరిపడ్డాడు. తలగుడ్డ వెనక్కి పడింది. "అదేంపని! అదేం పని బాబూ పిస్టలా?"

"మీరు కదలకండి" వలంటీర్లు ఆజ్ఞాపించారు. పెళ్ళికొడుకుచుట్టూ చేరారు.

"పిస్టల్ కాదులేవయ్యా. బాటరీలైట్ అంటూ స్విచ్ వేశాడు బుచ్చన్న.

"బలేపని చేశావే, మా గుండెలన్నీ ఆగిపోయాయి. హిహిహీ" – అంటూ భయంతో గూడిన నవ్వు నవ్వాడు ముసలాడు.

"ఏమండీ పెళ్ళికొడుకుగారూ ఎన్నో పెండ్లండి యిది?

"మూడు"

"ఇదివరకెంతమంది పిల్లలు?"

"నల్గురు"

"ఇద్దరు కాపరానికెళ్ళారు అబ్బాయి వయసుకొచ్చాడు పోతే ఒక పోరడు మాత్రం వున్నాడు. వాణ్ణి సాకడం తప్పితే పిల్లకాకట్టే కట్టం లేదులెండి."– పెళ్ళికొడుకు ప్రక్కన ముసలాడు కాస్త ధైర్యంతెచ్చుకొని జవాబులిస్తున్నాడు.

"ఏమండీ? ఏమిటి తమ వేళాకోళాలు. లగ్నంవేళ మించిపోతుంది."

"వేళాకోళం లేదు. ఎగసెగాలూ లేవు, మీరు మాట్టాడకండి"

"తర్వాత బుచ్చన్న గారంతా తెలియజెప్పతారు. మీరూరుకోండి అడావిడి పడకండి."

దళం వలంటీర్లు అందరినీ సర్దారు. అంతా నిశ్శబ్దం–

"పెళ్లి కొడుగ్గారూ! తలఅలా నున్నగా గొరిగించారేమండి? పెళ్లికదా!"

"పెళ్లాం బోయిందిగా. మగడుపోయిన బాపనమ్మలా గీయించుకున్నాడు లెండి." ఎవడో పిల్లకాయ అనేశాడు.

హిహిహీ-ఫక్కున నవ్వారుకొందరు.

"ఎవర్రా అదీ! చిన్నా పెద్దా లేకుండా?"

"అది కాదులెండి"! పెళ్లికొడుకు తరఫు ముసలాయన చేతులు నలుపుకుంటూ దళాధిపతి వద్దకు వచ్చాడు.

"ఏం కాదు."

"తల నెరిసింది. కాస్త గుండు చేయించుకుని తలగుడ్డ చుడితే బాగుంటుందని అలాచేశాడులెండి. ఏదోమరి కాస్త ఈ కాలపు మనిషిలా కన్పించాలిగా!"

"సోక్ గాడే – మా చిన్నినాయనే" పిల్లలు ఒకమూలనుంచి పాట పాడుతున్నారు.

రఘువయ్య ఓర్పు ఇక హద్దు దాటిపోయింది.

"ఏంరా! గాడిదకొడకా, నేదుగా ఏడవలేకపీరిని వెంటబెట్టుకొచ్చావా?"అని

కొడుకు నరసన్న పైకి దూకడు. ఊళ్లో వాళ్ళురఘుయ్యని కాస్త వెనక్కి లాగారు.

"ఇంతకూ ఏమంటారండీ, ఈ పెళ్ళి సాగనిస్తారా లేదా? మీ యెవారమేంటో మీరు చూసుకోవాలిగాని ఇలాంటివాటిల్లో జోక్యంకల్గించుకోడం బావుండదు"అంటూ దళనాయకుని వంక చూచి అన్నాడు రఘుయ్య

బుజాన రైఫుల్‌తో రఘుయ్య కడ్డంగా నిలబడ్డాడు నరసన్న.

"చంపరా! వెధవ! చంపు. ఏమ్మాత్రం చంపుతావో చూస్తాను" అంటూ ఉద్రేకాన్ని, అవమానాన్ని పట్టలేక రఘుయ్య లేచాడు

"ఏమిటా తొందర. ఆళ్లు చెప్పేదేంటో విననే కాస్త"అంటూ ప్రక్కవాళ్లు మళ్ళీ కూర్చోబెట్టారు.

"ఏమయ్యా నీ వయసెంత?"

"నలభై"అన్నాడు పెళ్ళికొడుకు.

"నిజం చెప్పు" దళాధిపతి గద్దించాడు.

"ఇంకా కొంచెం వుంటవండి"

"సరిగ్గా చెప్పమంటే"

"58 ండీ"

"పిల్లకు?

"తెలవదండి"

"తెలియదూ?"

"పదమూడు"

"పిల్ల పెళ్లికి వొప్పుకుందా?"

"నాకేం తెలుసండి!"

"మరేం తెలుసని ముస్తాబై వచ్చావు?"

"ఏదోచిన్నతనంచేత మారాము చేస్తుంది కాని, తర్వాత అదే దారికి పడతది లెండి. అయినా పెళ్లికూతురు ఒప్పుకోటం ఏమిటండి. ఎబ్బే! అలాటి పిచ్చికళలుమనలో ఎక్కడా లేవండి."

పెళ్లికొడుకు తరపు ముసలాడు ఇంకా ఏమిటో చెప్పబోతున్నాడు. "ఇక కట్టిపెట్టు ఆ రఘుయ్య మెడలో కట్టమను తాళిని"

రఘుయ్య తల వంచుకు కూర్చున్నాడు. అసమర్థున్నయ్యానుకొన్నాడు. కళ్లనీళ్లు తిరిగాయి. పెళ్లికొడుకు గుడ్లు మిటకరిస్తున్నాడు.

"అయినా ఈ కాలాన్ని బట్టి ఇలాంటివి చేయడం అంత మంచిది కాదుళే"

"ఇంటిల్లి పాదీ నెత్తినోరూ కొట్టుకుంటున్నా ఇలాంటి సమ్మంధం తేవడం అదీ అంత మంచిదా ఏంటి?"

"అయినా దళంవాళ్లకిక్కిందులో సంబంధం ఏంటండి? వాళ్లపని వాళ్లు చూసుకోక"

"ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు. పెళ్లివారు లేచిపోండి" అని అజ్ఞాపించాడు నరసన్న. అందరి దృష్టీ నరసన్నవంకా, బుచ్చన్నవంకా వుంది.

"మమ్మాయికి బొత్తిగా యిష్టంలేదు. మావాళ్ళంతా మా బాబు బలవంతాన ఒప్పుకున్నారు. ఏమయినా సరే ఈ పెళ్ళి చేయనీయను." అంటూ నరసన్న ఒక ఉపన్యాసం యిచ్చేవాడి ధోరణిలో మాట్లాడాడు.

"ఏమండీ మమ్మల్నిట్లా అగౌరవపరచి పంపడం న్యాయమేనా?" అంటూ పెళ్ళికొడుకు తరఫున ఒకళ్ళిద్దరు కొమ్మెసుకు వచ్చారు.

"పీటల మీద పెళ్ళి చెడగొట్టడం న్యాయమేనా?" అని ప్రశ్నించారు.

"మీకింకా సత్కారం చేయకుండా వదులుతున్నందుకు సంతోషించండి. పీటల మీద పెళ్ళి కాదు చెడగొట్టింది. పీక మీద కత్తి తొలగిస్తున్నాము"

"లేవరేం, ఇంకా చూస్తారేం." అన్నాడు సరసన్న.

"భోంచేసి పోతారుగా వాలు" ఎగతాళిగా ఒక కుర్రాడన్నాడు.

"ఇక భోజనాలు కూడా. ఈ మర్యాద చాలు కట్టండి రా బళ్ళు" అన్నాడు ముసలాడు.

పెళ్ళికొడుకు ఊడిపోయిన గోచీ సర్దుకుంటూ బండికింకా గబగబా అడుగులు వేసుకొంటూ బయలుదేరాడు.

"బుచ్చన్నగారి ఉపన్యాసం వుంటుంది వింటే వినవచ్చు." వెళ్ళిపోయే పెళ్ళికొడుకు ముఠావంక జూచి ఒక కుర్రాడన్నాడు.

"ఈ ఉపన్యాసం చాలులే నాయనా"

"ఏంటిరొయ్యా గింజుకుంటున్నవ్"

"మాట్లాడబాకయ్యా పద. పెళ్ళికొడుకు తొందర పెట్టాడు ముసల్నాణ్ణి.

ఒక ఫర్లాంగు దూరం నడిచాయి పెళ్ళిబళ్లు. నవ్వులూ - చప్పట్లూ వినబడుతున్నాయి మీటింగులో. ఒక పెళ్ళిపెద్ద నిట్టూర్పు విడుస్తూ వ్యాఖ్యానిస్తున్నాడు.

"మా నోరుగల ముండాకొడుకురా బుచ్చన్న. చూశావ్ ఎంతలో వాళ్ళ మనసు తిప్పేశిండో. దళం చేసిన పనికి సంతోషంగా చప్పట్లుకూడ కొట్టిస్తుండు. ఇలాంటి పెళ్ళిళ్ళు వద్దని ఉపన్యాసము ఇస్తూ వుంటడు"

"ఎవడ్రా ఆ పసుగెత్తుకొచ్చేది?"

"ఎవడో బుడ్డాడు. వీంటో పట్టుకొని పసుగెత్తుకొస్తున్నడు"

"కొంచెం ఆపు"

"ఆపేదేంటి. పోనీయండబ్బ. ఏదో మళ్లా పన్నాగం వుంది." తొందరపెడుతున్నాడు పెళ్లికొడుకు.

మళ్ళా చప్పట్లు, హర్షధ్వానాలు వినబడుతున్నాయి మీటింగులో.

కుర్రాడు రొప్పుకుంటూ రోజుకుంటూ బళ్ల సమీపానికి చేరాడు

"ఇదిగో మీ చీర. మీ ప్రధానం చీర. మా అక్కయ్య మీ మొగాన పారవేసిరమ్మంది."

"ఎంతపొగరు పోరడికి"

"పోనీయండ్రా బండి. చీరకు నీకు ఒక సలాం. పోనీయండి బండి" పెళ్ళికొడుకు నోటిమాట ఇంకా తడబడుతూంది.

"ఇదిగో చీర, చీర" అంటూ కుర్రాడు కొంతదాకా వెంబడిస్తూనే వున్నాడు. పెళ్ళిబళ్ళు ఇంకా వడిగా ఉడాయిస్తూనే వున్నాయి. కుర్రాడు బళ్ళను అందుకోలేక పోయాడు

"పెళ్లంట ఈడిమొగానికి! ఈడిమొహం మండ! తూ" అంటూ చీర అవతలపారేసి గభాలున వెనక్కి తిరిగాడు. ఒక కర్ర ఎడం భుజంమీద వేసుకొని "లెఫ్ట్ రైట్ "లెఫ్ట్ రైట్!" అనుకొంటూ రొమ్ము విరుచుకొంటూపోతున్నాడు. అక్కడక్కడా ఆగి శాల్యూట్ చేస్తున్నాడు. మళ్ళా ఎవరన్నా చూస్తున్నారేమోనని వెక్కిచూసుకుంటూ పోతున్నాడు.

ముచ్చెమటలకు తడిసిన బోడిగుండును సవరించుకొంటూ 'హమ్మయ్య' అని నిట్టూర్పు విడిచాడు దూరాన బండిలో పెళ్లికొడుకు.

భవిష్యత్తు!

శ్రీ 'గంగినేని'

ఓహో! ప్రళయం
ప్రపంచపు రొమ్ములు
తరిగిందివ్వాళేనా!
అదిరి బెదిరి ఆకటి
ఆకాశం విరిగిందా?
అగ్నులు కురిసిందా!

గర్భాగ్నుల భూగోళం
ఫెళ్లున పగిలిందా?
ఉప్పొంగిన జలధులు
జగత్తులో ఉప్పెన
తెచ్చెనట - వచ్చెనట!

తూరుపు చంద్రుడు
పడమర భానుడు-
కర కర పొడిచారట!
చర చర నడిచారట!

మరగి కరగి ప్రగతి
పడగవిప్పి బుసలు
కొట్టి రివ్వున దూకిందట!
దోపిడీల పాదం
చాటున పవళించిన
గోరీల్ సైనిక శిబిరాలై
శత్రు సంహార యాత్రలో
కలిశాయట తెలిసిందా?

కూటికి కుమిలే
శ్రామిక జనావళి
కణ కణ మండే
మహాగ్ని గోళమై
నిప్పులు వర్షించిందట!

అజ్ఞానం అన్యాయం
తిని తిని అజీర్ణం
చేసిన అజ్ఞానుల-
అనాధుల పాలి కేకలవి!

కనువిప్పిన కష్టజీవి
జగత్తు నొసట
తిరుగుబాటు
తిలకం దిద్దెను!
ప్రతిమనిషీ ప్రేలిన
పిస్టల్ గుండు!
అడుగడుగూ
బాకై నడుస్తోంది!
అటో ఇటో నేటితో
తెగిపోతుంది—!

రెండే రెండు **వర్గాలు**గా
శత్రు శిబిరాలుగా
జగత్తు చీలింది!
నిర్బంధం నిషేధం
నిరంకుశ ప్రభుత్వాల
మరణపు కోర్కెలు!
మరణపు మూల్గులు!
పెట్టుబడి దారీ
సమాజానికి మందిచ్చేందుకు
ట్రూమను దొర డాక్టరు;
అటం బాంబులతో
హాజరు పడ్డాడట!
దేశ దేశ ధనికులంత
తయారుతిని తుది
యుద్ధానికి సిద్ధమైరి
మానవ ద్రోహులు
చేరిన దోపిడీల
శిబిరంలో-
సకల లోక
శ్రామికులారా!
క్రాంతి దూత
శాంతి నేత
కామ్రేడ్ స్టాలిన్
హిట్లరు పుర్రెలపై
నిర్మించిన కార్మిక
కంచుకోట అది!

బానిసలు బాధితులు
పాలితులు పీడితులు-
చేరిన శ్రామిక
శిబిరం అది!
అదే అదే **మాస్కో**!
అదే అదే భవిష్యత్తు!
బ్రహ్మాండం పగలతన్ని
ప్రభవించిన నూత్న జగతి!
నెత్తుటి పిడికిలి
ఎత్తిన న**వ**జగత్తు!
అటో ఇటో
తేల్చుకోండి!

తెలంగాణా వీరులారా!

"మీ యెదుటే
సాయుధులై
మీ వాండ్రవి
మీ యాండ్రవి
ప్రాణాలను
మానాలను
హరియించిన
నర పశువుల
పగ దీరగ
తెగ నరకుడు!"

— బి. రామారావు

చిన్న కథ

మత్తానయ్య మరణం

రాం పా

ఆ వేళ సాయంత్రం అందరూ సకాలానికి చేరుకున్నారు. పగల్లా పెంకులెగరగొట్టిన గాడ్పులు సాయంత్రానికి వడగాలిగా తిరిగేయ్. 'ఈ ఎండలో ఏమౌతాం?' అనే ప్రశ్నయే కలగలేదెవళ్ళకీ.

అంతా సమావేశమయ్యారు - వీరారెడ్డి, రామిరెడ్డి, సుభాన్, యల్లమంద, కమల- అంతా సమావేశమయ్యారు. కమల - అంతగా పెద్ద కవి గాకపోయినా - కరపత్రాలు, నినాదాలు వ్రాయటంలో, ఆంధ్రమహాసభ పోరాట సమాచారాన్ని ప్రచారం చేయటంలో నిమగ్నమై పోయింది. అచ్చుపనంతా ఆమెది. గెరిల్లా శిక్షణ రామిరెడ్డి, సుభాన్‌లది.

అంతా సభచేరి అలాగే మౌనంగా కూర్చున్నారు. కొన్ని నిముషాలలాగే గడిచిపోయాయి ఉబ్బెత్తుగా తృళ్ళిపడి లేచాడు యల్లమంద.

"మెకమయిందీ, మేకయిందీ ఇప్పుడే తేల్చేయాలనుకొంటున్నాను; ఓయ్..." అన్నాడు యల్లమంద, తన తలపాగా, చంకనున్న కంబళీ, క్రింద పెడుతూ. అతను కళ్ళు మెదిపినరీతీ, పిలక ఆడించినరూ- మరొక్కమారైనా అతన్ని విననీయనంత ఆనందాన్ని కలిగించింది మిగతా సభ్యుల్లో.

'అయ్యో. నోర్లల్ల బెదతవేం రామిరెడ్డీ, సెప్పేదినక... ఆడి దుంపతె, ఆ కుక్కల నా కొడుకు మత్తానయ్య ఉండాడే - ఆడి పని పట్టాలింక!... దొరికిన్నాడే ముండా కొడుక్కును న్నాకెత్తనయ్యా అంటే చీనివాచరావుగారు 'అహింంచో' అన్నారు... ఆడిప్పుడు ఏకు మేకై కూకున్నాడు." అన్నాడు యల్లమంద.

'ఇంకా నీ దేవరపోతుగోల వదల్లేదేమే, యల్లమందా!' అన్నాడు రామిరెడ్డి నవ్వుతూ.

యల్లమంద అగ్నిపర్వతంలా పెఠిల్లుమన్నాడు.

'ఏంటో, నువ్వు సెపుతుంటి! ఆ యెదవనాయాలు ఊరూరందర్నీ దేవరపోతుసే సత్తావుంటుంటే, మీకేమీ సీమ కుట్టలేదుగాని, నా దేవరపోతుకోసం ఏడుత్తున్నానంట!... ఏం మడిసో సూడమ్మా కమలమ్మా! యేలాకోలానికైనా యేళా పాళా వుండాల... ఆయాల దొంగనా కొడుకుని లాక్కొచ్చి కొంకులు తెగయ్యండ్రా అంటే చీనివాచరావుగారు వొద్దన్నారంట: అందుచేత వదిలిపెట్టేసిరంట!.. అందుకే మెట్రేగిపోతన్నాడు యదవనాయాల! ఆ రజాకారుల్లో సేరి

కసిబట్టాడంటే బట్టడూ?...అయినా ఈరా రెడ్డి మాకు కేంలే - పోతే ఊరేపోద్ది"

'హారే, అదేమిటి యల్లమందా! అల్లా అంటావ్? హాస్యానికికూడా అంత కోపమా? హాసికాలకి వేళకాదని తెలీక అన్నాడు రామిరెడ్డి దానికిలా అనేస్తావా?...మరెవరికో సానికంటున్, మనమంతా సీతమ్మతల్లినీ, దాదాని పోగొట్టుకొంటు?" అన్నాడు సుభాన్.

'సరేనయ్యా, నాదే తప్పంటీనిగా... చమించండి. ఏమైనాగాని ఆ మస్తానయ్య నెత్తురు కళ్ళచూసందే నాను నిద్రబట్టదను కోండి...ఇంకా ఎంతమందిని పొట్టపెట్టుకుందామనుకుంటున్నాడో ... తెలంగాణా సీతమ్మలమీదా, తెలంగాణా దాదాల మీద పెమాణంచేసి చెప్పుతున్నా. ఆ నంజకొడుకుని పేణాలు తియ్యందే తిరిగి రాను. 'ఊఁ' అనండి సాలు. నేనెల్లాగైనా సంపకమాన్న."

అందరూ ఆలోచనలో పడ్డారు, ఇంక ఏమైనా మస్తానను యల్లమంద సంపక మానడు.

* * *

మస్తాన్...

ఎక్కడికి వెళ్ళినా, తన కళేబరాన్నింకా అంటిపెట్టుకున్న కాళ్లు, చేతులూ ఎలా కదులుతున్నా, జగన్నాధరెడ్డి నల్లగొండ పారిపోయినప్పట్నుంచీ, తన్ను గొల్లయల్లమందాయిగాడు పట్టుకొని సంఘం వోళ్ళకి అప్పజెప్పినప్పట్నుంచి తన నవాబ్ టోపీకి అవమానం జరిగినట్టే, తన ఎర్రని మిడిగుడ్లకు అధికారం తగ్గినట్లే, తన చేతిలోని కంచీకి ఉద్యోగం ఊడిపోయినట్టే భావించాడు. ఆవేళ శ్రీనివాసరావుగారే క్షమించాడు పొమ్మనకపోతే తనప్రాణాలు ఆ గొల్లయల్లమందాయిగాడి చేతుల్లో పోయి ఉండేవే.

ఒక కాఫిర్ ముండాకొడుకు తన్ని క్షమించడం! ఒక గొల్ల యల్లమందాయిగాడా తన్ని ఉరితీస్తానవడం!! కాలం మారిపోయింది. మస్తానయ్య దృష్టిలో.

గ్రామమంతా కట్టుగట్టి ఏకమై ప్రతిఘటిస్తూవున్నా, తను కూడా ఈ సంఘం నాయకుల్ని అవకాశం చూసుకు మట్టుపెట్టాలని ప్రయత్నిస్తూవున్నా, నిజానికి మస్తానయ్య చచ్చిపోయినవాళ్ళల్లోనే జమ.

ఎంతైనా దేశముఖు జగన్నాధరెడ్డికి తనమీద అభిమానం పోలా. తన ప్రాణాల కోసం పారిపోయినా వెంబడే వందమంది రజాకార్లని పంపిచ్చాడు తనకోసం.

రజాకార్ల నిలయానికి పహరా కాస్తూవున్నా, నాయకులకోసం ఉచ్చులు వేస్తూవున్నా అతన్ని కసి తరుముతూనే వుంది. పేగులమ్మి పీకనులిమి ఒంటిమీద నగలన్నీ తానూ, పెళ్ళామూ ఒల్చుకుంటూవుంటే కసి కిటికీలోంచి తొంగి చూచింది. రాత్రింబవళ్ళు నీడలా తరుముకొస్తోంది తను చేస్తూన్న పాపాలన్నీ కళ్ళారా చూస్తూ, జాబితాలు తయారు చేస్తోంది. చీకట్లోకూడా పిల్లికళ్ళతో కనిపెడుతోందికసి. మస్తానయ్య ఈ సంగతే కనిపెట్టి వుంటే తన పంచప్రాణాలన్నీ బిగబట్టి ఉండేవాడు.

ఇప్పటికే మస్తాన్ మృతతుల్యుడుగా తయారయ్యాడు. అతను ఏపనిచేసినా, ఎట్లాంటిపనుల్ని నిర్వహించినా అతను మనస్ఫూర్తిగా చేస్తున్నవి కావు. అతని కీకనిండావున్న అత్యాశగాని యల్లమందాదులపై తీసుకోవలసిన ప్రతికక్షా దాహం కాని కారణం కాదు. తన మూఢమత నమ్మకాలను దోపిడీచేసి, తమ దౌర్జన్యానికి సాధనగా ఇతన్ని కలుపుకొని, వారి నిర్బంధంలో నడిపించటమే రజాకార్లు ఇతనిపై సాధించుకొన్న విజయం.

అతనిలో ఇప్పుడున్నది ప్రతీకార వాంఛ—ఒక ప్రత్యేకలక్ష్యంలేదు మళ్ళీ—కేవల ప్రతీకారవాంఛ, తనజీవితంమీద ప్రతీవాడిమీదా, చివరకు రజాకార్లమీదా అందంమీదా అతనికున్నదిఒకే ప్రతీకారవాంఛ.

ఈప్రతీకారవాంఛయే మస్తాన్ ఆత్మను సర్వశూన్యంచేసి నిస్పృహలో కాల్చివేస్తోంది. అయినా ఇంత క్రూరంగా ఇంతఘోరంగా ఇదివరకెప్పుడూ—దేశముఖు జగన్నాధరెడ్డి హయాంలోకూడా—తాను ప్రవర్తించి వుండలేదని అతనికి తెలుసు. అతని నైతికబలం పారిపోయింది; పాపం, నీచుడైనా ఆ పట్వారీ వెంకట్రావు తన చర్యల్ని సమర్థిస్తూ తన మనస్సుకుబలాన్ని కలిగించేవాడు. ఆ ఒక్కణ్ణి ఈ గొరిల్లాలు పొట్టపెట్టుకున్నారు. కాంగ్రెస్‌లో జేరి కేశవరావుగారి శరణుజొచ్చినా దిక్కులేకపోయింది. ఆ హరిగాడు వెనకపోటు పొడిచాడు వెంకట్రావుగార్ని, కాంతారావుగార్ని. మొత్తంమీద అతని నైతికబలం దిగజారిపోయింది. తనకున్న ఒక్క ఆధరవూ నేల రాలిపోయింది.

ఇంక దేశముఖు జగన్నాధరెడ్డి తనకు సహాయంగా పంపించిన రజాకార్లపై తానే నాయకత్వం వహించి, తన అధికారాన్ని విస్తృతం చేస్తూ విసునూరు నఏకచ్ఛత్రాధిపతిగా పాలిద్దామనుకున్నాడు. స్మశానమైన కొంపలు ... మానభంగాలైన అతివలు... శిరస్సులు తెగిన మనుష్యులు.. ఎంత భీభత్సం!!! తను రజాకార్లపై అధికారాన్ని సంపాదించగలగటంపోయి, వాళ్ల చేతుల్లో బానిస అయ్యాడు. ఏమైనా విసునూరులో తన అధికారాన్ని వాళ్ళు నిల్పకపోరని విశ్వసించాడు.

తన ఘోరదురంతాలన్నింటినీ నయాన్నో, భయాన్నో ప్రజలు మరచిపోకపోరని, తన అధికారాన్ని గుర్తించి 'నీ బాన్చనిదొరా, నీ కాల్మొక్తా!' అనకపోరనీ, ఆ విధంగా తన గౌరవాన్ని పునః ప్రతిష్ఠించుకోగలననీ విశ్వసించాడు. గౌరవంతో, అధికారంతో పైకి వచ్చిన తను చచ్చుగోడీగా కాకుండా దేశముఖు అయి మీసాన్ని మెలివేయవచ్చునని అనుకున్నాడు. పూర్వపురోజుల్లోని ధనికుల దర్జాఅంతా కళ్ళకు కట్టినట్లయి ఒక్కసారి పెల్లుబికిపోయాడు.

కానీ, అతని కలలన్నీ అచిరకాలంలోనే కరిగిపోయినట్లు గ్రహించుకోగలిగాడు. ఇంతవరకూ తాత తాతలనుంచీ వస్తూన్న టోపీ తప్ప వేరే కొత్త ఆస్థి ఏదీచేరలేదు, సంఘాన్ని అదిమిపెట్టి కలిగినంత ఆస్థిని సంపాదించుకోగలుగుతాననే ధైర్యము కూడా అతనికి సడలిపోయింది. కొంపలంటించి ఆ భీతావహంలో పారిపోతున్న ఆడవాళ్ళ రొమ్ముల్ని చీరి, నగలు అప

హరించేవాడు. రజాకార్లు పసిగట్టిగా, డబాయించి లాక్కొనేవారు. పైగా 'ముక్కలకోడకు ఇంత మింగుడు' కోసానికి ఏడుస్తున్నాడని, తిట్టేవాడు. దానితో అతనికి అర్థమైపోయింది వినుమూరుపై అతని అధికారం ఇంక మిథ్యయని. వారిమాటని తిరస్కరించినట్లయితే వారి చేతుల్లోనే బూడిదకాక తప్పదని గ్రహించాడు

హిందువులు కానీండి, ముస్లింలు కానీండి సామాన్యులంతా మస్తాన్‌మాట వినేసరికి గడగడలాడేవారు. అతను కనుమరిగేసరికి మెటిమెలు విరుచుకొంటూ శాపనార్థాలు పెట్టేవారు. ప్రజలద్వేషాగ్నిలో శలభంలా మాడిపోతున్న అతని మనసుకు అతను చేసిన మానభంగాలు, దోచిన సొమ్ములూ, తాగిన రక్తం ఏవిధమైన ఆత్మశాంతినీ సంపాదించలేకపోయాయి.

* * *

ఒక్కసారి మంచులాంటి మౌనం పగిలింది.

"దానికేమి? యల్లమంద చెప్పింది అక్షరాలా నిజమే." అన్నాడు వీరారెడ్డి. ప్రశాంతంగాస్థిమితంగాతనఆలోచనల్లోంచి బయట పడ్డాడు వీరారెడ్డి. "మస్తానయ్య మన తెలంగాణా ప్రజలకందరికీ ద్రోహి. వాణ్ణి ఉరితీయాల్సిందే. మన ప్రజలంతా వాడి పాపఫలాన్ని చూసి సంతోషించేందుకు అనువైన స్థలంలో చెయ్యాలాపని. వాడి గుండెలమీద, వాడెందుకు ఉరి తీయబడ్డాడో తెలిపే అట్టనుకూడా వ్రేళ్లాడ గట్టాలి - మిగతావాళ్ళకుకూడా పాఠం చెప్తుకుంది - వాళ్ళని దయదలచి మనం విడిచినా అంతా సర్వనాశనమయ్యేదాకా వాళ్ళు మనల్ని విడిచేలాలేరు. ఇంక నాకూ, రామిరెడ్డికీ అనుమతివ్వండి. యల్లమంద కార్యభారాన్ని నెరవేరుస్తాం."

వీరారెడ్డి మాటలతో యల్లమందలో ఉత్సాహం మిగతావారి ముఖాల్లో చలనమూ కలిగాయి. మస్తాన్ ద్రోహిమీద వారికి కట్లాంటి అసహ్యమున్నా ఈదృష్టికి వాళ్ళు రావటం ఇదే మొదలు.

'నువ్వు బాగానే సెప్పినవ్ బావా! దొంగనాకొడుకులకు శాస్తిసెయ్యాల్సిందే' అన్నాడు రామిరెడ్డి

'నువ్వుకాదు వీరారెడ్డి నేను చేస్తే చాలదా?' అన్నాడు సుభాన్.

"సరిపోయింది, ఈ వంతుల్లో పొద్దు కుంకేటట్టుంది. ఇంకా దీనికెవళ్ళు సమర్థులో ఆలోచించండి. మందచేరటం మరానికి చేయని...—" అంది కమల.

"ఎందుకొచ్చిన బాతాఖానీ ఇది! ఒకటి మాత్రం సూడండి. వాణ్ణి పదిమంది లోనూ విచారించి మరే ఉరిదియ్యాలా యిది!? అన్నాడు రామిరెడ్డి

"పోనీ మనమే చేద్దాం" అన్నాడు వీరారెడ్డి.

"ఏటి సూత్తారు! మీకు గ్యానం లేకపోతేసరి. నాను మాట తిన్నగారాదుగాని, ఇంతమంది సూచున్నాం ఆడి సంగతులన్నీ చర్చించాం ఆడి విసుకు తిన్నవాడేగాని ఎవని వాడెవడూ లేడాయను ఊర. మనం సబుబైన ప్రజా ప్రతినిధులం. కనుకే ప్రజల పేరున నిర్ణయించి ఉరితీద్దాం ఆ పని నాకు వదిలివేయండి" అన్నాడు సుభాను.

యల్లమంద ఒక్క ఎగురెగిరి నేలమీద కర్రతో బాదాడు సంతోషంగా టుర్ ...” మంటూ.

* * *

ఎన్నో గృహ దహనాలలో, మాన భంగాలలో, అరెస్టులలో, తుపాకీ కాల్పులలో పాల్గొనడమే కాకుండా దేశముఖు జగన్నాథరెడ్డి భవనానికి కాపలా డ్యూటీ కూడా వహించేవాడు. ఆ భవనంలో క్రింద భాగం నిండా పోలీసులు. మేడ మీద రజాకార్లు, దొడ్లోను, వీధి అరుగుల మీదా గూండాలు కాపరం చేస్తున్నారు.

ఆ వేళ రాత్రి ఆ భవనాన్ని కాపలా కాస్తున్నాడు మస్తాన్. అడుగులు చప్పుడు చేసుకుంటూ భుజంమీద తుపాకీ త్రిప్పుతూ సెంట్రీలా నడుస్తున్నాడు మస్తాన్.

గాలి తరంగాలు ఆకుల్ని అల్లల్లాడిస్తున్నాయి. వాన కురుస్తోంది. తుంపర తుంపర్లుగా వాన పడుతోంది. ఆకాశం మేఘాలతో నిండి కారునల్లగా ఉంది. చందమామకాని, చుక్కలుకాని దూరలేనంత చిక్కని రాత్రి. చెట్ల తలలుకూడా మరింత చిక్కనిచీకట్లనుగూడ బెట్టుకుంటూ ఆ ఆకాశపు చీకట్లో లీనమయ్యేలా తమ శిఖరాలను విరజిమ్ముకొంటున్నాయి.

ఒక గొలుసుమీదనుంచి క్రమం తప్పకుండా నడుస్తోన్నట్లు వెనక్కు ముందుకీ కదులుతున్నాడు మస్తాన్ అప్పుడప్పుడు గేటు అంచుమీద ఆనుకొని ఏదో ఆలోచిస్తూన్నట్లో, ఏదో ఆనహిస్తోన్నట్లో నించున్నాడు. గడీ కెదురు వీధిలోని చీకట్లోకి చూస్తూమస్తాన్ అలా నిలచి ఉండగానే, వెనకనుంచి మంచి బలమైన పిడికిలి గడ్డ మీద గుద్ది కంఠాన్ని బిగపట్టింది. ఊపిరికూడా ఎగపీల్చలేకపోయాడు. మస్తాన్ - వెల్లకిలా పడగొట్టబడ్డాడు. నేలమీద మొదలు నరికిన వృక్షంలా పడేసరికి కొన్ని జతల చేతులు అతని కంఠాన్ని చేతుల్ని, కాళ్ళనీ నొక్కిపట్టాయి. ఎవరో ముక్కుపుటాలకు యిరుపక్కిప్ప బిగించారు. తనంతటదే బలాత్కరించి తెరుచుకొన్న నోట్లో ఎవరో గుడ్డపీలికలు కుక్కి ముఖమంతా ఒక తువ్వాలుతో చుట్టబెట్టారు.

వాడికి తెలివి వచ్చేసరికి గ్రామంబయట గోతుల్లో తన కళేబరం వెల్లకితలా పడి ఉందని తెలిసింది. కాళ్ళూ చేతులూ కట్టబడి వున్నాయి. పైన నల్లని ఆకాశం గోరీకట్టినట్లుంది.

తనకు రెండువైపులా నీడలాంటి బొమ్మలు కదలాడుతున్నాయి ఆ వ్యక్తులెవరో అతనికి అస్పష్టంగా అనుతున్నారు. ప్రక్కచెట్టు కొమ్మమీదనుంచి వలంపాటి త్రాడొకటి వ్రేలాడుతూకల్పించింది “చక్కగా జారుముడి వేయి” అంటున్నారెవరో.

తన మృత్యుదేవత పరిహసించినట్లయింది. వారి అట్టహాసం చూచి తనలో తనే నవ్వుకున్నాడు. తన కత్తికెప్పుడూ ఇంత ఆలోచన లేదు. తాను నిరాయుధులైన ఏమెరుగని గోరిల్లాలను వరుసగా నిలబెట్టి కత్తివేటుతో తలలు నేలకురాల్చాడు. తనను అడ్డుకొన్న ఆడదాన్ని తనివితీరా అనుభవించి రెండుకాళ్ళను సాగదీసి రెండుచెక్కలుగా నరికివేశాడు.

(మిగతా 55వ పేజీలో)

అజేయ శక్తి

'నరనారాయణ'

తరతరాల తరబడిగా
జాగీరుల దోపిళ్ళకు
దేశముఖుల దౌష్ట్యాలకు
సాహుకార్ల మోసాలకు
ఉద్యోగుల లంచాలకు
అధికారుల బెదిరింపుకు
దరిద్రాలకు కరువులకు
శిస్తు, పన్ను బకాయిలకు
ఆగలేక వేగలేక
పీడితులూ తాడితులూ
కదలినారు కదలినారు
నైజాం నరకాసురుడు
మరతుపాకీ కెర చేస్తూ
చెరసాలలో బంధిస్తూ
చెల్లెళ్ళను చెరబడుతు
ఇళ్ళుకొల్ల గొడుతుంటె
అవమానం భరియిస్తూ
మానం మర్యాద లేని
హీనులవలె బ్రతుకలేక
రోషంతో ప్రజలంతా
భీషణశపథములు చేసి
భుజగములై బుసకొడుతు
బెబ్బులులై బొబ్బలిడుచు
తిక్కయ్యలు తిమ్మరుసులు
కోటములై వాటమెరిగి
వేసేగొడ్డలి వేటుకు
విసిరే వడిసెలరాతికి
పొడిచేబల్లెపు పోటుకు
పెట్టేసమ్మెట పెట్టుకు
అసఫ్ జాహీవంశపు
సింహాసన మదురుతోంది
మగటిమితో మగువలంత
మల్లమ్మలు మాంచాలులు
రుద్రమలై శతృవులను
అదలిస్తూ ఎదిరిస్తూ
కంట్లో కారంచల్లుతు
కొడవళ్ళతో కొడుతుంటె
కొండల్లో గొరిల్లాలు
పొదల్లోన పొంచియుండి
పిస్తోళ్ళతొ పేల్చుకుంటు
రైఫిళ్ళతొ కాల్చుకుంటు
ముప్పతిప్ప లెడుతుంటె
తాళలేక తట్టుకొనక
పోలీసులు మిలటరీలు
రజాకార్లు బేజారెత్తి
తోకముడిచి తోవబడితె
పేదవారి నెత్తుటితో
పందుగుడిచి చిందులాడె
జాగీర్దారుల జమీన్దారులు
కట్టుకొన్న గాలి మేడ
ఆగలేక ఊగులాడి

ఫెళఫెళఫెళ ఫెళ్ళుమని
తూలినేల కూలుతోంటె
వెలుగుతోంది తెలుగువెలుగు
దిగంతాల ధగధగమని
నల్లగొండ బల్లిదము
ఓరుగంటి వీరత్వం
కరీంనగర్ గట్టిపట్టు
ఆదిలాబాద్ అజేయశక్తి
మెతుకుసీమ మేరుధృతి
కారడవులకాల్చివేసి

భస్మీపటలంచేసి
ప్రజాప్రభుత్వానికొరకై
బాట బాగుచేస్తున్నవి
బాధితులు బీదప్రజలు
రైతులు కూలీలే తమ
రాజ్య స్థాపన జేసుక
తరుగులేని సంపదలతో
కరువు దరిద్రాలులేని
వ్యాధులు బాధలులేని
భూతలస్వర్గం నిర్మిస్తారు!

(53 వ పేజీ తరువాయి)

దొర్లు కొంటూ పారిపోవాలని కూడా మస్తాన్ ప్రయత్నించాడు; కాని ఒక్క తన్నుతో తనని సరియైన ప్రదేశానికి మార్చాడు ఎవరో.

ఇట్లా అస్పష్టమైన ఈ వ్యక్తుల్ని గుర్తు పట్టాలని మస్తాన్ ప్రయత్నించాడు. తాను ఊపిరిబిగబట్టగలిగి బ్రతికి బయటపడ గలిగినా, లేక ఎవరైనా తనవాళ్ళు ఆ ప్రాంతాలకు చూడవచ్చినా ఈ హంతకుల జీవితాల్ని ఛిల్చివేయవచ్చునని ఆతని ఆశ

సుభాన్!...తనను ఉరి తీయటానికి పూనుకొన్నది సుభానా?...కమల! ఇది కూడానా? 'మనమెక్క ఏదుస్తుండు'! అనుకున్నాడు.

'రెడ్ రిపబ్లిక్ ప్రజలు అర్పించిన రక్తాశ్రువులకు తర్పణంగా......" కమలమ్మ తియ్యగా నివేదించింది.

మస్తాన్ భయంతో గిలగిలా కొట్టు కొంటున్నాడు ఉరిత్రాడు క్రిందికిజారింది. ఎన్నో బలీయమైన హస్తాలు త్రాటిని అతని కంఠానికి బిగించి కళేబరాన్ని పైకి లాగాయి. భూమికి రెండడుగుల ఎత్తులో అతని శరీరం వ్రేలాడుతోంది. కాస్సేపు గిలగిలా కొట్టుకొని ఆగిపోయాయి అతని చేతులూ...కాళ్ళూ.

దూరంగా గడీలో మంటలు చెల రేగాయి. నాలుగు దిక్కులనుంచిమంటలు చుట్టుముట్టుతున్నాయి. లోపలనుంచీ, పైనుంచీ తుపాకి కాల్పులు దిక్కులు పిక్క టిల్ల జేస్తున్నాయి. అగ్నిలోంచి దూకి పరుగిడబోయే రాక్షసులందరూ గొరిల్లా తుపాకులకు నేలకొరుగుతున్నారు.

తెల్లవారేసరికి పోలీసుల, గూండాల, రజాకార్ల దుమ్ము మిగిలింది. జనం తండోప తండాలుగా మస్తాన్ శవాన్ని చూస్తూ, వాడి మొఖంమీద ఊస్తూ, వాడిపీడ వది లించిన దేవతల్ని స్మరించుకొంటున్నారు.

ఆశాగీతం

శ్రీ నార్ల చిరంజీవి

కొరడారక్కసి ప్రతివేటుకి
హాజారపుముక్కోణం రాతి పై
నిరుపేదలు రైతులు చెల్లించిన
నల్లని చేమనెత్తురు !
కటకటాల కత్తులకవచంలో
తారాడే చక్కనిచీకటిలో
మెసలే లక్షలగుండెల
గుసగుసల కసి !—
ధనవంతుల ఉక్కుగాలానికి
ఎరగా పొరలే నిర్భాగ్యుల
తెగిపోయిన మస్తిష్కం
తేల్చిచెప్పిన భవిష్యం !
ఉరికొయ్యల వేళ్లాడే
పీకులబిగిసే పెదవుల
తుది కదలికలు !—
అమరుల మృతవీరుల వీడిన
ఆత్మల ఎడతెగని విలాపన !

పదవీ సర్పనవాశ్లేషంలో
బుక్కాలు పఠిస్తూ నియంతలు నర
హంతలు
సాగించే నరయజ్ఞధ్వంసనకై
విచ్చుకునే శతసహస్రనిటాలాక్షి
చ్ఛటాఛటలు !

అనంతంగా జ్వలిస్తాయ్
విశాల విశ్వగోళం, అతి
క్రమించి ఆక్రమిస్తాయ్ !
అశాంతు లనాథు లభాగ్యులు
ప్రకటించే 'ప్రతిజ్ఞాపత్రం'
ప్రతిచోటా, ప్రతినిమిషం
విప్లవజనతాకంఠం నినదిస్తుంది !

అవమానం తలవని తావుల
తావులు వెతికే మానవుడా !
నీ ఆశలు ఫలిస్తాయి.

సమీక్ష

విశాలాంధ్ర

సంపాదకుడు: శ్రీ శెట్టి ఈశ్వరరావు
చందా: ఏడాదికి రు 3 లు
కార్యాలయం: 9-సి. పోలియప్ప మొదలి స్ట్రీటు, మైలాపూరు : మద్రాసు

★

'విశాలాంధ్ర' మూడు సంచికలు మా కార్యాలయానికి చేరేయి. శ్రీ ఈశ్వర రావుగారు ఈవరకే ప్రసిద్ధ కథయితలుగా ఆంధ్ర పాఠకలోకానికి చిరపరిచితులు. ఇక—'విశాలాంధ్ర' నిర్వహణలో ఉత్తమ సంపాదకులు గా రుజువు చేసుకుంటున్నారు.

'జర్నలిజం'లో 'నిజాయితీ'ని గురించి ఉపన్యాసాలు దంచి సన్మానాలుపొందిన పెద్దమనుష్యులు సైతం యథార్థాల్ని ప్రదర్శించ వలసి వచ్చేసరికి, అచ్చులో అబద్ధాల్ని సేవించి, డబ్బునీ, మొక మెప్పుల్నీ దక్కించుకుంటూన్న ఈ రోజుల్లో యథార్థాలు, న్యాయాలు నిరంకుశ శాసనాల క్రింద బలిఅయిపోతూన్న ఈ రోజుల్లో నిర్భీతిగా ప్రజాశక్తుల పక్షాన నిలబడి ప్రజావాంఛల్ని ఎలుగెత్తి చాటే 'విశాలాంధ్ర' వంటి పత్రికలు రావడం ఎంతైనా అవసరం! సమాదరణీయం. ఈ ఆశయ సాధనలో 'విశాలాంధ్ర' పాఠకలోకం యొక్క అపార ఆదరాభిమానాల్ని సంపాదించుకుంటోంది.

తొలిసంచికలో తొలిగీతంలోనే 'మాయలతో మాయవేల్పులతో' తెగమరుగున నిలబడి ప్రజల్ని మోసగించేవాళ్ళని 'విప్పండిక మీ వికారపు వేషం' అంటూ హెచ్చరించింది. మూడుకోట్ల తెలుగువారి ఆ గర్భశత్రువైన నైజాం నరకాసురుడిమీద 'విశాలాంధ్ర' తన చిత్రాలు, కథలు ద్వారా యుద్ధం ప్రకటించింది! శ్రీ సూరిగారి కథా, శ్రీ 'తాపీ' గారి చిత్రమూ ఈ ఆశయాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తున్నాయి.

రెండో సంచిక ఆంధ్ర జాతీయ పితామహుడు శ్రీ వీరేశలింగం పంతులుగారిని స్మరిస్తో ఉత్తమ వ్యాసాలతో గీతాలతో చక్కగా ఉంది.

మూడో సంచికలో "అసూయక స్త్రీలను మోసగించడానికి దుష్టవిటులు చేసే వాగ్దానాల"కన్నా భిన్నంకాని వాగ్దానాలతో, "సత్యాహింసల పునశ్చరణతో" "మోసపోక నోరెత్తిన ప్రజానీకంపై తుపాకులు ప్రయోగిస్తూన్న" "మన" ప్రభుత్వాల దారుణ దమననీతిని ఖండిస్తూ రాసిన సంపాదకీయం 'అపార బలసంపదగల అశేష ప్రజానీకం'యొక్క హెచ్చరిక అది!

శ్రీ 'ఆరుద్ర' 'మల్లీ యుద్ధం' గీత

(మిగతా 58 వ పేజీలో)

పట్టు వదలకోయీ!

* సుంకర సత్యనారాయణ *

గమ్యస్థానం చేరువరకు, నడి
కట్టు విప్పకోయి
పట్టు వదలకోయి ॥గమ్య॥

మిన్ను వొరిగినా
మేదిని కృంగిన
అన్నలు కొందరు
అలసి నిలచినా
భయభ్రాంతులూ - స్వార్థుల బలులూ
వేషంమార్చిన - వెన్నుజూపినా ॥గమ్య॥

పెనుభూతంబులు
విషసర్పంబులు
భీకర మృగములు
కాకి ఘూకములు
దోపిడిదొంగలు - టోపీదాసులు
దారికడ్డమై - తారసిల్లినా ॥గమ్య॥

నిరతమాపదల
వెరువక ఢీకొని
ఏకాకిగ యీ
కీకారణ్యం
దాటి పౌరుషము - ధైర్యశౌర్యములు
చాటినీవు నీ - బాటను పడితివి ॥గమ్య॥

కటికి చీకటులు
పటాపంచలై
అరుణోదయమౌ
తరుణము వచ్చెను
చలించకు, హిమాచలమురీతి, నిజ
బలము జూపి, అరిబలముల దరుముచు ॥గమ్య॥
గమ్యస్థానము చేరువరకు నడి
కట్టు విప్పకోయి
పట్టువదలకోయి – భాయీ
పట్టువదలకోయీ—

(57 వ పేజీ తరువాయి

ములో యుద్ధోన్మాదుల పైశాచిక ఊహల్ని బట్టబయలు చేస్తూ—

'రా, రా,
చీకట్లను కూకటి వేళ్లతో
లాగి పారేద్దాం
శాంతిని నరికే వాళ్లని
నరికి నరికి పారేద్దాం
చేతులు కాలకముందే
నిప్పును ఆర్పేద్దాం!

అని సోదర ప్రజానీకాన్ని ప్రబోధించారు. ఇదెంతో ఉత్తమ గీతం!

చెట్టుపేరు చెప్పుకొని మామ్మ కాయల మ్ముకునే రాజకీయ వేత్తల్ని దుయ్యబడుతూ 'అపర మాన్యులు' అన్నరచన చాలా బాగుంది శ్రీ పిచ్చేశ్వరరావు, శ్రీ సోమసుందర్ గార్ల కథలుకూడా నేటి జీవిత సమస్యల్ని చక్కగా చిత్రిస్తున్నాయి.

కాని శ్రీ గణపతి శాస్త్రిగారి 'మన్నిస్తావా?' అన్న గీతంలో—

"విన్నావా ఈచిత్రం? నిన్ను గూర్చి రాస్తేనట
పిన్న పెద్దకవుల్లో పేరుమోసిపోతుందట!"

ఇలాంటి వాక్యాలు రచయిత ఉద్దేశాలెలా ఉన్నా మరోలా ధ్వనించడానికి ఆస్కారం ఉందనిపిస్తుంది.

ప్రత్యేకించి చెప్పుకోదగ్గ శీర్షికలు 'మనలో మనం,' 'మెదడుకి మేత' కొత్త ఆలోచనలు రేకెత్తించడానికీ చైతన్యం పొందడానికి ఎంతగానో ఉపకరిస్తాయి!

ఇంకా-గెటప్ విషయంలో మరింత శ్రద్ధతీసుకుంటే 'విశాలాంధ్ర' అన్ని విధాల పత్రికా ప్రపంచంలో ఉన్నత స్థాయి పొందుతుంది.

కేవలం 3 రూపాయల చందాతో-అమూల్య విషయాల్ని అందిస్తూన్న 'విశాలాంధ్ర, ఆంధ్ర పాఠక హృదయాల్లో ఇతోధికంగా వర్ధిల్లుతుందని మావిశ్వాసం.

—అభ్యుదయ

★ ప్రగతి ★

శ్రీ రామకవచం సత్యనారాయణ

కన్నులలో రక్తపుజీరలు
కలంలో నెత్తుటిచారలు
కారుస్తున్నవి రుధిరపుధారలు
తీరని అవమానానికి గురియై
ఆరని దాహాలకు బలియై
హృదిలో మానని గాయం
పోరిన పగళ్ళు రాత్రులు
భూగర్భం ఛేదించును -
అణగారే అనాథులందరు
అదిగదిగో కదిలినారు
ప్రళయాలను సృష్టించే
విలయరుద్రులైనారదె !
కలకాలం కష్టించిన,
యిలనంతా ఛేదించిన,
బలంగల్ల వారంతా
బలగంతో కదలుతారు ;
తరతరాల మేలుబళ్ళు
దగ్ధం చేసేస్తారోయ్ !
పరపీడన పాలసలను
భస్మం చేసేస్తారోయ్ !!
కలిబాలి కబుర్లతో
కాలమిస్మింకా సాగదు,
పిల్లా, పెద్దా, ఒకటిగ
పిడికిళ్లను బిగించండి !
విశ్వశ్రేయస్సును కాంక్షించిందె
విజయభేరి మ్రోగుతుంది,
సంజల కెంజాయల్లో
జయపతాక లెగురుతాయి
సర్వశ్రామిక రాజ్యపు
సంస్థాపన జరుగుతుంది
చరిత్ర లభ్యుదయానికి
త్వరత్వరగా గమిస్తాయి !

అసమర్థుని జీవయాత్ర

శ్రీ గోపీచంద్

సీతారామయ్యది మధ్యతరగతి ఉన్నత వంశం. వంశం పేరు నిలబెట్టుకోబోయి, ఆస్తి నాశనంచేసుకుని, చిన్నప్పటి ఆశయాలను వదులుకొని, దరిద్రంతో, తన అనుభవ జ్ఞానశూన్యతతో, సంసారం దుఃఖభాజనం చేసుకుంటాడు. ఏమీ చేయ నిష్టం లేని, చేయలేని అసమర్థుడు. తను పుస్తకాల్లో చదివి నేర్చిన మిడిమిడి జ్ఞానంతో లోకమంతా తప్పు; సిద్ధాంతాలు తప్పు; ఆశయాలు తప్పు. నిర్నిమిత్తంగా బ్రతకడానికి వీలుంటే బ్రతకడం లేకపోతే చావడం అని తేల్చుకుంటాడు. ఈ సిద్ధాంతంతో లోకంలో జరిగే వ్యవహారాల్లో, ఉద్యమాల్లో, అన్నిట్లో నెరసులుమాత్రమే చూచి విమర్శిస్తాడు. దరిద్రంనుంచి, ఆకలినుంచి, సంసార పోషణభారంనుంచి తప్పుకునే మార్గంలేక వట్టి ఆలోచనలు, సిద్ధాంతాలు పూర్వపక్షాలు చేస్తాడు. "కళ్లెంలేని గుర్రం"లా తిరుగుతాడు. లోకం వీడికి పిచ్చెత్తిందంటుంది. రామయ్యతాత గూడ సీతారామయ్యకు పిచ్చెత్తిందంటాడు. తిరిగి తిరిగి ఒక మీటింగులోకి పోయి వదురుతుంటే రామయ్యతాత తన్నిస్తాడు. నిషా దిగుతుంది ఆలోచనలో నేచేసిన తప్పేమిటి అని అడుగుతాడు. రామయ్యతాత "జ్ఞానసంపాదనే చాలదు- అది సంఘశ్రేయస్సు కుపయోగపరచే మనస్తత్వము అలవరచుకోవాలి. పుస్తక జ్ఞానంతోటే లాభంలేదు. కోరికలను ఉదాత్తం చేసుకోవాలి." అని ధర్మోపన్యాసం చేస్తాడు. సీతారామారావుకు కనువిప్పైనట్లు తోచింది. ఆలోచనలో పడ్డాడు. కాని అతని పతనానికి లోతుల్లేవు. ఉపదేశాలతో బయటపడే రోజెప్పుడో గతించింది ఆలోచించి, ఆలోచించి "మిథ్యమిథ్య! మిథ్య గనకనే ఎటుతిప్పి చెప్పడానికైనా వీలుంది" అని అరిచాడు. శ్మశానంలోకి పరుగెత్తాడు. ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇది నవలలోని యితివృత్తం. శ్రీ గోపీచందుగారు కథను నడపడంలో సిద్ధహస్తుడు. మధ్యతరగతి పురానా కుటుంబాల్లో పుట్టిన మేధావులు, ఎల్లా ఎచ్చులకు, మొగమెచ్చులకూ బోయి, దివాలా తీసేదీ, ఏది చేయడానికి చేతగాక వట్టి ఆలోచనలతో జీవితాలు దుఃభాజనాలు

చేసుకుండేదీ, తమ జీవితంలో నిస్పృహ ఎంత వరకు వాళ్ళను దిగదీసేదీ సీతారామారావు జీవితంలో చక్కగా చిత్రించాడు. కాని సీతారామారావు జీవితంలో ఏ భావానికీ నిలకడ లేక, ఏ పనికీ చేతగాక ఉన్న వాడు ఆత్మహత్యమాత్రం ఎలా చేతనైందా అనిపిస్తుంది.

అతని భార్య మామూలు ఆ తరంతి సంసారాల్లో స్త్రీలు ఎంతెంతటి బాధలు ఎలా సహించేదీ, మొగుడు ఎంత హింసించినా కిక్కురుమనని ఆ మనస్తత్వమూ, చక్కగా చిత్రించాడు.

నవలంతటిలో ఒక్క రామయ్యతాతను మినహాయిస్తే, పుస్తకం చదివేవాళ్ళకి, లోకంమీద, సంఘంమీదా, ఉద్యమాల మీద అసహ్యం పుట్టాలి. మానవులంతా యింతేనా, ఇంత నీచమా అనిపిస్తుంది. సంఘంలో వున్న చెత్తనంతటినీ ఒకచోట చేర్చిపెట్టిన చెత్తకుప్పగా తయారైంది నవల.

ఈ చెత్తను కాల్చడానికి రామయ్యతాత జ్ఞానం చాల్లేదు. కారణం రామయ్యతాతది కేవలం లౌకికజ్ఞానంతోటి, జీవిత అనుభవంతోటీ కూడుకున్న సామాన్య జీవితమే గాని, ఒక ఆశయం, దాని ఆచరణ రూపమైన గమనతీవ్రతా (Dynamic) శక్తి కలది గాదు.

"అసమర్థుని అంతం"లో, ఐదో భాగం 17 వ పేజీలో యిచ్చిన రామయ్యతాత ఉపన్యాసం తప్ప మిగిలిన 200 చిల్లర పేజీలలో వ్యక్తపరచిన భావాలను విమర్శించడానికి వీల్లేదు. అవి అసమర్థుని భావాలు. వాటికి ఎక్కడా నిలకడలేదు. రచనలో రచయిత కనుపించకుండా చేయడంలో శ్రీ గోపీచందు చాలభాగం కృతకృత్యుడైనాడు.

రామయ్యతాత బోధన

"విజ్ఞానానికి తగిన మనస్తత్వం లేకపోవటంవల్ల ఇంత దారుణమైన సంఘర్షణ, పతనం భీభత్సం జరుగుతుంది. గనుకనే సంఘాన్ని మెట్టుతర్వాత మెట్టుపైకి తీసుకువెళ్తున్నాం. పరిణామం కప్పదాట్లు వెయ్యదు".

"ఈ పరిణామం ఒక ప్రవాహం వంటిది బాబూ; దీనికి కొండలు గుట్టలు అనేకం అడ్డం రావచ్చు. ఈ అడ్డంకులను తొలగించుకోడానికి అది ఒక్కొక్కసారి ప్రబల ప్రయత్నం చేయవలసిన అవసరం కలగవచ్చు. అది ఒకసారి మందంగా ఒకసారి ఉధృతంగా ప్రవహించవచ్చు. కాని అది ఎడతెరిపిలేని ప్రవాహం."

"సంఘంలో భిన్నవర్గాలున్న మాట నిజమే బాబూ! ఈ వర్గాల పోరాటం పరిణామానికి దోహదం యిస్తున్న మాటా నిజమే! కాని యీ వర్గాలు ఒకదానిమీద ఒకటి ఆధారపడి ఉంటున్నై. వీటికలయికే సంఘం అనే మాట మాత్రం మరచిపోకు బాబూ" అంటాడు.

ఈ మాటల్లో సంఘం శాశ్వతంగా వర్గసహితంగా ఉంటుందనీ ధ్వనిస్తున్నది. వర్గసహితమైన సంఘంలో వర్గపోరాటం పరిణామానికి దోహదమిచ్చే మాటా నిజమే. కాని ఈ వర్గపోరాటంయొక్క పర్యవసా

సంగా ఆస్తిదారుల వర్గం పీడించే వర్గం రూపుమాపి వేయబడుతుంది. ఇది విప్లవం ద్వారా జరుగుతుంది. కాని రామయ్యతాత పరిణామం గంతులు వెయ్యదంటాడు. సంఘాన్ని మెట్టు తర్వాత మెట్టు పైకితీసి కెళ్తున్నా నంటాడు. వర్గాలమధ్య ప్రస్తుతమున్న ఘర్షణ... జ్ఞానానికి తగిన మనస్తత్వం లేకపోవడం వల్లనే నంటాడు. "సోషలిస్టు విప్లవానికి ముందుగా, మానసికవిప్లవం తీసుకురావాలనే" రాయిస్టువాదనను స్ఫురింపజేస్తుంది. ఈ వాదన దీన్ని బట్టుకునే రాయిస్టులు కార్మిక కర్షకుల నిత్యజీవితావసరాల కొరకు నిర్మాణాత్మక పోరాటం కొనసాగించడానికి, తద్వారా స్వాతంత్ర్యంకొరకూ, సోవియటు విప్లవంకొరకూ పోరాడడం మానివేసి 'క్లబ్బు'ల్లో ప్రవేశించి మధ్యతరగతుల కొరకు రాయూలనే సిద్ధాంతాల్లోకి దిగజారారు.

జ్ఞానానికి అవసరమైన మనస్తత్వమేమిటి? మానవుడు వాంఛలను ఉదాత్తం చేసుకోడమే నంటాడు రామయ్యతాత. "అలా అయితే ప్రకృతిని మానవుడులోబరుచుకోగలుగుతాడు... ప్రకృతి శక్తుల్ని. పూర్తిగా అర్థంచేసుకున్నాక ప్రకృతికీ మానవునికీ సంఘర్షణ వుండదు. సాంఘిక పరిణామమే మానవునికి ఆనందంయిచ్చే మనస్తత్వం కలిగితే సంఘానికీ మానవునికీ ఘర్షణ వుండదు. మానవునిలో విరుద్ధ శక్తుల సంఘర్షణ వుండదు. మానవుడు పరిపూర్ణ మానవుడవుతాడు" అంటాడు.

ఈ మాటలు ఆదర్శవాదాన్ని (Idiolism) ప్రబోధిస్తవి. ప్రకృతిలోనూ సమాజంలోనూ విరోధశక్తుల ఘర్షణవల్ల మార్పు, పరిణామం జరుగుతూంది. ప్రకృతీ ప్రకృతిశక్తులూ ఏదో కొంత ప్రమాణంలో శాశ్వతంగా సృష్టింపబడి లేవు అవి పరిణామం చెందేదే. అభివృద్ధి చెందేదే మానవ సమాజానికీ ప్రకృతికీ సంఘర్షణ ఉంటుంది సమాజం శాశ్వతం, ప్రకృతి శాశ్వతం. ఈ ఘర్షణ శాశ్వతం. ఈ ఘర్షణ ఆగిపోతే పరిణామం ఆగిపోతుంది అలాగే సమాజం యొక్క భౌతిక జీవిత అవసరాలకూ సమాజంలోని ఉత్పత్తిశక్తులకూ ఘర్షణ ఉంటుంది. అవసరాలకు తగినట్లు యీ ఉత్పత్తిశక్తుల నభివృద్ధి చేయడం ద్వారా సమాజం ముందుకు నడుస్తూంటుంది. ఐతే వర్గరహితమైన సమాజంలో ఆస్తిహక్కు ఉత్పత్తిశక్తుల అభివృద్ధి నరికడుతుంది. అభివృద్ధియైన ఉత్పత్తిశక్తుల సమాజంలోని అధిక భాగానికి వ్యతిరేకంగా నష్టకరంగా ఉపయోగిస్తుంది. పెట్టుబడిదారీవర్గాన్ని రద్దుచేసి, ఉత్పత్తిశక్తులనూ, ఆస్తినీ సమాజపరం చేసినప్పుడే ఉత్పత్తిశక్తుల అభివృద్ధీ సమాజ అవసరాల నివృత్తి ఒకదానినొకటి అందుకుంటూ సమాజ పరిణామం సక్రమంగా సాగుతుంది.

పెట్టుబడిదారీ సమాజంలో విడిపోయే మధ్యతరగతి వర్గాలకుకూడా యిదే ముక్తి మార్గం. రచయితకీ సత్యం తోచలేదో? చెప్పటానికి ధైర్యంలేదో లేక ఇది అసంగీకారమో? ఏమో?

'అసమర్థుని జీవయాత్ర' మధ్యతరగతి కుటుంబాల, పటాటోపం బూటకపు మర్యాదలూ, కార్యాచరణ చూడని ఆశలనూ, ఆశయాలనూ, బాగా చిత్రించినా, పరిష్కార మార్గం చూపలేకపోతూంది. జ్ఞానం పుస్తకాల్లో నేర్చుకుని, ఒడ్డునకూర్చుని లోకజీవితవృత్తాన్ని వెటకారంగా విమర్శించే అనుభవశూన్యులైన మేధావులకు జీవితంలో ప్రవేశించమని చెప్పటం తప్ప జీవితసమస్యలను పరిష్కరించేందుకు, పోరాటంలో, వర్గపోరాటంలో, దోపిడిచేసే వర్గాన్ని రద్దుచేయ్యాలి అనే నిండు చైతన్యంతో, పట్టుదలతో పాల్గొనమని బోధించదు.

కాకపోగా అసమర్థుడు జీవితంలో లేవనెత్తిన తిండి, ఉద్యోగం, విప్లవం మొదలైన ముఖ్యసమస్యలన్నిటినీ వదలివేసింది. నవలలో సందేశంకన్నా సంశయమే గెలుస్తున్నది.

అంతేకాదు;

బ్రహ్మాండమైన ప్రజాపోరాటాలు అభ్యుదయోద్యమాలు నడుస్తూ కార్మిక కర్షక ప్రజాసామాన్యమూ, మధ్యతరగతి మేధావులూ నూతనంగా వీరోచితమైన చరిత్రలను సృష్టించే ఈరోజుల్లో అంతటినీ వెటకారంగా విమర్శించే అసమర్థుని జీవయాత్ర—సామాన్య లోకానుభవమూ కేవలం ప్రయోజనకారులు కావు.

ఏరచన అయినా లోకాన్ని చిత్రించడంతో సరిపోదు. అది సత్యమైన చిత్రణ కావాలి. కార్యాచరణకు మార్గదర్శకంగా వుండాలి. అసమర్థుని జీవయాత్ర లోకపు చెడుగును మాత్రమే చిత్రిస్తుంది. కాబట్టి అది సత్యచిత్రణ కాజాలదు. కార్యాచరణకు మార్గదర్శకమూ కాజాలదు.

— "కిరణ్"

మావద్ద దొరికే పుస్తకాలు

1. మహాకవి, గురజాడ అప్పారావుగారి

   'ముత్యాలసరాలు' 1—0—0

2. కళాప్రపూర్ణ, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి

   'స్వీయ చరిత్ర' 3—0—0

3. పి. వి. రాజమన్నారుగారి

   'ఏమిమగవాళ్ళు!' 0—12—0

4. తెన్నేటి సూరిగారి

   'సుబ్బలక్ష్మి కథలు' 0—12—0

5. నార్ల చిరంజీవిగారి

   'తెలుగు పూలు' (బొమ్మలతోసహా) 0—6—0

   " బొమ్మలులేని ప్రతి 0—3—0

6. 'తెలుగుతల్లి' సంచికలు —

7. 'అభ్యుదయ' సంచికలు —

వివరాలకు:

మేనేజరు, అభ్యుదయ, విజయవాడ

Regd. No. M. 4784 ABHYUDAYA, July '48 As. 6

అంజలీదేవి ★

నటిస్తున్న —

కథ
పైడి వెంకట్రావు

మాటలు
చలం

పాటలు
శ్రీశ్రీ

సంగీతం
రాంచంద్రపాల్
అమీర్‌బాయి కర్ణాటకి

★

ఆర్టు
జాదవ్ రావు
సి. హెచ్. ఇ. ప్రసాద్

కెమెరా
అజీత్

★

డైరెక్షన్
కుమార్

నిర్మాత:

టి. వై. ప్రసాద్

Wrapper Printed at P. N. Moorty Press, Vizayawada.